

అమ్మ

కె.ఆర్. శ్రీనివాస అయ్యంగార్

తెలుగు సేత:

మాడభూషణం రాజగోపాలాచార్య

అమ్మ

ప్రొఫెసర్ కె.ఆర్. శ్రీనివాస అయ్యంగార్

తెలుగు సేత:

ప్రొఫెసర్ మాడభూషణం రాజగోపాలాచార్య
ప్రిన్సిపాల్, యూనివర్సిటీ పి.జి. కళాశాల
(కాకతీయ విశ్వవిద్యాలయం)
నిర్మల్

ప్రచురణ
శ్రీ అరవింద సొసైటి
హనుమకొండ శాఖ-506 011

అమ్మ

౧

"మీరు శ్రీ అరవిందుల జీవితాన్ని వ్రాశారు. దానికి జతగా శ్రీమాత జీవితాన్ని కూడా వ్రాయకూడదా?" అని మిత్రులు నాతో తరచుగా అనేవారు. "ఏదీ నీవు వ్రాయగలవేమో చూద్దాం" అన్నట్టూ ఉండేదీ, వారి మాటల్లో 'వ్రాస్తే బాగుండును' అనే ఆకాంక్షా ధ్వనించేది. నిజానికి అది సాధ్యమా? అనంతమంటే శాశ్వతమంటే ఏమిటి అని ప్రశ్నిస్తే తెలిసేవిధంగా వ్రాయగలమా? అలాగే శ్రీమాత జీవితాన్ని వివరింపగలమా? ఆమె శ్రీమాత అని తప్ప మనకు ఆమెను గూర్చి తెలిసిందేమిటి? నిజాని కంతే. కాని మరో విధంగానూ ఆలోచించవచ్చు. అనంతమంటే ఏమిటని ఒక చిన్నారిని ప్రశ్నించారనుకోండి. తన కోమలమైన భుజాల్ని విస్తారించి "ఇదిగో ఇంత" అనవచ్చు కదా ! ఒక విధంగా ఆ చిన్నారి అనంతాన్ని వివరించడంలో సఫలప్రయత్నమే చేసిందనాలి. మనకు తెలిసింది కొంచెమే. అది ఏ విధంగానూ సమున్నత జ్ఞానానికి అడ్డంకి కాదు. స్వల్పజ్ఞానమే కాలక్రమాన గొప్ప విజ్ఞానంగా పరిణతి నందవచ్చు. ఒక్క గంతులో హిమాలయ శిఖరాగ్రాన్ని అందుకుంటామా? ఒక్కసారిగా సమున్నత సత్యాన్ని సాధిస్తామా? అది మనవంటి సాధారణ వ్యక్తులకు సాధ్యం కాదు. ఒక్కటొక్కటిగా అడుగులు వేస్తూ, జారుతున్న మెట్లపై కాలును జాగ్రత్తగా మోపుతూ, పలుగు రాళ్ళపై పదం వేస్తూ, ఆకాశంలో పయనించే నీలిమేఘాల అందానికి పరవశిస్తూ ఒకే గమ్యంగా అలసటనీ అంతరాయాల్ని లెక్కింపకుండా సమున్నత గిరిశిఖరాల్ని కైవసం చేసికో వలసిందే.

అందుకే మన దృక్పథాన్ని అనుసరించి మన పరిమితులలో శ్రీ అరవిందుల జీవితాన్ని శ్రీమాత జీవితాన్ని గూర్చి వ్రాయవచ్చు ఐతే అది అంత సజావైన పద్ధతి కాదు. కాలమాన పరిస్థితులనీ, చిట్టి పొట్టి కథల్నీ గాథల్నీ వివరిస్తూ మన కొలమానాలకు పరిమితం చేస్తూ పుట్టడం, పెరగడం బాల్య యౌవన కౌమారాలూ, చుట్టూ ఉన్న వాతావరణం, వారి పెంపకం వంటి వాటిని ఏకరువు పెడుతూపోతే ఆధ్యాత్మిక జీవన వికాసాన్ని తెలిపినట్లేమీ కాదు. ఆధ్యాత్మిక జీవనం దేశకాల పరిమితులకు అతీతమైంది. దానికి ఆద్యంతాలూ, వృద్ధిక్షయాలు ఉండవు. అలాగే అది పాశ్యాత్యమూ కాదు, ప్రాచ్యమూ కాదు. దానికి స్త్రీ పురుష భేదమూ లేదు. భూత భవిష్యద్వర్తమానాల్లో ఆత్మ నిత్య జాగృతంగా ఉంటుంది.

సిద్ధార్థుడు, జీసస్, రామకృష్ణ పరమహంస, ఆండాల్, సేంట్ థెరిసా, రాబియా–వీరంతా మానవులే ఐనా వారి చుట్టూ స్పష్టంగా దైవకాంతి పరివేషించి ఉన్నది. మన ఆలోచన పరిధులకి మన భావాలకి కేవల మానవపరిమితులకే అతీతమైన అస్తిత్వం వారిది. అనంత కాంతి పుంజాలుగా, ఆధ్యాత్మిక జీవన సారధులుగా శాశ్వతానందాన్ని అన్వేషించే పథికులుగా వారు సాక్షాత్కరిస్తారు. ఉదాహరణకి, బుద్ధుడైన సిద్ధార్థుడు సాధారణ మానవుడిలాగే పుట్టడం, పెరగడం సుఖ దుఃఖాలని అనుభవించడం, ప్రేమించడం, పెళ్ళాడటం, సంతోషాన్ని నిరాశను నిస్పృహను అనుభవించడం జీవిత యథార్థాలుగా మనకు కన్పిస్తాయి. కాని ఈ వాస్తవాలు, ఈ భౌతిక జీవిత విశేషాలు బుద్ధుని మహోన్నత ఆధ్యాత్మిక జీవన తత్వాన్ని వివరింపగలవా? బుద్ధుని సమున్నత వ్యక్తిత్వం ముందు ఇవన్నీ పేలవంగా అప్రస్తుతాలుగా కన్పిస్తాయి. మనం జ్ఞాపకం చేసుకోవడానికి స్మరించుకోవడానికి సాధారణ జీవన విశేషాలు పనికి వస్తాయి. అంతవరకే వాటి ఉపయోగం. అంతవరకే పరిమితం.

శ్రీమాత విషయంలోనూ అంతే. మానవ సహజమైన దృక్పథంతో చూస్తే మనకందరికీ పరిచితంగా ఉన్న శ్రీమాతయే[1]. అవ్యాజమైన ప్రేమకీ, ఆనందానికీ వాత్సల్యానికీ కాంతికీ జ్ఞానానికీ నిలయం శ్రీమాత. ఆమెను స్మరిస్తే పవిత్ర భావంతో మనస్సు నిండిపోతుంది. ప్రేమ గౌరవం సంభ్రమాశ్చర్యాలు ముప్పిరిగొంటాయి. అత్యంత విశాలమైన ఆధ్యాత్మిక జీవనతత్వాన్ని పరిచయం చేయడానికి కొన్ని ముఖ్యమైన సంఘటనలని మార్గదర్శకాలుగా గ్రహించి ముందుకు సాగవలసిందే. అట్లాంటి అల్ప ప్రయత్నమే మన పరిమితుల్లో సాధ్యం.

౨

బాహిరంగా నా జీవితం అతి సాదారణమైనది. కాని నా ఆంతరమైన జీవిత మేమిటి?[2]

---

1. 1938లో శ్రీ అరవిందులు ఒక ప్రశ్నకు సమాధానంగా ఇలా చెప్పారు –
"భగవత్తత్త్వం మానవ రూపాన్ని ఆశ్రయించి మానవ సహజమైన మార్గాన్ని అనుసరిస్తుంది. దీనివలన భగవత్తత్త్వానికి ఎట్లాంటి క్షతి కలుగదు. దీని వలన భగవత్తత్త్వ వికాసం స్పష్టమౌతుంది. కాని మానవ స్వభావం భగవత్తత్త్వంగా పరిమళించిందని అర్థం కాదు. బాల్యం నుండియే శ్రీమాత అంతరంగంలో మానవ పరిధులకి అతీతంగా ఉండేది." లెటర్స్ ఆఫ్ శ్రీ అరబిందో ఆన్ ది మదర్ పే. 4.

2 ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్ (1948) పే. 251.

భౌతిక ప్రపంచంలోని నా జీవితం ప్రారంభం నుండి ఇప్పటి దాకా ఒక మిథ్యాస్వప్నంలాగా గోచరిస్తుంది. ఈ ప్రపంచంలో నేనొక సున్న.[1]

శ్రీమాత దాదాపు ముప్పైఐదు ఏళ్ళ క్రిందట ఈ మాటలని వ్రాశారు. వీటికి ప్రాధాన్యం ఉంది. 'అతి సాధారణం' 'మిథ్యాస్వప్నం' 'ఒక సున్న' 'బాహిరంగా కన్పించేదీ', 'తాత్త్వికంగా సత్యమైనది' – ఈ విషయాన్ని అజ్ఞానంలో కొట్టుమిట్టాడే ప్రపంచం ఎట్లా గుర్తింప గలుగుతుంది. బాహిరంగా శ్రీమాత జీవితం అతి సాధారణమైనదే కావచ్చు. లోపలి దివ్యజ్యోతి, ప్రదీప్తమైన అర్చిస్సు, ప్రకాశించే కాంతి కవచం – ఇవన్నీ ప్రజ్వలించి యజ్ఞాగ్నిగా సమున్నతస్థితి నందుకుంటాయని ఎవరూహించినారు?

శ్రీమాత ఒకనాడు ముద్దుగొలిపే శిశువు. ఫ్రాన్స్‌లో ఒక బ్యాంకు యజమాని కూతురు పెరుగుతూ స్త్రీ సహజమైన శక్తిని సౌందర్యాన్ని పొందింది. శిశువు, బాలిక అనే పదాలతో తెలిసేదేమిటని?

ఆత్మ మహత్వాన్ని కప్పిపుచ్చే ఆకృతి
ఒక గొప్ప తత్త్వవేదిని
వారసత్వాన్ని మన్నిస్తూ
అంధ ప్రపంచానికి కాంతిమయనేత్రంగా
మౌనగంభీరంగా
శాశ్వత తత్త్వావ లోకనం చేసే
మహోపదేశిక
దైవానుగ్రహం పొందిన ఋషికల్ప

అల్లరి కృష్ణుడు తన నోట్లో మట్టిబెడ్డను పెట్టుకున్నాడని తెలిసి యశోద నోరుతెరవమని ఆదేశించింది. ఎంత విచిత్రం ! సమస్త విశ్వం 'భూమ్యాకాశాలు, నక్షత్రాలు, గ్రహాలు, సూర్యచంద్రులు, సమస్త జీవజాలం ఆ చిన్నినోట్లో సాక్షాత్కరించినాయి. శిశువు మహత్త్వం గొప్పది. మన పరిమిత శక్తికి అనుగుణంగా దాన్ని కుదించుకుంటాము.

పదమూడేళ్ళ వయస్సులో శ్రీమాతకు ఒక దివ్యానుభూతి కలిగింది. ఒక సంవత్సరం వరకూ ఆ అనుభవం నిత్యమూ కలిగేది.

---

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్ (1948) పే. 231.

నేను రాత్రి నిద్ర కుపక్రమింపగానే, నేను నా శరీరాన్ని వదిలి ఆకాశంలో ఎంతో ఎత్తుకి ఎగిసినట్లు కనిపించేది. బంగారు వస్త్రం నన్నాచ్ఛాదించి ఉండేది. ఆ బంగారు వస్త్రం విశాలమై నగరాన్నంతా కప్పినట్లు కన్పించేది. దానిక్రింద అర్తులైన ప్రజలు నలుమూలలనుండి తమ బాధలని యాతనలని చెప్పుకుంటూ చేరి నట్లనిపించేది. ఆ స్వర్ణమయ చేలాన్ని వారు తాకగానే వారికి సుఖశాంతులు కలిగి ఆనందంగా సంతోషంగా ఉన్నట్లు కన్పించేవారు. ఇది ఎంతో అందమైన అనుభవం. దైనికమైన కార్యక్రమాలన్నీ దీనిముందు నిస్తేజంగా కన్పించేవి. నేనలా ఉవ్వెత్తుగా ఆకాశంలో తేలియాడినప్పుడు నా ప్రక్కన ఒక వృద్ధుడు, నిశ్శబ్దంగా స్థాణువులా కన్పడేవాడు, నన్ను ప్రేమతో చూస్తూ ప్రోత్సహిస్తున్నట్లు కన్పించేది. వినీలమైన వస్త్రాన్ని ధరించిన ఈ వృద్ధుణ్ణి "శోకమానవుని" ప్రతికృతిగా నేను తరువాతి కాలాన తెలుసుకున్నాను.[4]

గొప్ప జాగృతి స్థితి ! శిశువే దైవానుగ్రహం పొందిన ఋషి. అందరికీ ఉపశమనం కలిగించే వైద్యుడు, హిమాలయమంతటి బాధ కూడా ఆమె ముందు తేలిపోతుంది. ఆమె స్వర్ణమయ చేలాంచలాన్ని తాకిన వారికి ఆ క్షణంలోనే శాంతి కలుగుతుంది. బాధ అదృశ్యమౌతుంది.[5]

3

శిశువుగా ఉన్నప్పటి స్వభావమే తరువాతి దశల్లో మానవుని స్వభావాన్ని నిర్ణయిస్తుంది. "అందుకే శిశువే మానవుని తండ్రి" అన్న ఉక్తి సత్యమైంది. ఇది స్త్రీ పురుషులకు వర్తించే వాక్యం.

స్త్రీ మూర్తిని దర్శిస్తున్నాను.
అందరి నేత్రాలూ స్త్రీ మూర్తిని అన్వేషిస్తాయి
కాని తెలుసుకోలేవు
ప్రపంచ సోపానాలన్నీ ఆమెను చేరడానికే
కావ్య సంగీతం యావత్తూ
ఆమెను తెలిసికోలేదు

---

1 ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్ (1948) పే. 61-62.

2 (స్వర్ణమయచేలం దైవానుగ్రహానికి ప్రతీక. దుఃఖమయ ప్రపంచానికి దిగివచ్చి మానవుల ఆర్తిని నివారించి శాంతిని కూర్చే అనుగ్రహానికి ప్రతీక (ఋషభ్‌చంద్). ఇన్ ది మదర్స్ లైట్ I-పే. 6.

సూర్యచంద్రుల మధ్య వినీలాకాశంలో
అమలిన తారకా సముదయంలాంటి
ఆమె దరహాస మధురముఖం
విశ్వాంతరాళ గోళాలకు శాంతి నందిస్తుంది
వాటి విభిన్నగీతికలు
ఆమె నేత్ర సౌజన్యంలో, ఆమె ఆనందమయ హేలలో
సామరస్యాన్ని పొందుతాయి[1].

పదమూడేళ్ళ బాలిక అద్భుతమైన స్వప్నాల్ని పొంది ప్రపంచ దుఃఖ భారతత్త్వాన్ని తెలిసికొని తన చల్లని హస్తాలతో శాంతింపజేసి అంతం చేసింది. స్వప్నంలో నిశ్శబ్దంగా, నిశ్చలంగా సాక్షాత్కరించిన శోక మానవుని సాహచర్య స్వభావాన్ని అర్థం చేసికున్నది. ఆమె అమ్మగా పరిణతి చెందినా ఆనాటి స్వప్నాలని, దృశ్యాలని సాక్షాత్కృతమైన తత్త్వాలను విస్మరించలేదు.

పారిస్ నగరంలో కొందరు వ్యక్తులు ఒక సముదాయంగా ఏర్పడి అవగతం కాని అదృశ్యశక్తిని గూర్తి చర్చించుకొనేవారు. ధార్మిక తాత్త్విక చర్చలను చేసుకునేవారు. తమ ఆధ్యాత్మిక అనుభవాలని పంచుకునేవారు. ప్రయోజనపరమైన కార్య ప్రణాళికను చర్చించుకునేవారు. అమ్మ ఈ సాధకసముదాయానికి ఐక్యలక్షణాన్ని దిశానిర్దేశాన్ని కలిగించింది. 1907 సంవత్సరం జనవరినెలలో రష్యాదేశం నుండి ఒక అపరిచిత వ్యక్తి పారిస్ నగరానికి వచ్చాడు. "కీవ్ నగరంలో కొందరు విద్యార్థులు ఒక సముదాయంగా ఏర్పడి తాత్త్విక చర్చలను సాగిస్తారు. వారికి మీ పుస్తకాలతో పరిచయమైంది. కేవలం సైద్ధాంతికంగానే నిలిచిపోకుండా క్రియారూపంగా నిరూపితమై కన్పించే మీ సామరస్య పూర్వక బోధన వారికి నచ్చింది. నీవు వెళ్ళి మన కార్యక్రమంపై వారి సలహాను పొంది రమ్మని వారు నన్ను ఇక్కడికి పంపించినారు. అందుకే నేను వచ్చాను.[2] కొంతసేపాగి "విప్లవం నా కార్యక్రమం" అని స్పష్టంగా పలికాడు.[3] ఆయన బజారోవ్–విప్లవవాది ఆయనకు గమ్యం గోచరించడంలేదు. విప్లవవాదులైన బజారోవ్ లాంటి వారికి దిక్కుతోచదు. అట్లాంటి వారు ప్రపంచంలో ఎంతోమంది ఉన్నారు. తమ తాత్త్విక చింతనలో తమ కార్యక్రమంలో స్పష్టతలేక కొట్టుమిట్టాడుతారు. అంతా వ్యర్థమేమో అన్న భావం వారిని పీడిస్తుంది. హింస, ప్రతిహింస, ప్రతీకారం ముందుకు

1. ఫ్రాన్సిస్ థాంప్సన్
2,3. వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో (1952) పే. 8.

సాగలేవు. వాటి దారి ముందు మూసుకుపోయి ఉంటుంది. హింసాత్మక ప్రతీకారం సాహసోపేతమైన ప్రతిక్రియగా కన్పించవచ్చు. కాని చివరికి లక్ష్యంలేని అవివేకమైన వ్యర్థక్రియగా తేలిపోతుంది.

"అన్యాయమైన మార్గాన్ని ఆశ్రయించి న్యాయాన్ని ఎట్లా సాధిస్తావు? ద్వేషంతో ప్రేమను ఎలా పొందుతావు?"[1] అన్న మాటలువిని బజారోవ్ ఇలా అన్నాడు. "అది నాకు తెలుసు. . . పరిస్థితులు ఆ విధంగా ఉంటే మరేం చేయగలం? తుదిశ్వాస విడిచే వరకు మా పవిత్ర కార్యాన్ని మేం వదలం".[2]

అకుంఠిత దీక్ష, అసిధారావ్రతం ముఖానికి ఒక తేజస్సునిస్తుంది. బజారోవ్ ముఖం ప్రకాశించింది. ఏ సిద్ధాంతానికో బలియై చనిపోవడం గొప్పపనేమీ కాదు. జీవిస్తూ పోరాడి ఒక మంచి మార్గాన్ని కనుక్కోవడం గొప్ప ఆదర్శం. పరమశాంతంగా అమ్మ ఆయనతో ఇలా అన్నది.

"మీరు హింసా పద్ధతిని విడనాడి కొంతకాలం ప్రశాంతంగా ఏకాంతంగా నిశ్శబ్దంగా ఉండి ఒక ఉదాత్తశక్తిని సమకూర్చుకొని సరియైన తరుణంలో లక్ష్యాన్ని సాధించాలి. ఆ శక్తి హింసకు తలవంచకుండా అజేయమై ఉంటుంది. మీ హింసా విధానంతో శత్రువును బలోపేతుణ్ణి చేస్తారు. శత్రువుముందు అప్రతిహతంగా తత్తరపాటులేని ధైర్యంతో న్యాయంగా ధర్మంగా నిల్చి ఎదుర్కోవాలి. అప్పుడే మీకు కార్యసిద్ధి కలుగుతుంది. ధార్మికమైన పద్ధతులతో ప్రయత్నిస్తేనే ధార్మికమైన ఆదర్శం సాధ్యమౌతుంది."[3]

బజారోవ్ విభ్రాంతుడైనాడు. ఆశ, విశ్వాసం నిండారిన కళ్ళతో అమ్మను ఆమె సహచరులను చూచాడు. "మా కార్యక్రమాన్ని ఉన్మాదంగా భావించని, విశ్వాస పాత్రులైన సత్యవ్రతులను కలుసుకోవడం మంచిది. సెలవు"[4] అని వెళ్ళిపోయినాడు. న్యాయాన్నికోరే ఒక శాంతమైన సాధకుని కథ ఒక త్యాగశీలి కథ ఇలా అంతమౌతుంది.

శోకంతో, ఆవేదనతో, యుక్తాయుక్త విచారంలో దారి తెలియని స్థితిలో ఆయన అమ్మను ఆశ్రయించినాడు. ఆమె ఆయనకు సకాలంలో హృదయగతమైన బాధను మాన్పి ఊరట కలిగించింది.

1,2. వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో (1952) పే. 11

3. అదే పే.12

4. అదే పే.15

ఆధ్యాత్మిక శోధక బృందానికి శ్రీమాతే ప్రాణ బిందువుగా నిలిచింది. ఇందుకు ప్యారిస్ కేంద్రమైనా దీని ప్రభావ తరంగాలు అనంతంగా విస్తరించాయి. అక్కడ చర్చలు, సంభాషణలు జరిగేవి. ప్రణాళికలు రూపొందేవి. హేతువాదానికి అనుభూతి తోడయ్యేది. తర్కాన్ని దర్శనం మలిచేది. మనస్సుతో హృదయం ఘర్షణపడేది. ఈ విధంగా జీవితంలో ఒక సంపూర్ణ లక్ష్యం కోసం, ఆ లక్ష్య సాధనకొక సమగ్ర సాధనం కోసం వారు పరితపించే వారు ప్రబుద్ధమైన వారి పెదవుల నుండి నీతికథలు[1] జాలువారేవి. శ్రోతల మనసులో తేనెలూరించేవి. ఉదాహరణకు ప్రతి విషయంలోనూ జాప్యం చేసే ఒక యువవిద్యార్థి – ఒబ్లొమోవ్ అనుకుందాం – కథ చూద్దాం.

ప్రతిరోజూ ఈ అల్ప గమనంలో ప్రవేశిస్తాయి
రేపు, రేపు, రేపు అనే అక్షరాలు
అనంతంగా కాలపుటంచులదాకా. . . . .

అతడు స్వప్నంలోకి జారుకొంటాడు. ఒక అద్భుతమైన పథంలో ఆనందంగా ప్రయాణిస్తున్నట్లు కలలుకంటాడు. "ఎప్పటివలెనే ఆకాశంలో ప్రకాశిస్తున్న సూర్యుడు; చెట్లపై పక్షుల కలకలారావం; ఈ రోజే అత్యంత సుందరమైన రోజేమో !"[2] (12 సంవత్సరాల వయసులో శ్రీమాత వ్రాసినదిదె) అట్లా సంతోష తరంగాలపై తేలియాడుతూ ముందుకు సాగుతూనే ఉంటాడు. కాని లోపలి నుండి ఏదో వేదన తొలుస్తూనే ఉంటుంది– "నేనెవరు? నా గమ్యం ఎటు? ఏది ప్రధానమైనది? ఎందుకీ ఆలోచన? ఏదైనా ఎందుకు చేయాలి? ఈ అనంతపథంలో ఇట్లాగే కొట్టుకపోనీ, ఇట్లాగే గమించనీ, రేపు ఆలోచిస్తా"[3] – అని. అనాలోచితంగా ఒక లోయలోకి ఆకర్షితుడవుతాడు. అది మరింత లోతవుతూ పోతుంటుంది. అక్కడ అస్పష్ట మానవాకారాలు దయనీయంగా కొట్టుమిట్టాడుతుంటాయి. గుడ్లగూబలూ, కాకులూ, గబ్బిలాలు అతని చెవిలో కస్సుబుస్సు మంటుంటాయి. మృత్యు సామ్రాజ్యంలో అతడు పడిపోతాడు. దుస్తర వినాశం వైపే అతడి ప్రయాణం. అదో పీడకల. అందులోనుండి ఉలిక్కిపడి లేచి, విస్మయంతో కళ్లు తెరిచి, "ఇదంతా ఇంతేనా ! ఈ మార్గమే 'రేపు' అనే మార్గం. 'తర్వాత' అనే పథం"[4]

---

1. అమ్మ 12 సం॥రాల వయసులో రాసుకున్నది.
2. వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో (1952) పే.1
3. అదే పే.2
4. అదే పే.5

వెలుగులీనే ఆ ఆశా సౌధం "ఏమిలేదనే" శూన్య సౌధమే కదా!" అనుకుంటాడు. ఆ విద్యార్థి రోగం కుదిరింది. సమస్య తీరింది.

మరో నీతికథ. మేధావుల భవనం – అందులో మేఘాల క్షేత్రంలో సత్య సౌధానికి ప్రవేశద్వారం. విందు ఏర్పాటైంది. సద్గుణాలు ఒక్కొక్కటీ ప్రవేశించి వారి వారి అభిరుచుల కనుగుణంగా జతకట్టి కూర్చున్నాయి. ప్రపంచమంతటా, లోకాల్లో ఏరి పారేసినట్లుండే ఈ గుణాలు, ఏకాకుల సమూహాల్లో ఏకాకిగా ఉండే ఈ గుణాలన్నీ ఒక్కచోట చేరినందుకు ఎంతో సంతోషించాయి."[1]

అధ్యక్ష స్థానంలో నిజాయితీ పారదర్శక వస్త్రాలను ధరించి కూర్చొంది. ఆమె చేతిలో అతి స్వచ్ఛమైన స్ఫటికం ఉంది. అందులో ఏ పదార్థమైనా స్వచ్ఛందంగా వక్రత లేకుండా కనిపిస్తుంది. వినయము, ధైర్యము రెండూ ఆమెకు సంరక్షకులు. పూర్తి ముసుగులో వివేకం ధైర్యం ప్రక్కనే కూర్చొని ఉంది.

దాతృత్వ మహిళ అంతటా వ్యాపించి ఉన్న నిశ్శబ్ద కేంద్రంలో ఉంది. ఆమెలో జాగృతితోపాటు ప్రశాంతత, చురుకుదనంతో పాటు విచక్షణ మూర్తీభవించి ఉన్నాయి. ఆమె కదిలినప్పుడల్లా తెల్లని, మృదువైన కాంతులీనుతున్నాయి. ఆమెచుట్టూ దయ, సహనం, సాత్వికత, గౌరవం ఒదిగి ఉన్నాయి.

ఆ సమయంలో ఉన్నట్లుండి ఒక క్రొత్తవ్యక్తి ప్రవేశించాడు. తెల్లని దుస్తులు ధరించిన ఆ వ్యక్తి లేతవయసులో, బలహీనంగా, అతి సామాన్యంగా, కడుపేదగా కనిపిస్తున్నాడు. వివేకం అతనిని సమీపించి మీ పేరేమిటని అతి వినయంగా ప్రశ్నించింది. ఆమె నిట్టూరుస్తూ ఇలా అంది. "అయ్యో ! ఈ భవనంలో నేను పరాయివాడిగా కన్పించటంలో ఆశ్చర్యమేమీలేదు. ఎక్కడికైనా నన్నెంతో అరుదుగానే ఆహ్వానిస్తారు. నా పేరు కృతజ్ఞత.[2]

ని

ఆలోచన గురించీ, స్వప్నాల గురించీ, కష్టాల్లోని క్రమశిక్షణ పైనా, దైవం ఆత్మ సాక్షాత్కారం పైనా ఎన్నో వాదనలున్నాయి. ఇందులో అతి 'తెలివేమీ' లేదు. ఇవన్నీ స్వచ్ఛంధమైన నిజాయితీతో ధ్యానంతో వెలుగులను నింపే ప్రక్రియలే. తమ ఆకాంక్షల నల్లుకొని వాటిని సఫలం చేసుకోవడంలో మొదటి మెట్లు ఇవి. నీతికథల వలెనే ఈ వాదనలూ ఆధ్యాత్మిక పరిశోధకులను సంబోధిస్తాయి.

---

1 వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో (1952) పే. 16

2 అదే పే.18

"ఆలోచన అనేది చాలా చాలా విస్తృతమైన విషయం." అసంబద్ధమూ, చంచలమూ, సంకరమైన ఆలోచన స్వీయలక్ష్యాన్నే ఛేదిస్తుంది. వక్రీకరిస్తుంది. వికృతఫలాన్నందిస్తుంది. ఆలోచనను విశృంఖలంగా వదిలేస్తే, వైరుధ్యాలకులోనై మనం సృష్టించిన అయోమయానికి మనమే గురౌతాం. అందుకే ప్రశాంతతే మనకు అత్యవసరం. "అస్తవ్యస్తమైన, అసందిగ్ధమైన మానసిక ఆందోళన నుండి మనం నిర్ముక్తం కావాలె."[1] ఆలోచన వాస్తవంగా, ఆధికారికంగా మనది కావాలంటే అది తాత్కాలికంగా కుక్కగొడుగులా పుట్టుకొచ్చేది కాకూడదు. "మన జీవన యాత్రలో పరిశీలన, అనుభవం, సమీకరణ ద్వారా కాని గంభీరమైన, అమూర్తమైన ధ్యానం, యోచన ద్వారా కాని విశదీభూతమైన తార్కిక సంయోజనలో భాగం కావాలె.[2]

ప్రశాంతత, ధ్యానం రెండూ కష్టతరమైనవే, మన భారతీయ ప్రాచీన గ్రంథాల్లో నిజమైన ధ్యానం గురించి ఓ కథ చెప్తారు.[3] ప్రశాంత జలాల్లో స్వచ్ఛమై, ధ్యానమనే సమ్మెట పోటుతో విశుద్ధమైన ఆలోచన ఒక కొత్త కాంతిని, శక్తిని సంతరించుకొంటుంది. తన ఆత్మ వైరుధ్యాన్నీ, నిస్సారతనూ వదిలేస్తుంది. అప్పుడది విశ్వవ్యాప్తమైన అనుస్యంధిత సత్యసమ్మేళనంగా, అంటే స్వయం వ్యక్తమైన సత్యంగా రూపొందుతుంది. మంచుతెర తొలగిపోతుంది. మనో ప్రపంచంలో కాంతి వరద వెల్లువెత్తుతుంది. మదర్ థెరిసా చెప్పినట్లు, "సూర్యరశ్మి బలంగా ప్రవేశించిన గదిలో ఏ బూజూ దాక్కొనజాలదు".[4]

"నిద్రించటం, బహుశా కలలు గనటం – అహో – అందులోనే ఉంది కష్టం" అంటాడు హామ్లెట్. కలలన్నీ వృథాయేనా? అజీర్ణానికి చిహ్నాలేనా? అడియాసలు, కల్లలు, హాస్యోక్తులేనా? కలలవల్ల లాభం లేదంటాడు సామ్యుయెల్ డేనియెల్.

రేపటి ఆకాంక్షలను రూపొందించుకోవాలంటే
నీ ఆశలకద్దం పట్టే కలలు కనటం మానెయ్:
నా దుఃఖాన్ని ద్విగుణీకృతం చేసే కలల కల్లల్లారా !
ఉదయించే సూర్యుడెప్పుడూ మిమ్మల్ని సమ్మతించడు.

మరి పదమూడేళ్ళ ప్రాయంలో అమ్మ కన్న కలల సంగతేమిటి? ఆమె కలలు కొంత వరకైనా అతీంద్రియ సందేశాలు కావా?

---

1 వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో (1952) పే.21

2 అదే పే.23

3 అదే పే.26–28

4 లైఫ్ ఆఫ్ సెయింట్ థెరిసా (స్వీయచరిత్ర) 19 వ అధ్యాయం.

ఈ సమస్యకు మరింత విస్తారమైన పరిష్కారం కావాలె. కలలను వ్యర్థ పదార్థంగా మన జీవితం నుండి విసర్జించాలా? లేదా అసంపూర్ణమైన ఇంద్రియాతీత శక్తిగా భావించి భక్తితో పూర్ణతకోసం పెంచి పోషించాలా? ఇదొక ఉత్తేజకరమైన చర్చాంశం. ఈ చర్చకు అమ్మ ఈ విధంగా ముగింపునిస్తుంది. "సరిగా శిక్షించి, పోషించితే కలలు దర్శనాలుగా అప్పుడప్పుడు సత్య స్ఫోరకాలుగా రూపొందుతాయి. అప్పటినుండి ఎన్నో ముఖ్య విషయాలకు సంబోధించిన ఉపయుక్త పరిజ్ఞానం మనం పొందవచ్చు."[1]

సాధారణంగా చేతన నిద్రాణస్థితికంటే అధోభాగంలో ఉంటుంది. స్వప్న ప్రపంచంలోని అస్పష్టమైన, అగోచరమైన విషయాలు చేతనపై దుష్ప్రభావాన్ని కల్గిస్తాయి. జాగృతస్థితిలో సత్యాన్ని తెలుసుకోవటంతో అధమమైన స్వాప్నిక విషయాలు క్రమంగా మాయమౌతాయి. "అప్పుడు మన ప్రకృతి ఇతర ప్రకృతుల రహస్య జ్ఞానాన్ని బహిర్గతం చేసే స్వచ్ఛమైన కలలకు మార్గం సుగమమౌతుంది."[2] అటువంటి కలలు కేవలం కలలే కాదు, అవి స్వప్నసమాధి గతమైన అంతస్సత్త అనుభవాలు.[3]

ఓ

బాధా సముద్రంలో క్రుంగి పోతూ
దుఃఖభారంతో పగిలి పోతూ
వేదనతో నా హృదయం రోదించింది.
కాని ఓ ఆర్తత్రాణ పరాయణా !
నేను నిన్నే పిలిచాను – భక్తితో ప్రార్థించాను
కళ్లు చెదిరే నీ ప్రకాశం సాక్షాత్కరించింది
నన్ను పునరుజ్జీవితుణ్ణి చేసింది"[4]

అమ్మ ఈ మాటల్లో దుఃఖపు గాఢాంధకారం నుండి వెలుగులు విరాజిల్లే నూతన జీవనోదయానికి ఆత్మ ప్రయాణం సూక్ష్మస్థితిలో కనిపిస్తుంది. ప్రకృతి భౌతిక ధర్మాలు ఎంత నిజమో ఈ ఆధ్యాత్మిక విషయ క్రమమూ అంతే నిజం. మనకు ఎంతో ఆంతరంగికమైనది కూడా.

---

1. వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో (1952) పే. 40
2. శ్రీ అరబిందో, బేసెస్ ఆఫ్ యోగా (1941), పే. 128
3. లెటర్స్ ఆఫ్ శ్రీ అరబిందో, సెకండ్ సిరీస్, పే. 166. వృషభ్‌చంద్ రచించిన ఇన్ మదర్స్ లైట్ గ్రంథం పార్ట్ 2లోని "డ్రీమ్స్" అనే వ్యాసం చూడండి.
4. వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో (1952) పే. 41

మనమెందుకు కష్టపడుతున్నాం? ఎందుకు కష్టపడాలి? ప్రకృతి గుడ్డిది- నిష్కారణంగా ప్రణాళికా రహితంగా కష్టాలు కలిగిస్తుంది కనుకనా? ప్రకృతి మన ప్రయోజనాలను అస్తవ్యస్తం చేసే దుష్ట రాక్షసా? మానసిక, భౌతిక దుఃఖం ఆదం సంతతికి చిహ్నమా? పుణ్యపాపాలకూ సుఖదుఃఖాలకూ స్పష్టమైన కార్యకారణ సంబంధం గోచరమౌతుందా? ఇవన్నీ పరతత్త్వ విభాజకాలా? లేక అస్పష్ట సాపేక్ష కారకాలా?

పాపుల మార్గాలే ఫలిస్తున్నాయెందుకు?
నా ప్రయత్నాలన్నీ ఎందుకవుతున్నాయి వృధా?
నేను గడిపిన క్షణాలకంటే
కామం కప్పిన మత్తు క్షణాలే ఎక్కువ.
దేవా ! నా జీవనం నీ కొరకే. . . .[1]

ఈ ముళ్లకంప చుట్టే తిరుగుతున్నాం మనం. లేదా కళ్లు కాయలు చేసుకొని ఒకరికొకరి మూల్గులను వింటూ కూర్చున్నాం. ఈ వైవిధ్యమైన వేదన నుండి విముక్తి లేదా?

"దుఃఖమే ఉంది" అన్న యూక్లిడ్ ప్రపంచంలో వీటినుండి సులభమైన విముక్తి ఏదీలేదు. దుఃఖం అప్రియమైనది. దాన్నెవ్వరూ కోరుకోరు. దూరదృష్టితో సింహావలోకనం చేస్తే దుఃఖానికి భౌతిక జీవనంలోని ఇతర అంశాలకూ సంబంధం ఉన్నట్లు గోచరిస్తుంది. మన ఆంతర, బాహిర జీవనాల ఫలపుష్పీకరణలో/వికాసంలో దుఃఖానికి ఒక ప్రత్యేకమైన, ప్రయోజనాత్మక పాత్ర ఉందా? హాప్కిన్స్ ఈ విధంగా అంటాడు.

సమ్మెట పోటుతో
అతనిలోని అగ్నితో నీ అభీష్టాన్ని రూపుదిద్దు.
లేదా వసంతం వలె తెలియకుండా
అతనిలో ప్రవేశించు అతన్ని కరిగించు
మొత్తం మీద స్వాధీన పరచుకో

సెయింట్ జాన్ ఆఫ్ క్రాస్ ఈ విధంగా అంటాడు.

మాన్పటానికి కాల్చే మంట
ఎంతో ఆహ్లాదకరమైన గాయం.
ఓ సున్నితహస్తమా ! నీ మృదుస్పర్శతో

---

1. జెరార్డ్ మాన్లీ హాప్కిన్స్

అనుపమాన కరుణతో
కొత్త జీవనాన్ని ప్రసాదిస్తావు.
నన్ను చంపి చావును జీవితంగా మలుస్తావు.[1]

మరోవైపు వైరాగ్యంతో శరీరాన్ని శుష్కింప చేసుకోవటం కూడా అనవసరం. అది మూర్ఖత్వం, ఆపత్కరం కూడా. శ్రీమాత మాటల్లో "బాధ తప్పనిసరేం కాదు. కోరుకోదగిందీ కాదు. కాని అది కల్గినపుడు ఎంత ఉపయోగకారి!?"[2] వివిధరకాల బాధల్ని కొని తెచ్చుకోవడం,మనసునూ శరీరాన్నీ కావాలని కష్టాలకు గురిచేయడం కేవలం పనికిరాని ఉద్వేగవాదమే. ఇతర ఉద్వేగాలకు లోనుకావటం వంటిదే అది. జయాపజయాలూ, సుఖ దుఃఖాల మధ్య అవసరమైంది ఆత్మనియంత్రణ. ఆత్మార్పణం ఆత్మార్భవం కాదు. తీవ్రమైన భావనకు నే కల్సింది. ఒక ప్రశాంతత, ఒక నియంత్రణ, స్వచ్ఛతనం కల్గించే ఒక సంయమనం, చర్య."[3]

సరే, బాధని మనం కోరుకోకున్నా, దాన్ని గురించి భీతి చెందాల్సిన అవసరమూ లేదు. అది కల్గినట్లయితే, సుదూరలక్ష్యంతోనే కల్గుతుంది. వర్తమాన జ్వరతీవ్రత నుండి దాన్ని మథించి వెలికి తీయాల్సిన అవసరం మనది. ఈ విధంగా మన విశ్వాసంలో చాంచల్యమూ పనికిరాదు. అట్లాగే ఆత్మజ్ఞానం కోసం చేసే నిరంతర కృషినీ అపరాదు.

"రోదిస్తూ బాధపడుతూ, మనకష్టాల, చెడుల కాలపరిమితిని చూడలేని ప్రజలారా ! గమనించండి. రాత్రి లేనిదే పగలు లేదు. చీకటి దట్టమైనప్పుడే ఉషోదయం సిద్ధం. సూర్యుడు కరిగించలేని పొగమంచేదీ లేదు. అతనిచే ఇంకిపోని అశ్రువూ లేదు. అతని ఇంద్రధనుస్సు విజయంతో ఉప్పొంగని తుఫాను తదనంతర స్థితీ లేదు. అతను కరిగించని మందూ లేదు. అతనిచే నవవసంతంగా మారని శీతాకాలమూ లేదు.

"అదే విధంగా ఆవలివైపున వైభవం లేని బాధా లేదు. సంతోషంగా మారని దుఃఖమూ లేదు. జయంగా మారని అపజయమూ లేదు. ఉన్నత శిఖరాల నధిరోహణగా రూపాంతరం చెందని పతనమూ లేదు. జీవనాశ్రయం పొందని ఏకాంతమూ లేదు. సమైక్యతగా మారని అనైక్యతా లేదు".[4]

---

1. ఆర్థర్ సైమన్స్ అనువాదం.
2. వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో, పే.42
3. లెటర్స్ ఆఫ్ శ్రీ అరబిందో, సెకండ్ పార్ట్. పే.213
4. వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో, పే.49

అంతేకాదు విచారం అతిశయం చెందినప్పుడు ఆత్మోద్దీపన కల్గుతుంది. అదే సత్యమార్గాన్ని చూపే మొదటి మెట్టు.

"హృదయం పగిలే ఆవేదన చెందినప్పుడల్లా మన అంతరాల్లో ఎక్కడో ఒక ద్వారం తెరుచుకుంటుంది. కొత్త లోకాలను ఆవిష్కరిస్తుంది. తమ నిక్షిప్త నిధులతో వినాశపుటంచులో ఉన్న ప్రాణులను పునరుజ్జీవింప చేస్తుంది.

"ఇట్లా అవరోహణ క్రమంలో దిగుతూ చేరుకొన్న తెరను తొలగిస్తే ఓ దేవా ! అప్పుడు కనిపిస్తావు నీవు. నీలోని జీవిత గాఢత్వం నన్నంతా ఆవరిస్తుంది. నీ వైభవకాంతులు నాలో వెల్లువెత్తుతాయి. నీ ప్రేమౌన్నత్యం నన్ను పూర్తిగా రూపాంతరం చెందిస్తుంది."[1]

మన జీవితాల్లో "విభ్రాంతి" కూడా అవసరమే. మనను ఉన్నట్లుండి కుదిపి కూర్చోబెట్టి కనులు తెరిపించేది, మన శారీరక, మానసిక జాడ్యానికి చరమగీతం పాడేది, అన్వేషణకు దారిచూపి తెలియని విషయాలను తెలియజెప్పేది ఈ విభ్రాంతే. బోధి వృక్షం క్రింద దాగిన శాంతి నిలయానికి సుదీర్ఘ ప్రయాణం చేసే ముందు రాకుమారుడు సిద్ధార్థునికి ఇటువంటివే కొన్ని విభ్రాంతి కల్గించే దెబ్బలు అవసర మయ్యాయి. సాధారణంగా మనమంతా ఒక ఆధ్యాత్మిక సుషుప్తిలో జీవిస్తూ, చరిస్తూ మనలోని మూలాధార ప్రకృతినీ అంతర, బాహిర వైభవాన్నీ తెల్సుకోలేకపోతాం. నిజమైన మన జీవన గమ్యాన్ని చూడలేకపోతాం. ఊహించని విచారంతో కల్గిన విభ్రాంతి ఒక నిర్ణయాత్మకమైన మలుపు తిప్పుతుంది. శరీరం కుదిపివేయ బడుతుంది. విస్మయంతో కళ్ళు నిజమేదో తెలుసుకుంటాయి. పై పొరలు తొలగిపోతాయి. చివరకు పునరుజ్జీవనం ప్రారంభమౌతుంది. శ్రీమాత ఉద్బోధలో దివ్యజ్ఞానం గోచరిస్తుంది.

"వినండి. మనిషి తన దైవీ మాతృక నుండి భూమిపై దిగిన దూరమైన స్థితి కంటే అపాయకరస్థితి మరోటి లేదు. అతనిపై శత్రు సామ్రాజ్యం ఆవరించి ఉంటుంది. ద్వారబంధాల్లో మండుతున్న కత్తులతో జైలర్ల కాపలా. దైవీ మాతృక నెలాగూ చేరలేదు కనుక మనిషి అంతరంగం నుండే ఉద్భవించింది ఆ మాతృక. ఊర్ధ్వకాంతుల నందుకోలేదు కనుక అంతస్సత్తలోనే కాంతులుదయించాయి. దివ్య ప్రేమతో సంభాషించ లేదు కాబట్టి ఆ ప్రేమ తనను తాను విభజించుకొని భూమిపైన ఉన్న ప్రతిప్రాణినీ, మనిషి అహాన్ని ఆశ్రయించింది.

---

1. వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో, పే. 42

ఈ విధంగా ద్వేషించే ఈ పదార్థం సారవంతమైనది, ఒంటరిదైనా దివ్యమైనది. ఇందులో ప్రతిఅణువులో దివ్యాలోచన, ప్రతి ప్రాణిలో దివ్యత్వం ఉన్నాయి. ఈ విశ్వంలో మనిషంత అల్పప్రాణి ఏదీ లేకున్నా అంతటి దివ్యత్వం కల్గిన ప్రాణి కూడా ఏదీలేదు!

నిజానికి దైన్యంలోనే ఉంది వైభవానికి ఊయల".[1]

౭

కాలం గడుస్తున్నా కొద్దీ ఈ చర్చలు మరింత పదునెక్కాయి. ఆకాంక్ష, సాఫల్యాలని మధ్య నున్న అంతరాన్ని పూరించాలనీ, ఆంతర బాహిర జీవితాల మధ్య ఐక్యం సాధించాలనీ, విస్తృత సామాజిక చట్రంలో వ్యక్తికి సురక్షిత స్థానం కల్పించాలనీ భావించారు సత్యశోధకులు. మనిషి భవిష్యత్తులోకి తొంగిచూచిన శ్రీమాత గమ్య సాధనను త్వరితం చేయడంలో మనిషి పాత్రను అర్థం చేసుకొంది. 1912లో ఒక మెమొరాండంలో శ్రీమాత ఇట్లా పేర్కొంది. "క్రమంగా విశ్వసమైక్యత ఆరంభం కావడమే సాధించాల్సిన సామాన్య లక్ష్యం. భూమిపై ఈ ధ్యేయ సాధనకు అంతరంగంలో అద్వైత దైవత్వాన్ని అందరిలోనూ జాగృతం చేసి ఆవిష్కరించడం ద్వారా మానవులలో ఏకత్వాన్ని గుర్తించడమే మార్గం. మరోమాటలో చెప్పాలంటే మనందరిలో ఉన్న దైవ సామ్రాజ్యాన్ని స్థాపించడం ద్వారా ఏకత్వాన్ని సృష్టించడం."[2]

వైయక్తిక, సామాజిక క్షేత్రాల్లో ఒక గొప్ప మార్పు – మహోన్నత రూపాంతరం రావాలె. ఈ క్షేత్రాలు సమసంబంధంతో పూర్ణత్వంతో ఐక్యం కావాలె. శ్రీ అరవిందుల కవితలో ధృవప్రాంతంలోని ఋషి రాజునిలా ఉద్బోధిస్తాడు.

భూమ్మీదనే దైవాన్ని పొందటానికి ప్రయత్నించు.
ఆయన లక్ష్యాన్ని కోరే నీ కోసం
నీ విజయం కోసం తన
వివిధ లోకాల్లో మహత్తర
సామ్రాజ్య స్థాపనకుపక్రమించాడు ఆయన
నీ మానవీయ శక్తిని సంపూర్ణం చేసుకో
నీ జాతిని పరిపూర్ణం గావించు.

---

1. వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో, పే.52
2. వర్డ్స్ ఆఫ్ ది మదర్ (1946), పే.5

వ్యక్తి ప్రభావం సమష్టిపై, సమష్టి ప్రభావం వ్యక్తిపై ఉంటుంది. అందుకే మనం అభిలషించే రూపాంతరం పరస్పర సహకారంపై రూపొందాలె. దైవంతో లీనమయే క్రమంలోనే వ్యక్తి ఆంతరంగిక వికాసం కనిపిస్తుంది. అట్లా అని జీవితం నుండి పలాయనం చిత్తగించాలనీ, మన చుట్టూ ఉన్న వాతావరణాన్ని త్యజించాలనీ కాదు.

సమష్టిలో శక్తినీ, ఐక్యము కల్గించేది వ్యక్తి తనకు తాను పొందిన ఏక్యత, సాధించిన శక్తి ద్వారానే. శ్రీమాత మాటల్లో, "మానవుని జన్మహక్కైన ఆనందానికి మార్గదర్శనం చేసే నిజమైన క్రమ పరిణామం బాహిర సాధనాల్లో కాని భౌతికపరమైన మేలులోకాని సాంఘిక రూపాంతరాల్లోకాని లేదు. వ్యక్తి అంతరంగపు లోతులను పరిపూర్ణం చేయుటయే నిజమైన ప్రగతి. వాస్తవ పరిస్థితిలనూ బాధావేదనలను ప్రశాంతమైన స్థిరమైన సంతృప్తిగా మార్చగలిగేది అదే."[1] రెయినర్ మరియా రిల్కే మాటల్లో

ఓ ప్రియతమా ! ప్రపంచం ఎక్కడనోలేదు. నీలోనే ఉంది
మార్పుతోనే జీవితం గమిస్తుంది.
బయట ఉన్నదంతా క్రమంగా క్షీణిస్తూ మాయమౌతుంది.[2]

కాంతి కాంతిని స్వాగతిస్తుంది. అన్ని ప్రాణుల్లో వెలిగే దివ్యజ్యోతి ఒక్కటే. "అందులో నుండే పుడుతుంది. అసలైన మానవ ఐక్యము, సౌభ్రాతృత్వం, సమష్టిత్వం[3] వ్యక్తిగతంగా విజయం సాధించినప్పుడే ఆధ్యాత్మిక వికాసంతో ప్రకాశించే స్త్రీ, పురుషులు కొందరిని ఒకచోట చేర్చగలుగతాం. తద్వారా సమిష్టి కృషితో "అనుకూల ప్రదేశంలో దైవ సంతతిగా ఒక నూతన తరాన్ని చిగురించి ఆదర్శ సమాజాన్ని స్థాపించగల్గుతాం'.[4]

అదే ఆశ. కార్యాచరణ ప్రణాళికకూడా. దైవసంతతినీ, మహత్తర మానవ సమాజాన్నీ, భవిష్యద్దివ్య సమాజభారాన్ని భరించే ఆధారభూమిక అంతరంగప్రకాశమే.

మన ప్రధాన ఉద్దేశ్యం ఆత్మప్రకాశం, అంతరంగ రూపాంతరమైతే అది కేవలం సాధ్యంగా మాత్రమే ఉండరాదు. ఆత్మసాక్షాత్కారం నుండి విరజిమ్మిన ప్రకాశంతో పరిసర వాతావరణమంతా రూపాంతరం చెందటానికి సాధనంగా ఉండాలె. మనిషి ఉన్నదున్నట్లుండటం కాదు. అంటే అహంకారంతో పరిస్థితులకు బానిసగా కోర్కెలకు,

---

1. వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో, పే. 90
2. జె.బి. లీష్మన్, స్టెఫెన్ సెండర్‌ల ఆంగ్లానువాదం.
3. వర్డ్స్ ఆఫ్ ది లాంగ్ ఎగో పే. 89
4. వర్డ్స్ ఆఫ్ ది మదర్, పే. 6

వినాశానికి, అశక్తతకు వారసుడిగా ఉండటం కాదు. మనిషి ఎట్లా ఆదర్శవంతంగా ఉంటే బాగుంటుందో అట్లా ఉండాలి. అంటే ఆంతరంగంలో దాగిన దైవత్వాన్ని పొందగలిగినవాడిగా ఉండాలె. అప్పుడే అతను విమోచన పొందిన ఇతరులను సంప్రదించి వారితో సంపూర్ణ అవగాహన సాధించగల్గుతాడు. అట్లా ఆధ్యాత్మిక విముక్తి పొందిన స్త్రీ పురుషుల మధ్య దైవశక్తి వైశాల్యమూ, విశ్వజనీనతలే అవగాహనా మాధ్యమంగా అలరారుతాయి.

నీలోని దైవత్వంతో సమైక్యమైనప్పుడు అన్ని వస్తువులతో అంతరంగా ఒక్కటి కాగల్గుతావు. దాని ద్వారా, దాని చేతనే నువ్వు వాటితో సంబంధాన్ని నెలకొల్పుకో గల్గుతావు. అప్పుడు నిరపేక్షంగా నిర్వికారంగా దానికి దగ్గరున్న వాటికి దగ్గరౌతావు. దూరం ఉన్నవాటికి దూరం కాగల్గుతావు.

"ఈ విధంగా మనం ఇతరుల మధ్య ఎప్పుడూ ఇంకా ఇంకా తెలుసుకుంటాం. ఇదే భౌతిక, బౌద్ధిక, ఆధ్యాత్మిక సంయోజనానికి దివ్య ఉదాహరణ. దివ్య జీవన పథాన్ని అర్థం చేసుకొని ప్రవేశించడానికి తగిన సందర్భం"[1]

అనుసరణీయ విధానం ఇది: ఐహిక జీవితాన్ని లోటుపాట్లెన్ని ఉన్నా త్యజించి పలాయనం చిత్తగించాల్సిన అవసరం లేదు. అంతరంగ వికాసంలో నిమగ్నమైనప్పుడు కానీ, ఆ వికాసం పూర్తైనప్పుడు కాని కర్మ త్యాగం అవసరం లేదు బుద్ధుడు కూడా బోధిసత్వుడు కావాల్సిందే. కష్టపడి సాధించిన అర్హతను వదిలి ఇతర మానవులతో అంటే తనవలె బోధిసత్వులైన వారితోనూ, మరియు ఐహిక సంసార చక్రంలో గుడ్డిగా బందీలైన వారితోనూ సాహచర్యం కోసం వెనుదిరగాల్సిందే.

౮

తమను తాము తెల్సుకోవాలని, నియంతించుకోవాలనే ఉద్దేశ్యంతో క్రమంగా సమావేశమయ్యే సత్యశోధక బృందానికి 1912లో శ్రీమాత చదివి వినిపించిన కొన్ని వ్యాసాల్లో పనికి సంబంధించిన ఆచరణాత్మక అంశాలను వివరించింది. వాటి పుట్టు పూర్వోత్తరాల గురించి శ్రీమాత ఈ విధంగా వివరించింది. ప్రతి సమావేశం చివరలో ఒక సాధారణ ప్రశ్న అడుగుతారు. ఆ ప్రశ్నను ప్రతీవ్యక్తీ స్వంతంగా సమాధానం వ్రాసి తర్వాతి సమావేశంలో చదవాలె. చివరలో ఒక చిన్న వ్యాసం చదివేవారు. అవే ఈ వ్యాసాలు".[2]

1 వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో, పే. 82–83

2 అదే పే. 53

"విశ్వానికి సంబంధించిన పనిలో నా పాత్ర ఏమిటి" అన్నది మొదటి ప్రశ్న. పనిని తప్పించరాదు. అది చాలా ముఖ్యంగా అవసరం అయితే చేయాల్సిన ఖచ్చితమైన పని ఏది? ఏ ఉద్దేశ్యంతో చేయాలి? సాధారణంగా కొన్ని రకాల పనులను తక్కువగా కొన్నింటిని గొప్పవిగా భావిస్తాం. వాటికి వివిధ స్థాయిల్లో వేతనాలనిస్తాం. మనం శ్రమ తక్కువ, లాభం, గౌరవం ఎక్కువ ఉండే పనినే కోరుకోవటం అసహజమేమీ కాదు. అందుకే ఆత్మహత్యా సదృశమైన ఈ పిచ్చిపోటీ. శ్రీమాత ఉద్బోధించే పని మరో సూత్రంపై ఆధారపడి ఉంది.

"నేను గొప్పవాణ్ణి కాదల్చుకున్నాను. అందుకోసం ఏ వృత్తిని ఎంచు కోవాలె?' అని ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని మనం అనుకోకూడదు. 'అందరిలో మూల భూతంగా ఒక్కటైన దివ్యశక్తి ప్రతి మనిషిలోనూ ప్రత్యేక రూపంలో ఆవిర్భూతమై ఉంటుంది. అందుకే నేను ఇతరులకంటే మంచిగా చేయగల్గిన పని ఏదో ఉంటుంది. దానికే నేను సవినయంగా అంకితమౌతాను. దాన్ని తెల్సుకోవటం కోసమే పర్యవేక్షిస్తూ ఎవరేమనుకున్నా నా యిష్టాయిష్టాలను నిగర్వంగా వినయంగా విశ్లేషిస్తాను. నేను నా ఊపిరిని ఎంత సహజంగా తీసుకొంటానో, పుష్పం ఎంత సహజంగా వాయువునకు సుగంధాన్ని అద్దుతుందో అంతే సహజంగా ఈ పని చేస్తాను. ఎందుకంటే మరోరకంగా చేయలేను కనుక.' క్షణ మాత్రమైనా సరే మన అహంకారాన్ని, కోర్కెలనూ, వ్యక్తిగత ధ్యేయాలనూ త్యజించినప్పుడు మనలో ఒక సద్యఃస్ఫూర్తి, ఉత్తేజం కల్గుతుంది. తద్వారానే విశ్వంలోని అభ్యుదయ, ప్రాణ శక్తులతో మనం సంబంధం ఏర్పరచుకోగల్గుతాం."[1]

ప్రతి పని ప్రత్యేకతా ప్రతివ్యక్తి ప్రత్యేకతతో సంబంధం కల్గి ఉంటుంది. ప్రతి పనీ భగవంతునికి ఆత్మ సమర్పణ భావంతో చేయాలె. పని చిన్నదైనా పెద్దదైనా, మనమే చేయగల్గింది కాబట్టి దాన్ని పూర్తిచేసాం లేదా చేస్తున్నాం అన్న ఆత్మ సంతృప్తే ఆ పనికి ప్రతిఫలం.

రెండోప్రశ్న:

"నిష్కామ కర్మకు అంకితం కావడంలో మనకెదురయ్యే పెద్ద అడ్డంకి ఏది."

ఈ ప్రశ్న చాలా ఉపయుక్తమైనది. నిత్య జీవనంలో ప్రతీవ్యక్తీ ప్రత్యేకతను కల్గి ఉండటం నిజమే. అయితే మదమాత్సర్యాలనే అంబరాలను వాటికి తొడగటం చాలా అపాయకరం. చివరకు వ్యక్తి ప్రత్యేకత కూడా భ్రమే. అది మన ఆధ్యాత్మిక

1. వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో, పే. 57-58. మరియు ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 54, పే. 109-110

వికాసంలో ఒక దశలో పనిచేయడాని కనువైన భూమిక మాత్రమే. ఈ రెండురకాల అనుభవాన్ని ఎలా సమన్వయం చేయవచ్చో శ్రీమాత ఇలా సూచిస్తారు.

"వ్యక్తిత్వం భ్రమ అనడంలో నా ఉద్దేశ్యం ప్రతి మనిషిలోని ప్రత్యేక వ్యక్తిత్వ ఆవిష్కారాన్ని తృణీకరించడం కాదు. విచక్షణ అంటే విభజన కాదు. ఈ విస్తృత ప్రాణికోటిలో ఒక కణంగా మనకు మనం భావించుకోవాలె. అప్పుడే కణం మనుగడ జీవకోటిపై ఆధారపడి ఉంటుందనీ, వేరుపడటం వినాశానికేననీ, అయినా ఈ పూర్ణ విశ్వంలో కణానికో ప్రత్యేక పాత్ర ఉందనీ తెల్సుకోగల్గుతాం."[1]

నిజంగా వ్యక్తిత్వం లేకపోవడం అంటే చేసేపనిలో తననుతాను మర్చిపోవడమని కాదు. తనను తాను మర్చిపోతున్నానని కూడా తెల్సుకోకపోవడం అప్పుడే పరిపూర్ణతతో పూర్తి సద్యఃస్ఫూర్తితో పని చేయగల్గుతాం."[2]

మరో విషయం: చవకబారు ఆత్మత్యాగం కోసం ఆకాంక్ష. "సేవ-త్యాగం" ఈ రెండూ స్సియామిన్ కవలలవలె మన ఆడంబరోపన్యాసాల్లో చోటు చేసుకుంటాయి. ఉద్రేకపూరితమైన బాధ అవసరమా? అది తెలివికల పనా? సానుభూతి కోసం చేసే సమ్మెల వలెనే సానుభూతి కోసం చేసే ఆత్మత్యాగాలు వృథా. ఇందులో అసలు జరిగేదేమిటంటే తెలిసో తెలియకో ఇతరుల మంచికోసం నిన్ను నీవు త్యాగం చేసే బదులు కేవలం త్యాగంలో ఉన్న సంతోషం కోసం త్యాగం చేస్తావు. ఇట్లా చేయడం వృథా ఎవరికీ లాభం లేదు"[3] అందుకే శ్రీమాత మరింత ఆరోగ్యకరమైన, ఫలప్రదమైన, కరుణామయ కార్య ప్రణాళికను సూచిస్తుంది.

శాంతి, ఆనందమయ ప్రశాంతతే ఆత్మలో చైత్య జీవనానికి అభివ్యక్తి. బాధపడటం ఎటువంటిదైనా మన బలహీనతనే చాటుతుంది. ఇతరులకు సాయంచేసే ఒకే మార్గం వారి బాధలను స్థిరమైన, సంతోషకరమైన ప్రశాంతతతో ఎదుర్కోవడమే, అదే రాగరహిత ప్రేమకు ఉత్కృష్టమైన మానవీయ అభివ్యక్తి.[4]

"ఇంకా సంస్థల ద్వారా కూడా ఇదే విధమైన పనిని మనం ఆశిస్తాం. సంస్థల పనితీరును ప్రయోజనకరం చేయటంలో ఆలోచన, మాటలు తమ పాత్రను నిర్వహిస్తాయి. ఈ విషయాల్లో కూడా శ్రీమాత విలువైన మార్గదర్శకత్వం నెరపుతుంది. సంస్థలు-

---

1. వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో, పే. 62
2. అదే పే.67
3. అదే పే.66
4. అదే పే.66-67

సంఘాలు మొండిగా వ్యవహరించరాదు. ప్రకృతి రహస్య విధానాల స్వేచ్ఛాశక్తుల కనుగుణంగా అవి వ్యవహరించాలె. వ్యక్తిగత సంబంధాలు గట్టిగా ఉంటే సంస్థ అనే గొలుసు గట్టిగా ఉంటుంది. మరో మాటలో చెప్పాలంటే "ఈ ప్రపంచంలో సృష్టించాలనుకుంటున్న ప్రాణవ్యవస్థలో మనమంతా జీవకణాలు కావాలె".[1] సరియైన క్రమశిక్షణ, ఆలోచనా నియంత్రణను సాధించగల్గుతాం. క్రమశిక్షణతో పాటు పరమాత్మపట్ల సంపూర్ణ శరణాగతి – ప్రపత్తి అవసరం. అప్పుడే భగవంతుని చేతిలో బంకమట్టివలె ఏ రూపాన్నైనా పొందగల్గుతాం.[2]

చివరగా మాటలవల్ల ప్రయోజనం లేదని హెచ్చరిస్తుంది శ్రీమాత. విద్యుచ్ఛక్తి నింపని బ్యాటరీల వలె శబ్దాలు వాటికవే ఉన్నప్పుడు విలువలేనివి. వాటిలో శక్తిని నింపేది వ్యక్తిత్వం. శబ్దం అంటే శక్తి. దాన్ని వృధా చేయరాదు. శక్తిహీనం చేయరాదు.

ఆత్మ యొక్క విప్లవాత్మక రూపాంతరం అంటే ఆత్మ వికాసం పొందే దశలో శ్రీమాత సాధారణ వ్యాసాలకంటే మరింత సున్నితమైన మార్గాలను అంతరంగ రూపాంతర సన్నద్ధత కొరకు ఆత్మవికాసం కొరకు చేపట్టింది. శ్రీమాత ఆధ్యాత్మిక వికాసం కోసం ప్రార్థన, ధ్యానము అనే రెండు నూతన సాధనాలను ఎంచుకొంది. ఇవి కొత్తవి అనడంలో ఉద్దేశ్యం మరింత తరచుగా ఉపయోగంలోకి తెచ్చింది అని ఆధ్యాత్మిక శోధకుడికి ప్రార్థన అనేది వస్తుపరమైన బహుమతులను లాభాలకోసం అంటే ఎలక్షన్లలో విజయం, పరీక్షలో ఉత్తీర్ణత, వ్యాపారాభివృద్ధి, శారీరక బాధనుండి విముక్తి వంటి వాటి కోసం బిచ్చమెత్తడం కాదు. ప్రార్థనకు మరింత ప్రాథమిక లక్ష్యాలున్నాయి. ఉజ్వలమైన శక్తి ఉంది. నిజమైన ఆధ్యాత్మికుడు ఈ దూర లక్ష్యాలను గుర్తించి ప్రార్థనా శక్తితో ఈ అతీంద్రియ శక్తులను సమీకరిస్తాడు. నిజానికి ప్రార్థన అనేది ఆరాధన, అనుబంధం, సహకారం అనే మూడు రాగాలతో పాడే అంతులేని మధుర సంగీతం. ఈ మూడు రాగాలు "మొదట భగవంతుని అతీంద్రియ వాస్తవికతతో మనకు వ్యక్తిగత ప్రవేశం, ధ్యాసను కలిగిస్తుంది. తర్వాత ఈ ప్రవేశంతో భగవంతుని కుపయోగపడే అతీంద్రియ వ్యక్తిత్వాలుగా మనం మారే అవకాశం కల్గుతుంది. చివరగా, ఇందువల్ల ఇతర ఆత్మలపై అతీంద్రియ చర్య చూపే శక్తి కల్గుతుంది. ఆరాధనా స్థితి అతీంద్రియత్వానికి ఆత్మ తలుపులను తెరుస్తుంది. ఆ అతీంద్రియశక్తి ఆత్మ కోరికను, ప్రేమను

1. వర్డ్స్ ఆఫ్ లాంగ్ ఎగో, పే. 70
2. అదే పే. 72

మరింత ఆక్రమణతో స్వాధీనం చేసుకొని ప్రేమైకబంధాన్ని ఏర్పరుస్తుంది. అంతులేని శక్తి ప్రదాయినిగా మరింత సన్నిహితమైన సహకారం ఏర్పడుతుంది. అతీంద్రియ శక్తులను సహించే ఆత్మలో ప్రార్థన అవిచ్ఛిన్నంగా కొనసాగుతుంది. ఎందుకంటే దాని చర్య మొత్తం అతీంద్రియత్వాన్ని సంతరించుకొంటుంది కనుక."[1]

యౌవనంలో ఉన్న సన్యాసినివలె
ఎడారిలో అందమైనది
ఎల్లప్పుడూ ప్రార్థన చేస్తూ, నిద్రలో కూడా
ప్రార్థించే వ్యక్తి

అన్న కోలరిడ్జ్ మాటల్లో ప్రార్థన ద్వారా దైవసాన్నిధ్య స్థితి కనిపిస్తుంది. ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం మాత్రం ప్రార్థన లోతులను, పరిధిని పెంచటమే. తద్వారా ఎప్పుడో ఒకసారి, తెరలు తెరలుగా అసంపూర్ణమైన హృదయపు పొంగుగా ఆరంభమైన దానిని అన్ని రకాల ఆలోచనల, చర్యల, ఆనందాలను, వివిధరకాల శారీరక, హృదయ, మనస్ చలనాలను సున్నితంగా ప్రభావితం చేస్తూ రూపాంతరం చెందింపజేసే సర్వ వ్యాప్తమైన శాశ్వతమైన, స్థిరమైన ఆత్మ లక్షణంగా మార్చగలగటమే.

ప్రార్థించే వ్యక్తికీ ప్రార్థనాలక్ష్యమైన వర్ణనాతీతమైన వస్తువుకూ మధ్య ఒకే రకమైన సంబంధం ఉంటుంది. "అనంతాన్ని ఎంచుకున్న వ్యక్తిని కూడా అనంతమే ఎంపిక చేస్తుంది." అంటారు శ్రీ అరవిందులు.[2] 14వ శతాబ్దపు ఆంగ్ల మార్మికుడు నార్విచ్‌లోని జూలియానా వ్రాసిన రెవలేషన్స్ అనే పుస్తకంలోని ఈక్రింది వాక్యాలను డా॥ ఇంగే ఉదహరిస్తాడు.

"కాని నా ప్రభువు ఇలా చెప్పాడు. "నీవు కోరే భూమికను నేనే. మొదట నీలో కలిగింది నా సంకల్పమే; తర్వాత దానికోసం యాచించేట్టు నేనే చేస్తాను. అప్పుడు నువ్వు యాచిస్తావు అటువంటప్పుడు నువ్వు యాచించేది నీకు లభ్యం కాకపోవటం ఎలా సాధ్యం? ఉత్తమ ప్రభువు మనం యాచించే అంశాలన్నిటినీ ముందే అనాదిగా మనకోసం శాసించి ఉంచుతాడు."[3]

ప్రార్థించినప్పుడు మనంతట మనమే చేతులెత్తుతాము. కాని "నిజానికి సర్వాంతర్యామియైన ఆ భగవంతుడే రహస్యమైన అతిసూక్ష్మమైన ఒత్తిడితో మనిషిలో

---

1. ఎవలిన్ అండర్‌హిల్, మ్యాన్ అండం ది సూపర్ నాచురల్ (1927), 204-205.
2. ది సింథెసిస్ ఆఫ్ యోగా, ప్రథమ భాగం, పే.2
3. క్రిష్చియన్ మిస్టిసిజం (1925), పే. 204

తన మొట్టమొదటి సంకల్పము, ప్రేమతో కూడిన చలనాన్ని కల్గిస్తాడు."[1] అసంకల్పితంగా జరిగే ఈ పని వాస్తవమే; కాని పూర్తిగా కాదు. మనం చేతులెత్తి ఈ పుష్పాలను ఆ భగవంతునికి అర్పిస్తున్నాం. కాని ఈ హస్తాలు, పుష్పాలు అతనికంటే వేరు కావు కదా! సెయింట్ థెరిసా ఒక సారూప్యం చూపిస్తుంది. మన ఆత్మ దున్నిన, ఎండిపోయిన తోట వంటిది. అందులో పిచ్చి మొక్కలెన్నో. భగవంతుడు పిచ్చిమొక్కలను తొలగిస్తాడు. మనం ప్రార్థన ద్వారా మొక్కలకు పుష్పాలకు నీరందించాలె. ఆత్మోజ్జీవనమైన ఈ ప్రార్థన నాలుగు రకాలు. నువ్వు ఒక లోతైన బావినుండి నీళ్లుతీసుకోవచ్చు; అందుకోసం నువ్వొక గిలకపైనుండి బకెట్ వాడవచ్చు; ఒక ప్రవాహం తోటగుండా పోయేట్టు చేయొచ్చు. లేదా ఆకాశం నుండి వర్షాల కోసం ప్రార్థించవచ్చు. తెలివైన తోటమాలి ఈ మార్గాలు వేటినైనా తృణీకరించడు. అన్నీ ముఖ్యమైనవే కాని పైనుండి కురిసే జల్లులే మిగతా అన్నింటినీ సాధ్యం చేస్తాయి. అందుకే అదే చాలా ఫలప్రదమైనదీ, మధురమైనది కూడా.

నియంత్రిత సూత్రం వేరైనా ధ్యానం కూడా ప్రార్థనకు అతి సన్నిహితమైనది. లక్ష్యాల్లో ఆచరణలో పరస్పరం అనుగుణంగా ఉంటూ అవి మానవుని దైవీకరణకు, దైవం మానవీకరణకు తోడ్పడుతూ ఆత్మ పరమాత్మల తేజోమయ సాన్నిహిత్యానికి అద్దం పడతాయి. దీంతో భక్తునికీ భగవంతునికీ మధ్య ఇచ్చిపుచ్చుకొనే ధోరణి, సంపూర్ణ అవగాహన, ప్రశాంతమైన ఉజ్వల విశ్వాసం పాదుకొల్పుతాయి.

"ఈ చిన్న ప్రాణిని దాని అంతస్తులోనే కలుస్తాడు. మొదట విస్మయం చెందే పూజతో నిండిన ఆత్మను ఆ భూమికపై కలుసుకొని గెల్చుకుంటాడు. ఒక వింతైన ప్రగాఢ సమాగమం జరుగుతుంది. ఒక చిన్న మానవుడు అనంతమైన సహచరుడితో పొందే సమాగమంలోనే మానవ వ్యక్తిత్వంపై ప్రార్థన కల్గించే రూపాంతర శక్తి ఉంది. ఈ సమాగమం చిన్నదైనా అతి సన్నిహితమైనది, అర్పిత భావంతో ఉన్నా సులభగ్రాహ్యం కానిది. అట్లాగే సర్వాంతర్యామియైన పరమావధి పరిమిత మానవ హృదయంలో చొచ్చుకపోవడం ఊహకందని విషయం." [2]

ఇట్లా అనంతమైన పరమాత్మతో నిజమైన సాన్నిహిత్యాన్ని, పవిత్రమైన ధ్యానాత్మక జీవనాన్ని సాధనం చేయటంలో ప్రార్థన పాత్రను వర్ణించటం అతిశయోక్తి కాదు. అయితే ప్రార్థన-ధ్యానం ఈ రెంటి కార్యకారణ సంబంధాన్ని గురించి వితండ

---

1. ఎవిలియన్ అండర్‌హిల్, ది గోల్డెన్ సీక్వెన్స్ (1932), పే.150

2. మ్యాన్ అండ్ ది సూపర్ నాచురల్, పే. 216-217

వాదం చేయడంలో అర్థం లేదు. ఈ రెండూ ఆధ్యాత్మిక జీవనంతో ముడిపడి ఉన్నాయని గుర్తుంచుకుంటే చాలు.

౧౦

ఆధ్యాత్మిక వికాసం, అతీంద్రియ విజ్ఞానం, అనుభవాల్లో ఉన్నత దశకు చేరుకున్నాక 1912లో శ్రీమాత తన రోజువారీ ప్రార్థనలను, ధ్యానాలను వ్రాయటం ప్రారంభించింది. ఫ్రెంచి మూలంలో ఉన్న సాధారణమైన సొగసు, పదప్రయోగం, ఆకర్షణీయమైన లయ ఆంగ్లానువాదంలో కనిపించదు. అయినా అనువాదం ఎంతో సున్నితంగా తీయదనాన్ని కోల్పోకుండా అనువాదకుడు శ్రద్ధ తీసుకున్నాడు. ప్రస్తుత విస్తృత రూపంలో 1948లో ప్రచురించబడిన శ్రీమాత ప్రార్థనలు ధ్యానాలు చాలా ఆకర్షణీయమైన, ఉత్తేజకరమైన గ్రంథం. నిజంగా సాహిత్య, ఆధ్యాత్మిక సంపద.

ఇందులో నవంబర్ 2,1912 నాటి మొట్టమొదటి ఎంట్రీలోనే మనను ద్రవింపజేసే ప్రార్థనలు, ధ్యానాలకు సంబంధించిన మూలసూత్రం హత్తుకునే స్పష్టతతో సూచించారు.

"అన్ని వస్తువుల్లో జీవం, వెలుగు, ప్రేమ నీవే ఐన ఓ ఉన్నత పురుషా ! సైద్ధాంతికంగా నా జీవితం నీకే అంకితమైనా, ఈ పవిత్రీకరణను విశదంగా నిర్వహించలేక పోతున్నాను. వ్రాసిన ధ్యానానికి, దాని సమర్థనకు కారణం ప్రతిరోజు దాన్ని నీకు నివేదించటంలోనే ఉందని ఎన్నో వారాల తర్వాత కాని నాకు తెలియలేదు. తరచుగా నీతో నేను జరిపిన సంభాషణ కొద్దిభాగాన్ని ఈ విధంగా ప్రతిరోజూ ఒక రూపంలోకి తెస్తాను. నాకు వీలైనంత మంచిగా నీతో నా తప్పులను నివేదించుకుంటాను. అట్లా నీకు నేనేదో చెప్పగల వ్యక్తినని అనుకోకు. ఎందుకంటే నీకు నీవే సర్వస్వం. మేము నిన్ను చూడటానికి, గ్రహించడానికి చేసే కృత్రిమ, బాహిర ప్రయత్నాలన్నీ నీకు దూరమైనవి, నీ ప్రకృతికి భిన్నమైనవి. అయినా నీ కభిముఖమై, ఈ విషయ పరిగణనలో ఈ వెలుగులో తడిసి మెల్లమెల్లగా వాటి వాస్తవ రూపాలను గ్రహిస్తాను. ఈ క్రమం నేను నీతో ఐక్యం చెంది, నీకు చెప్పవలసిందేమీ లేక, చివరకు నేనే నీవయ్యేంత వరకు సాగుతుంది. ఈ లక్ష్యాన్ని నేను చేరతాను. ఈ విజయం కోసమే నా ప్రయత్నాలన్నీ. 'నేను' అనే మాట అనని రోజును నేను ఆకాంక్షిస్తున్నాను. ఎందుకంటే అప్పుడు నేనే <u>నీవు</u> ఐపోతాను కనుక."

అట్లా నిత్య సాన్నిధ్యానికి భూమిక, చైతన్యం సురక్షితంగా ఏర్పడిన తర్వాత మనలో అప్రయత్నమైన శక్తితో ఆకాంక్ష, ఆరాధన, సాన్నిధ్యం ఆధ్యాత్మిక క్రియల ఉజ్వల

ప్రవాహం పైకెగస్తుంది. అది నిజంగా ఆత్మ యొక్క అంతులేని సంపదల అద్భుతమైన వెల్లువ. ప్రబుద్ధాత్మల గనుల నుండి సేకరించిన ఉపమాలంకారాలు, అద్భుత అవగాహనా సందోహాలు, విమర్శింపబడిన తర్కవితర్కాల గొలుసులు, పరమానందపు పాత్రల నుండి వీచే ప్రగాఢ తరంగాలు, ఆత్మను శుద్ధి చేసి రూపాంతరం చేయడం కోసం పరమాత్మ చర్యవల్ల కొలిమి నుండి వెలువడే నిప్పురవ్వలు – ఇవన్నీ శ్రీమాత దైనిక ప్రార్థనలు, ధ్యానాలలో కనబడే ప్రస్తుత ప్రయోగాలు. ఇవన్నీ ఆమెకు ఒక దినచర్య, ఆమె తపనలు, ప్రార్థనలు, తాత్కాలిక దర్శనాలు, పాక్షిక ఆవిష్కరణలు, నవీకరించబడిన దర్శనాలు, అప్పుడే చిగురించిన ఆవిష్కరణలు. ఈ ప్రార్థనలు, ధ్యానాల బంగారు వరుసలను గమనిస్తే, ఆ వైశాల్యము ఎత్తులలోనూ, అవధులు దాటిన ప్రకాశంలో, ఇహంతో అదృశ్యంగా అంతరాంతరాల్లో పెనవేసుకొని ఒక్కటైన పరంలో కొంతైనా మనం పాల్గొంటాం.

నవంబర్ 19,1912వ తేదీలో శ్రీమాత ఇట్లా రాస్తుంది. "నిన్ను చేరాలని చిత్తశుద్ధితో నా వద్దకు నిన్న వచ్చిన ఆంగ్లేయుడితో నేను నిన్ను కనుగొన్నానని, మా సమాగమం స్థిరమైనదనీ చెప్పాను. నేను జాగృతమైన స్థితి అది. నా ఆలోచనలన్నీ నీ వైపే; నా చర్యలన్నీ మార్పులేని, శాశ్వతమైన సత్యం. నీ శాంతి నా హృదయంలో సుస్థిరం"[1] సమాగమం జరిగినా, అసలు స్వరూప అనుభవం ఇంకా రావాల్సి ఉంది. అయితే అచంచలమైన, వ్యాకుల రహితమైన విశ్వాసం వల్ల అదీ కాలక్రమంలో వస్తుంది. అందుకే శ్రీమాత తన నిష్కళంక విశ్వాసాన్ని పదే పదే నొక్కి చెపుతుంది.

"నువ్వే సర్వమయుడివి, సర్వాంతర్యామివి. కనిపించే విశ్వంవలె ఈ శరీరమూ నీశరీరమే. ఇందులో శ్వాసించేదీ, యోచించేదీ, ప్రేమించేదీ నువ్వే. ఈ పదార్థమూ నువ్వే అందుకే యిష్టపూర్తిగా నీ బానిసగా కావాలని కోరుకుంటుంది"[2]

"నువ్వే అంతటా – ఎల్లప్పుడూ సారంలో నువ్వే రూపంలో నువ్వే. మరేం లేదు."[3]

ఆకాంక్ష, విశ్వాసం, ఆత్మ సమర్పణ ఈ మూడూ సాధన అనే వంతెనకు తోరణాలు. శ్రీమాత ఇలా వ్రాస్తుంది. "నీలోకి నేను దూకుతున్నాను. శిశువుకుండే నమ్మకంతో నన్నునేను పోగొట్టుకొని నా చుట్టూ ఉన్న తప్పులను సరిదిద్దడానికి

1 ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 3

2 అదే పే. 4

3 అదే పే. 4

అవసరమైన ఉత్తేజం, శక్తి (ఈ రెండూ నాకొక్కటే) నీ నుండి లభించాలని ఎదురు చూస్తాను. అన్ని చర్యలూ పూర్తిగా పరస్పర ఆధారితాలని నిర్దేశించే విశ్వ ఐక్యత గురించి నాకిప్పుడు స్థిరమైన, ఖచ్చితమైన అవగాహన ఉంది"[1] డిసెంబర్ 3, 1912 తేదీన శ్రీమాత ఇలా నమోదు చేసింది. "గతరాత్రి నీ మార్గదర్శకత్వానికి విశ్వాసపూరిత ఆత్మ సమర్పణ ప్రభావాన్ని అనుభవించాను. నీ ఉజ్వల ప్రకాశం పట్ల మనసెంత మందకొడిగా నిష్క్రియగా ఉంటే దాని అభివ్యక్తి అంత స్వచ్ఛంగా, తగినంతగా ఉంటుంది. భయంలేదు అసౌలభ్యమూ లేదు బాధా లేదు. ఉన్నదల్లా సంపూర్ణమైన ప్రశాంతత, అన్య నిరపేక్ష విశ్వాసం, మహత్తరమైన అచంచల శాంతి.[2] "రెండు రోజుల తర్వాత, "తొందరలేదు, అశాంతి లేదు, ఉద్రిక్తత లేదు; నువ్వెవరోకాదు నువ్వే; విశ్లేషణ, సాకారం లేని ఏదైనా నువ్వే; అంతా దివ్యమైన శాంతీ, పవిత్ర నిశ్శబ్దం అవుతాయి కనుక నిస్సందేహంగా నువ్వు ఉన్నావు."[3] ఇటువంటి శాంతి, నిశ్శబ్దం, ప్రశాంతతల సాకారపు భావన మరికొన్ని రోజులు అలాగే కొనసాగుతుంది. పదాలు ఆ ఉద్వేగాన్ని తమంతట తామే సంతరించుకొంటాయి:

"నిశ్శబ్దంలో మండే జ్వాలవలె, నిశ్చలంగా పైకెగసే సుగంధం వలె నా ప్రేమ నీ వైపు పయనిస్తుంది. నీ అభీష్టమే నెరవేరుతుందని, నీ ప్రకాశమే సాకారమౌతుందని, నీ శాంతి ప్రకాశిస్తుందని, నీ ప్రేమ ప్రపంచాన్ని కప్పి వేస్తుందని పసిపిల్లవలె ఎదురు ప్రశ్నించకుండా, దేన్నీ పట్టించుకోకుండా నన్ను నీకే సమర్పించుకొంటాను."[4]

"నిన్న నీ ప్రకాశం నానోటి ద్వారా ఆవిష్కరించింది. ఎటువంటి ప్రతిఘటనా ఎదుర్కోలేదు. ఈ సాధనం సానుకూలంగా, మార్దవంగా, తగిన స్వరూపంతో ఉంది. ప్రతి వస్తువులో, ప్రాణిలో కర్తవు నువ్వే. అన్ని ప్రక్రియల్లో మినహాయింపు లేకుండా నిన్ను చూడగలిగేంత దగ్గరగా ఉన్నవారికి ప్రతిచర్యనూ ఒక దివ్య ఆశీస్సుగా మలచుకోవటం ఎలాగో తెలుస్తుంది."[4]

డిసెంబర్ 11, 1912 నుండి ఫిబ్రవరి 5, 1913 వరకు దాదాపు రెండునెలలు సుదీర్ఘ అంతరాయం. పరమాత్మ భూమిలో పలికిన శ్రావ్యమైన పలుకులు తనకు వినిపించాయని, ఫిబ్రవరి 5న వాటిని ఈ విధంగా శ్రీమాత వివరించారు.

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 4
2. అదే పే. 7
3. అదే పే. 8
4. అదే పే. 8

"దుఃఖితురాలైన ఓ నిరుపేద భూమీ ! నేను నీలో ఉన్నానని గుర్తుంచుకో; నిరాశచెందకు. ప్రతి ప్రయత్నమూ, ప్రతి దుఃఖమూ, ప్రతి సంతోషమూ, ప్రతి బాధ, నీ ప్రతి హృదయస్పందనా, నీ ఆత్మ యొక్క ప్రతి ఆకాంక్షా; నీ ఋతువుల ప్రతి కొనసాగింపూ, ఏ మినహాయింపు లేకుండా సమస్తమూ, అంతే కాకుండా సుఖ దుఃఖాలుగా – అందంగా వికారంగా నీ కనిపించేవీ, అన్ని రకాల నిర్ధోషత్వమూ నిన్ను నావైపే నడిపిస్తాయి. నేనే అంతులేని శాంతిని, ఛాయా రహిత ప్రకాశాన్ని, సంపూర్ణ సామరస్యాన్ని, సునిశ్చితత్వాన్ని విశ్రాంతిని, మంగళాశాసనాన్ని"[1]

భూ ప్రకృతి ఒక రోజు పరమోన్నత ప్రకృతి గా మారుతుంది. అందుకే దుఃఖించాల్సిన పనిలేదు. "భారతదేశంలోని అత్తరు, సాంబ్రాణుల స్వచ్ఛమైన ధూపం వలె" శ్రీమాతలోని కృతజ్ఞత పరమాత్మ వైపు ఉప్పొంగుతుంది. పరమాత్మను ఉద్వేగంతో పొందే ప్రయత్నం చేయడం కంటె ఆయన కోసం ఎదిరి చూడటం తెలివైన పని. ఎందుకంటే ఆయన తప్పకుండా వస్తాడు. అనుగ్రహిస్తాడు. ఆయన సంకల్పం పట్ల పెరుగుతున్న చైతన్యం, దాంతో క్రమంగా ఒక్కటవటంలోనే నిజమైన స్వేచ్ఛ, శక్తి, సంపూర్ణ రూపాంతరం పొందే అవకాశం ఉంటాయి. ఆమె విశ్వాసం పటిష్ఠమైంది. ఆత్మసమర్పణే ఆమె మార్గం కాబట్టి అంతిమ సత్యాన్ని గూర్చిన అవగాహన ఆమె సువర్ణమయ శబ్దాలలో కనిపిస్తుంది.

"ఓ భగవంతుడా ! భగవంతుడా ! నా హృదయం అంతులేని ఆనందంతో నిండిపోతున్నది. ఆనందగీతాల అద్భుతతరంగాలు నా తలలో ఉప్పొంగుతున్నాయి. నీ ఖచ్చితమైన విజయంపై సంపూర్ణ విశ్వాసంతో ఒక పరమోన్నతమైన శాంతిని మొక్కవోని శక్తిని పొందుతున్నాను. నాలో నీవు నిండిపోయావు. నా ఆత్మకు జీవం నీవే. అందులో నిక్షిప్తమైన నీటి చెలిమెలను కదలించేది నువ్వే. దాని అవగాహనను ప్రకాశమానం చేసేది నువ్వే. దాని జీవనాన్ని గాఢమయం చేసేది నువ్వే. దాని ప్రేమను పదిరెట్లు పెంచేది నువ్వే. ఈ విశ్వం నేనా లేక నేనే విశ్వమా? నీవు నాలో ఉన్నావా లేక నేను నీలో ఉన్నానా నాకు తెలియదు. నువ్వొక్కడివే ఉన్నావు. అంతా నువ్వే; నీ అపారదయా తరంగాలు ప్రపంచంలో నిండి వరదలై పారుతున్నవి".[2]

"ఒక వరమోత్కృష్టమైన, గంభీరమైన దివ్యసంగీతం దరహాసంతో, సూక్ష్మంగా నా హృదయంలో ఉదయిస్తున్నది. ఈ సంగీతం నా నుండి నీ వైపు ప్రవహిస్తున్నదా

---

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 10–11.

2 అదే పే. 14

లేక నీ నుండి నావైపా, లేక నీవు, నేను, ఈ సమస్త విశ్వమే ఇప్పుడు నేను గుర్తించిన అద్భుత సంగీతమా నాకు తెలియదు. . .నీవు కాని, నేను కాని లేదా ప్రత్యేకంగా ఈ విశ్వం కాని లేవు. . .·. నా సత్త అంతులేని శాంతితో ఆనందిస్తున్నది."[1]

"నీవు లేకుంటే అంతా జడమే, పశుప్రాయమే, అచైతన్యమే. ప్రకాశించేదంతా నువ్వే. పరవశింపచేసేది నువ్వే. మేము జీవించటానికి, మా ధ్యేయానికి ఏకైక కారణం నువ్వే. ఇదొక్కటి చాలదా మేం మా వ్యక్తిగత ఆలోచనలను వదిలి రెక్కలు విప్పి వస్తుపర జీవితపరిధుల కతీతంగా ఎగరడానికీ, నీ దివ్య వాతావరణంలోకి ఎగిరి ఆ శక్తితో తిరిగి భూమికి వార్తావహులుగా వచ్చి అతి సమీపంలో నున్న నీ రాక గురించిన సువర్ణ సందేశాన్ని అందించడానికి?"[2]

అప్పుడప్పుడు ఇహపరిమితులు, మానవుని అజ్ఞానాంధకారమూ, ఆనంద రాహిత్యం ఆమె చేతనపై ఒత్తిడి కలిగిస్తాయి. ఈ భూమీ, మానవుడే తను త్రవ్వుకున్న దుఃఖంలో తానే పిచ్చిగా భయంతో తిరుగాడుతున్నాడని ఆమె విచారంతో సున్నితంగా మూల్గుతుంది.

"ఓ భగవంతుడా ! నాకో వరం ప్రసాదించు – నేను వెలుగును, వెచ్చదనాన్నిచ్చే నిప్పువలె, దాహార్తిని పోగొట్టే జలధారవలె, ఆశ్రయాన్ని రక్షణనిచ్చే వృక్షం వలె కావాలని, మానవులెంతో దుఃఖంతో అమాయకత్వంతో ఉన్నారు. వారికెంతో సాయం అవసరం."[3]

"మానవులు ఈ వరాలనుండి ఎంతో భయపడుతున్నట్టుగా ఎందుకు దూరంగా పరుగెడుతారు? అజ్ఞానం ఎంత విచిత్రం? సర్వ దుఃఖాలకూ అదే మూలం. మనకు సంతోషాన్నిచ్చే వస్తువును దూరం చేసి యాతన, వేదనలనుండి ఉత్పన్నమైన బాధామయ సాధారణ జీవిత ఆలోచనా సరళికి వశపరచే ఆ అంధకారం ఎంత దయనీయమైనది?"[4]

అసహనంతో చిర్రుబుర్రులాడటం సమస్యకు పరిష్కారం కాదు. కాని ఓపిక వహించటం ఎంత కష్టం? హాప్కిన్స్ మాటల్లో,

సహనం, అతికష్టమైంది !. . . .
. . . .ప్రకృతి హృదయపు గులాబీ అది
విరిగిన గతకాలపు లక్ష్యాల శిథిలాలను

---

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 18
2. అదే పే. 22
3. అదే పే. 15
4. అదే పే. 16

శీతల జలధారలా? కాదంటుంది శ్రీమాత, నిర్దోషమైన పరిష్కారమేదో ఉండాలె. తన హృదయాంతరాళాల్లో దాగి ఉన్న "మార్గదర్శకుని" మాటలు విన్నప్పుడు ఆమెకది తెలుస్తుంది. తల్లికున్నంత ప్రేమ, ఆచార్యుని సహనం ఆ దర్శకుడిలో ఉన్నాయి."[1]

అచేతనలోని స్తబ్దత, గుడ్డి అజ్ఞానం లోని ఓటమి, నిరాశలు ఈ ఐహిక జీవనాన్ని కప్పివేస్తూ, లక్ష్య సాధనకు ప్రగతి మార్గాన్ని అడ్డుకొంటాయి. ఈ స్తబ్దత, కుప్పతెప్పలుగా పొందుతున్న ఓటమి, వక్రత, నిరాశల పట్ల శ్రీమాత తీవ్రంగా కలత చెందుతుంది. నవంబర్ 29,1913న శ్రీమాత ఇలా ప్రశ్నిస్తుంది. "ఎందుకీ అల్లరి, చలనం, పనికిరాని ఆందోళన? తుఫానులో చిక్కుకున్న కీటకాల దండువలె తోసి పారేస్తున్న ఈ సుడిగాలి ఎందుకు? శక్తి యుక్తులు నిర్వీర్యమౌతున్న ఈ దృశ్యం ఎంత దయనీయమైనది? దేనితో ఎవరి చేతిల్లో ఆడుతున్నామో తెలియని తోలుబొమ్మల వంటి దుస్థితి ఎప్పుడు తొలగిపోతుంది?"[2] "వృథా" అన్న పదమే మన ఘోరమైన తప్పిదాలకు, చేతగాని తనానికి కీలకంగా మారింది. ప్రకృతి ప్రసాదించిన వరాలు వృథా చేస్తున్నాం. మన శక్తులను వృథా చేస్తున్నాం. మన కాలాన్నీ, అందాన్నీ వృథా చేస్తున్నాం. అన్నిటికంటే మిన్నగా "దైవకృప"ను వృథా చేసి పారవేస్తున్నాం. పిచ్చి మానవుడు అనాగరికుడి వలె "తన తెగ అంతటికంటే సుసంపన్నమైన ముత్యాన్ని" పారవేస్తున్నాడు ! ఈ పచ్చి వాస్తవానికీ ఉజ్వలమైన అవకాశానికీ మధ్యనున్న తెరను శ్రీమాత పరికించి, ఈ ప్రపంచంలో ఈ తెరతొలగి కాంతి ఎప్పుడు ప్రసరిస్తుందోనని యోచనలో పడుతుంది.

"నీ దివ్యప్రేమతో ఒకటై ఈ ప్రపంచాన్నీ, ప్రాణుల గురించి యోచిస్తున్నాను. చావు పుట్టుకల చక్రబంధంలో కొట్టుమిట్టాడుతున్న ప్రాణులు, సృష్టితోనే లయమౌతున్న అనంత జీవ సమూహం, ఊపిరివలె అశాశ్వతమైనా తాము చైతన్యవంతులమనీ, శాశ్వత వ్యక్తిత్వం గలిగినవారమనీ ఊహించుకొనే వారూ, ఎప్పుడూ దాదాపు ఒకే తీరుగా ఉండేవారూ, వివిధ రకాలుగా ఒకే కోరికలను, ఒకే ధోరణులనూ, ఒకే కాంక్షలనూ ఒకే రకమైన అజ్ఞానపు తప్పిదాలనూ చేసేవారూ – వీరి గురించే నా యోచన."[3]

నగర జీవనం, నాగరికత మానవులను కపట సుఖాలు, హేయమైన, మూర్ఖపు సంతృప్తితో కూడిన ఘోరమైన తప్పిదంలో పడదోస్తున్నాయి. మరో తేదీన శ్రీమాత ఇలా వ్రాస్తుంది: "ఈ మాయా వ్యక్తిత్వాల అంతులేని సుడిగుండం, ఘర్షణపడుతున్న

1. శ్రీ అరబిందో, ది సింథెసిస్ ఆఫ్ యోగా, I పే. 15.
2. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 28
3. అదే పే. 25

ఆలోచనలు, ధోరణులు, కోర్కెలు సృష్టించే అంతులేని అయోమయం, ఈ బాహుళ్యం, ఈ సంక్లిష్టత ఎంతో దుఃఖపూరితాలుగా నాకు కనిపిస్తున్నాయి. కల్లోల సాగరం నుండి మనం బయటపడాలె. నీ శాంతి తీరాల ప్రశాంతతను చేరుకోవాలె."[1]

ఈ కల్లోల సాగరం నుండి బయటపడటమెలా? అల్లరిని నిశ్శబ్దంతో, ఆందోళనను ప్రశాంతతతో, నిరాశాపూరితమైన బాధను ప్రశాంతమైన ఆనందంతో వ్యతిరేకించండి. వ్యక్తితో ప్రారంభిస్తే సమష్టి దానంతట అదే వెంట వస్తుంది. సంస్కరణ, పరివర్తన అంతరంగంలో ప్రారంభం కావాలె. "అన్ని అడ్డంకులున్నవి మనలోనే. అన్ని కష్టాలు మనలోనే ఉన్నాయి, అజ్ఞానమూ, అంధకారమూ ఉన్నవి మనలోనే"[2] అందుకే చికిత్స కూడా మనలోనుండే రావాలె. ఈ రహస్యానికి చిట్కా "మనలో ముడుచుకొని ఉన్న మొగ్గ. ఒకసారి మనస్సు పరమాత్మ కభిముఖమైతే ఒక్కొక్క కనువిప్పుతో మొగ్గ రేకులొక్కొక్కటి త్వరగా, క్రమంగా విచ్చుకొంటాయి."[3] నిర్ణయాత్మక మైన మలుపు చివరికి వచ్చినప్పుడు, సుస్థిరమైన మహానిశ్శబ్దాన్ని విన గలిగితే చాలు. ఆ నిశ్శబ్దం "నిష్ఫలమైన అల్లరిని, వృథా ఆందోళనలను, పనికిరాని శక్తుల విభజన అంతటినీ మింగేస్తుంది."[4] పరమాత్మ స్వరమైన ఈ అచంచల నిశ్శబ్దం అందరిలోనూ ఉంటుంది. అందరికీ ఈ అంతశ్శక్తి తెలియదు.

అంతేకాక "ఈ నిశ్శబ్దం ముందుకు సాగుతుంటుంది. మనం సాధించిన సమాగమ సంపూర్ణత ఎటువంటిదైనా, మన శరీరం ద్వారా పరస్పర సామ్యతా, ప్రపంచంతో సంబంధం ఉన్నంతవరకు నీతో జరిగే ఈ సమాదమం ఎప్పుడూ మరింత సంపూర్ణతను సాధించుకో గలుగుతుంది".[5] తన తెగను సంపూర్ణం చేసుకొనే ముందు, శ్రీమాత తనను మొదట సంపూర్ణం చేసుకొంటుంది. అందుకే పదేపదే వినిపించే ఆర్ద్రతా భరితమైన ఆమె ప్రార్థన. "ఓ భగవంతుడా ! నీతో నేను మొరపెట్టుకుంటున్నాను అన్ని బాధలనూ మసిచేసే మండుతున్న కొలిమిగా నన్ను మార్చు. స్వచ్ఛమైన ప్రేమ, అపారమైన దయతో కూడిన శిల్పిగా నన్ను మార్చు."[6]

---

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 58
2. అదే పే. 65
3. ది సింథెసిస్ ఆఫ్ యోగా, పార్ట్ I పే. 1
4. ప్రెయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 33
5. అదే పే. 39-40
6. అదే పే. 48

చివరకు ఇక్కడ అవతరించిన భగవంతుడు తప్పకుండా, పరిపూర్ణంగా ఈ పోరాటపు, బాధామయ ప్రపంచాన్ని శాంతి సామరస్యాలతో కూడిన ప్రపంచంగా మార్చ గలుగుతాడు."[1]

శ్రీమాతకు ఈ అర్థంకాని ప్రపంచభారమూ తెలుసు. అంతేకాదు ఆమెకు తన విధితో పాటు, ఈ భారాన్ని దించి నిర్మూలించాల్సిన ఆవశ్యకతా తెలుసు. "బాధాతప్త మానవుడి"తో ప్రపంచ రాక్షసవేదనను పంచుకున్ననప్పుడు ఆమె అతని దివ్య దృష్టి కలిగిన సహకారిణి కాగల్గుతుంది. జీవనం, వెలుగు, ప్రేమల పునరాగమనానికి ప్రయత్నిస్తుంది. శ్రీమాత అంకిత జీవనంలోని ఈ రెండు సూత్రాలను ఈ క్రింది అంశంనుండి గ్రహించవచ్చు.

"ఎన్నో సార్లు పగలూ, రాత్రీ నేను అంటే నా చేతన పూర్తిగా నా హృదయంలోనే మూర్తీభవించి ఉందని నాకనిపిస్తుంది. నా హృదయం కేవలం ఒక అంగం కాదు భావన కూడా కాదు. అది అమూర్తమైన శాశ్వత దివ్యప్రేమ. ఈ ప్రేమ రూపంగా ప్రపంచంలోని ప్రతి వస్తు కేంద్రంలోనూ ఉంటున్నట్లు అనిపిస్తుంది. నేను నా అనంతమైన బాహువులను చూపుతున్నట్లు సమస్త ప్రాణకోటిని నిరవధిక ప్రేమతో నాలో చేర్చుకుంటున్నట్లు,ఈ విశ్వవైశాల్యాన్ని అధిగమించిన నా స్తనంపై వారు గుంపులు గుంపులుగా వ్రేలాడుతూ ఒదిగి ఉంటున్నట్లు నా కనిపిస్తుంది. శబ్దాల కతీతం ఆ భావం".[2] నిజంగా ఇటువంటి ఉదయిస్తున్న సత్యాలు, ఆవిష్కార దృశ్యాలు కేవల భాషాశక్తిని సవాలు చేస్తాయి.

అటువంటి స్వర్గ దృశ్యాన్ని చెప్పటానికి
నిర్వీర్యమైన పదాలు నీరసాలు
అయ్యో నిష్ఫలంగా ప్రయత్నిస్తాయి. . . .[3]

ఈ ద్వంద్వాల, సామ్యాల ప్రపంచం పోవాలె- పోతున్నది. పొగమంచు కరుగుతున్న కొద్దీ మాటలలో చెప్పలేని, కొలువలేని సరికొత్త ప్రకాశం చేరుతుంది. భూమి ఈ కొత్త శక్తిని, కొత్త ఉనికిని తెలుసుకొని "తన నిజమైన లక్ష్యాలేమిటో అర్థం చేసుకొని నీ సార్వభౌమ సాక్షాత్కారపు శాంతి సామరస్యాల్లో జీవిస్తుంది".[4]

---

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 51
2. అదే పే. 62
3. గైల్స్ ఫ్లెచర్
4. ప్రెయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 38

మార్చ్ 3, 1914న శ్రీమాత ఇట్లా వ్రాస్తుంది. "నా ప్రస్థాన సమయం ఆసన్నమౌతున్న కొద్దీ, నేనొక ప్రశాంత సమాహితి స్థితిలో ప్రవేశిస్తున్నాను".[1] ఆమె త్వరలో సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి ఉంది. "నీ ఉనికిలో మునిగిపోయిన ఆమె ఈ ప్రశాంతమైన గదిలో టేబుల్ వద్ద కూర్చొని వ్రాయలేదు."[2] అందుకే ప్రేమాస్పదమైన అనుకంపతో తన చుట్టూ ఉన్న "వ్యర్థ కలాపాల" వైపు మళ్లి బయటినుండి అవి ఇచ్చిన సంతోషానికి కృతజ్ఞత చెపుతుంది. భవిష్యత్తును స్థితప్రజ్ఞతో ఎదుర్కొంటుంది. "అదొక కొత్త అంతర్గత కాలానికి నాంది కావాలని నేను కోరుకుంటున్నాను."[3] మూడు రోజుల తర్వాత జెనీవాలో తన వేర్పాటు బాధను ఇంకా అనుభవిస్తూ, ఇటువంటి భావనలన్నీ పిల్లకాయతనమే కదా అని ప్రశ్నిస్తుంది. అవును ఒక దృక్కోణంలో నిజమే. కాని ఆమె ఇంకా అడుగుతుంది. "ఈ అనుబంధాలు, వ్యక్తిగత ప్రేమలు ఒకరకంగా మనందరిలో ఉన్న ప్రాథమిక ఏకత్వాన్ని బాహిరంగా సాధించుకొనాలనే తెలియని మానవ ప్రయత్నమే కదా ! తమకు తెలియకుండానే వారందరూ అటువైపే మొగ్గ చూపుతున్నారు కదా !"[4]

"కాగమారు" నౌక నధిరోహించిన తర్వాత, చెప్పలేని ఉపశమనం, పరమాత్మ ఉపస్థితిని రక్షణను గూర్చిన చైతన్యం ఎప్పటి వలెనే అదే ఆకాంక్షతో భగవంతునికి ఆమె నివేదన. "నీ ప్రేమను అనుభవించటానికి, అత్యంత శక్తి ప్రభావాలతో నీ ప్రేమను ప్రకాశింపచేయటానికి ఈ ప్రార్థన. తద్వారా మా సంబంధంతో అందరూ బలవంతులుగా, పునరుజ్జీవితులుగా ప్రకాశించాలె. జీవితాన్ని బాగుచేయడానికి శక్తి కోసం, బాధా నివారణ కోసం, శాంతి, స్థిర విశ్వాసాల కోసం, వేదనను పారద్రోలి నీవు పునాదిగా ఉండి వాడిపోని నిజమైన ఆనంద స్థాపనకోసం ఈ ప్రార్థన"[5] మరుసటి ఉదయం, మార్చ్ 8, 1914వ తేదీనాడు– "ఈ పడవ ప్రయాణీకులందరినీ ఆమె దత్తత తీసుకొని, సమానమైన ప్రేమలో వారిని ముంచెత్తినట్లు"[6] అనిపిస్తుంది. ఆమెకిక ఏ ఇబ్బందీ లేదు. ఆ పడవలో స్వగృహంలో ఉన్నట్లే అనిపిస్తుంది. ఆ పడవ ఒక అద్భుత శాంతి సౌధం, నీ గౌరవపురస్సరంగా నిర్మించిన దేవాలయం.[7]

---

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 38
2,3. అదే పే. 67
4. అదే పే. 68
5. అదే పే. 69–70
6,7. అదే. పే. 70–71

రెండురోజుల తర్వాత ఆమెకు కలిగిన సిద్ధి గురించి ఎంతో అందంగా, ఉత్తేజకరంగా స్మరించుకొంటుంది. "రాత్రి నిశ్శబ్దంలో అంతటా నీ శాంతి పాలించింది. నా హృదయ నిశ్శబ్దంలో సదా నీ శాంతే. ఈ రెండు నిశ్శబ్దాలు కలిస్తే ఉదయించే నీ శాంతి ఎంతో శక్తి మంతమైనది. ఎటువంటి కష్టమూ దాన్నాపలేదు. మా దారిని కాపాడటంకోసం పడవపైనుండి చూసే వారందరి గూర్చి నేను ఆలోచించాను. అందుకు కృతజ్ఞతగా నీ శాంతి ఉదయించాలనీ, హృదయాలలో నివసించాలనీ నేను సంకల్పించాను, తర్వాత ఆత్మవిశ్వాసంతో, బాధ్యతారహితంగా అచైతన్యపు నిద్రలో మగ్గే వారి గురించి వారి కష్టాల పట్ల బాధతో, వారి గుప్తవేదన పట్ల సానుభూతితో (మేల్కొన్నప్పుడు వారిలోనే ఇది కల్గుతుంది) ఆలోచించాను. వారి హృదయాల్లో నీ శాంతి వసించాలనీ, అజ్ఞానాంధకారాన్ని పోగొట్టే ఆధ్యాత్మిక జీవన జ్యోతి వారిలో ఉదయించాలని నేను సంకల్పించాను. ఈ అపార సంసార సాగరంలో కనిపించే, కనిపించని ప్రాణులందరి గురించీ నేను ఆలోచించాను. వారిపై నీ శాంతి విస్తరించాలని సంకల్పించాను. ఎంతో దూరంలో మేము వదిలినా వారి ప్రేమ మాతోనే ఉన్న వారి గురించి ఆలోచించాను. వారికీ నీ చైతన్యవంతమైన శాశ్వత శాంతి వారి గ్రహణ సామర్థ్యాని కనుగుణంగా కలగాలని సంకల్పించాను. పిల్లకాయ చేష్టలతో అహంభావం, అజ్ఞానాల కోసం పోటీపడుతూ అవిశ్రాంతంగా ఉండేవారి గురించి వారికోసం వెళుతూ నేనాలో చించాను. ఎంతో భక్తితో, ప్రేరణతో నీ దివ్యశాంతి వారికి కలగాలని సంకల్పించాను. ఆ తర్వాత నాకు తెలిసిన వారందరి గురించీ, తెలియని వారందరి గురించీ, నడుస్తున్న జీవనం గురించీ, స్వరూపం మారిన దాన్ని గురించీ, ఇంకా రూపమే సంతరించుకోని దాన్ని గురించీ, నేనాలోచించలేని దాన్ని గురించీ, నాకు జ్ఞాపకం ఉన్నవాటి గురించీ, మరచిపోయినవాటి గురించీ ఆలోచించి వారికోసం గుడ్డి ఆరాధనతో నీ శాంతి కలగాలని ప్రార్థించాను."[1]

శాంతి. . .శాంతి. . .శాంతి. . . రహస్యమైన ఈ జ్వలన శబ్దాన్ని గోముగా, మంత్రం వలె పదేపదే వల్లె వేస్తున్నాం. "పాక్షికమైన శాంతి కడుబీదశాంతి" అన్నారు హాప్కిన్స్. కాబట్టి కేవలం విశ్వశాంతి మాత్రమే భూమికి వారసత్వంగా లభించిన చెడు, అసంపూర్ణత, బాధలకు సంబంధించిన రాక్షస సమస్యను అర్థం చేసుకొని పరిష్కరించగల్గుతుంది. "దివ్యజ్ఞాన సహచారిణి" శ్రీమాత ఏదో ఒకరోజు శాంతి వస్తుందని, విచ్ఛిన్నకర శక్తులపై విజయం సాధిస్తుందని సంకల్పిస్తుంది.

---

1 ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 71-73

"నిశ్శబ్దమైన, పవిత్రమైన రాత్రులు" గడుస్తున్నాయి. ఆనంద భావన అట్లాగే నిలిచింది. అనామకమైన శక్తి భావనపైనే ఆమె పోషణ. అనంతశక్తి ఆమెను అవరించినట్లు, ఆమె ప్రతి కదలికకూ నూతన ప్రకాశం ఇచ్చినట్లు అనిపిస్తుంది. ఒక నిశ్శబ్దమైన పాటవలె, గుడ్డి ఆరాధన వలె, స్థిరమైన జ్వాలవలె ఆమె; అయినా శ్రీమాత ఆకాంక్ష 'ఆయన'వైపు ఎగసి, ఆ దివ్యప్రేమను దింపి తన హృదయాన్ని ప్రకాశింప చేసుకుంటుంది. ఆయన నిజంగా ఒక అద్భుతమైన మంత్రగాడు "అన్నిటినీ మారుస్తాడు. అసహ్యం నుండి అందాన్ని తీస్తాడు. చీకటి నుండి వెలుగును, బురద నుండి స్వచ్ఛమైన నీటిని, అజ్ఞానం నుండి జ్ఞానాన్ని, అహంకారం నుండి దయను వెలికి తీస్తాడు."[1] శ్రీమాత ఈ అద్భుతకర్తకు సంతోషంగా స్వాధీనమై ఆ దివ్య పరివర్తనకు సంబంధించిన సూక్ష్మ సాధనాలను వాడటం ఎట్లాగో తెలుసుకుంది.

ఈ "మహత్తర శాస్త్రం" ముందు ఆధునిక విజ్ఞానశాస్త్ర అద్భుతాలు అత్యల్పం. నీతో సమాగమం, నీతో అంతరంగిక రహస్యాలు పంచుకోవడం, నీలోనే నివసించడం, నీవే ఐపోవడం – ఇవే ఆ మహత్తర శాస్త్ర అద్భుతాలు. నీ సర్వశక్తిమయత్వాన్ని ప్రతిబింబించే మనిషి కప్పుడు ఏదీ కాదసాధ్యం"[2] దైవంతో అట్లా పూర్తిగా ఐక్యం కావడం సులభం కాదు. అది సుదీర్ఘమైన ప్రయాణం. "భారతదేశానికి నా ప్రయాణంలో నేనాశించిన వాటిల్లో ఇదొకటి" అంటుంది శ్రీమాత.[3]

శ్రీమాత గమ్యం ఫ్రెంచ్ ఇండియాలోని పాండిచ్చేరి. పాల్ రిచర్డ్‌తో కలిసి 29 మార్చ్ 1914న ఆమె అక్కడికి చేరుకుంది. తన ప్రయాణమంతా ఆమె ఆ భగవంతుని 'దివ్యమైన జోక్యాన్ని" అనుభవించింది. ఆయన శాసనం అంతటా అభివ్యక్తిని పొందటం ఆమె చూచింది. ఆ శాసన అభివ్యక్తి అప్రయత్నంగా సహజంగా జరగటానికి, ఆ శాసనంతో ఒకటవటానికి ఆమె ప్రయత్నించింది. ఇక్కడ పాండిచ్చేరిలో ఆమెకు ఎన్ని నూతనావకాశాలు దాగి ఉన్నాయి? ఎన్ని నూతన లోకాలు ఆమె ముందు తెరచు కొన్నాయి? ఆయన మహోన్నత అస్తిత్వపు పూర్ణ చైతన్యంతో అచంచల దర్శనం, విశ్వాసంతో శ్రీమాత భవిష్యోన్ముఖురాలైంది.

ౚ

పాండిచ్చేరి చేరిన తర్వాత 30 మార్చ్ 1914వ తేదీన శ్రీమాత ఇలా వ్రాస్తుంది.

---

1 ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 80

2 అదే పే. 7

3 అదే పే. 85

గుర్తించారు. ఏ ఆధునిక విశ్వామిత్రుడు కూడా తన యోగమంత్రదండం ఝళిపించి నూతన ప్రపంచ సృష్టికి దుస్సాహసం చేయడు. శ్రీ అరవిందుల అచంచల మహాయోగ సాధనాలక్ష్యం సదా కూడా స్వయం సమతౌల్యం కల్గిన శక్తిమంతమైన మరో ప్రపంచం, కొత్త స్వర్గం, కొత్తభూమి. అట్టి ప్రపంచం తొందరలో సృష్టించసాధ్యం కాదు. లేదా ఎవరి ఆదేశంపైనో రాదు. ఆ మార్గం సుదీర్ఘం, విధానం కష్టతరం. అయితే మార్గం చివరలో విధి లిఖితమైన గమ్యం ఉంటుంది. ఆధ్యాత్మిక కాముకుడికి ఇది చాలు.

శ్రీమాత కూడా తాను కొత్తగా కనుగొన్న శాంతిని అంతులేని సంతోషంతో ఇట్లా గుర్తించింది. "నాలోపలి ప్రణాళికలన్నీ పనికిరాని కలవలె కరిగిపోయాయి., ఒక నూతనాధ్యాయం ప్రారంభమైంది".[2] రెండు రోజుల తర్వాత ఇట్లా రాస్తుంది. "ఒకప్పుడు ఫలితం అనుకొన్నది ఇప్పుడు కేవలం సన్నాహంగానే అనిపిస్తుంది."[3] సూర్యాస్తమయం – మళ్ళీ సూర్యోదయం. నా ప్రారంభంలోనే అంతం ఉంది; అంతంలోనే ప్రారంభం. గతం చావలేదు. కొత్తరూపాన్ని సంతరించు కొంటుంది. "మనముందు తెరుచుకోబోయే కొత్త శకం విస్తరణశకం కేంద్రీకరణశకం కాదు."[4] నిస్సందేహంగా మానవుని దైవీకరణ, ప్రకృతి రూపాంతరీకరణ – అదే ప్రముఖ ధ్యేయం. బాహ్యప్రపంచంవైపు మళ్లే ముందు మొదట ఆమె తనలోపలి శక్తిని పరిపూర్ణం గావించుకోవాలె. పరమాత్మకు పూర్తిగా ఆత్మసమర్పణ కావడమే చలనము – చర్య, అవరోహణ – సారము ఏకం కావటానికి సాధనం. చివరి మునకలో సంపూర్ణ ఆత్మ సమర్పణ సాధిస్తాం. అప్పుడన్ని అడ్డంకులూ మాయమౌతాయి. చివరి ఆనకట్ట ఫళఫళమంటూ పలిగి కొట్టుకపోతుంది. అప్పుడానందం మాత్రమే ఉంటుంది.

"నాకే అవధులూ లేవనిపిస్తుంది. శరీరానికి సంబంధించిన అనుభవం లేదు. ఇంద్రియగ్రహణం లేదు. అనుభూతి, ఆలోచనలు లేవు. ప్రేమ, అలవికాని పరమానందం నిండిన ఒక స్వచ్ఛమైన, నిర్మలమైన అంతులేని ప్రశాంతత మాత్రమే ఉంది. అదొక్కటే నేననిపిస్తున్నది. . ."[5]

ఇది సియెనాకు చెందిన సెయింట్ కాథరీన్ ఏకత్వస్థితి వర్ణనను గుర్తు చేస్తుంది. "శరీరం తన స్పందనను కోల్పోతుంది. చూసే కళ్లు చూడవు. వినే చెవులు వినవు. నాలుక మాట్లాడదు. . ." అగ్నిలో మైనంవలె, ప్రవాహంలో మంచువలె, గాలిలో

---

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 89
2. అదే పే. 90
3. అదే పే. 89

4,5. అదే పే. 95

కలిసిపోయిన సువాసన వలె వేరువేరు అస్తిత్వం నశిస్తుంది. విరాట్‌శక్తి మాత్రమే ఉంటుంది. ఈ పరివర్తన సంపూర్ణమైనది, చివరిది.

"నువ్వు నా జీవితాన్ని తీసుకొని, నీదిగా చేసుకొన్నావు; నా సంకల్పాన్ని తీసుకొని నీ సంకల్పంతో కలిపావు; నా ప్రేమను గైకొని నీ ప్రేమతో ఒక్కటి చేసావు. నా ఆలోచనను తీసుకొని నీ పరమ చైతన్యాన్ని ప్రసాదించావు.[1]

ఈ పరిపూర్ణ సంశయ రాహిత్యపు బలంతో, శాంతియుతమైన ప్రశాంతతతో ఈ బాధల నివారణకు, ప్రపంచాన్ని అంతిమంగా దైవమయం చేయడానికి శ్రీమాత మరొకమారు అంకింతమౌతుంది. "ఓ భగవంతుడా! నన్ను నీకే అర్పించుకొంటున్నాను. ఈ నీ సాధనాన్ని ఎట్లా ఉపయోగించుకోవాలో, వృద్ధి చేయాలో నీకే బాగా తెలుసు."[2]

౧౫

మే 1914 మొదట్లో శ్రీమాత ఆరోగ్యం క్షీణించింది. కొన్ని రోజులు నా శారీరక శక్తులన్నీ నాకు సహకరించలేదు."[3] "నా ఆధ్యాత్మిక శక్తి సన్నగిల్లింది, నా సర్వశక్తిమయ అద్వైత దర్శనం మసక బారిందనటానికి" ఇదొక సూచనగా ఆమె భావించింది.[4] ఈ ధోరణి ఆమె 'సంభాషణల్లో' ఒకచోట విశదమౌతుంది.

"యోగం ఎక్కడ ప్రారంభమౌతుంది? ఎక్కడ అంతమౌతుంది? నీ జీవితమంతా యోగం కాదా? జబ్బుపడే అవకాశం నీ శరీరంలో, శరీరం చుట్టూ ఎప్పుడూ ఉంటుంది. నీ లోపలా నీ చుట్టూ ప్రతి వ్యాధికారక సూక్ష్మక్రిములు చుట్టుముట్టే ఉన్నాయి. ఏండ్ల తరబడి లేనివ్యాధి ఒకేసారి నీకెలా సంక్రమిస్తున్నది? నీలో "జీవశక్తి క్షీణించటం" వల్ల అంటావు. కాని ఈ 'క్షీణత' ఎక్కడనుండి వస్తున్నది? మనలోని జీవిలో అసంతులిత స్థితి వల్ల దైవీశక్తులను గ్రహించలేకపోవడం వల్ల వస్తుంది. నీ ప్రాణాధారమైన శక్తి, కాంతుల నుండి నువ్వు దూరమైనప్పుడు ఈ క్షీణత కల్గుతుంది. దీన్నే వైద్య పరిభాషలో వ్యాధులకు "సానుకూల వాతావరణం' అంటున్నాం. ఈ పరిస్థితి వల్ల మరేదో లాభపడుతున్నది. సంశయాత్మ, విచారం, అధైర్యం, స్వార్థం – ఇవన్నీ దివ్యశక్తి, కాంతులనుండి నిన్ను దూరం చేస్తున్నాయి. రోగాల బారినపడే అవకాశం కల్పిస్తున్నది."[5]

---

1 ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 95

2 అదే పే. 102

3,4 అదే పే. 105

5 వర్డ్స్ ఆఫ్ ది మదర్ (1946), పే. 117–118

శ్రీమాత ఎప్పుడూ మార్పులేని, రోగ నిర్ముక్తమైన అనంతమాత. మామూలు సాధారణ పరిభాషలో చెప్పే సుఖదుఃఖాలు, స్వస్థత–అస్వస్థతలు, విశ్వాసం–సంశయాలకు ఆమె అతీతం. కాని ఆమె మానవ మాత్రురాలు కూడా. దుఃఖజీవియైన మానవునికి అవిభాజ్యమైన సహచారిణి. అన్ని సుఖదుఃఖాలకు భాగస్వామిని. అందుకే ఆమె ప్రార్థనలూ, ధ్యానాలు ఒక్కోసారి ఒక్కోతీరు ఉంటాయి. ఒకసారి అవి సాఫల్య సంకీర్తనలు మరోసారి అంధకారంలో మగ్గుతున్న మానవుల వైఫల్యాలు, బాధల వ్యక్తీకరణలు. మే 12, 1914న మరో ముఖ్యమైన అనుభవాన్ని శ్రీమాత వ్యక్తపరిచింది.

"ఈ ఉదయం ఒక్కొక్క అనుభవపు లోతులను త్వరత్వరగా స్పృశిస్తూ మరోసారి నా చైతన్యాన్ని నీ చైతన్యంతో ఒకటి చేయగలిగాను. నీలో తప్ప ఏ ఇతర సాధనంలో జీవించకుండా ఉండగలిగాను. నిజానికి నీ వొక్కడివే జీవించే వాడివి, కాని తక్షణమే నీ సంకల్పం నా చైతన్యాన్ని బాహిరంగా సాధించాల్సిన కార్యం వైపు మళ్ళించింది. "నా కవసరమైన సాధనంగా నువ్వుండు" అన్నావు నాతో. నీతో ఐక్యాన్ని త్యజించటం, ఇదే చివరిది కదా!"[1]

ఈ మలిన భూమికి బోధిసత్వుడుగా తిరిగివచ్చి తోటి మానవుల ఆత్మలను రక్షించటం కోసం బుద్ధుడు నిర్వాణాన్ని వదలుకోలేదా? జీవోద్ధారకుడైన బుద్ధుడివలె శ్రీమాత కూడా తన అంతిమ మహాత్యాగం చేసి, "అసంపూర్ణంగా, సృష్టించబడిన జీవునివైపు సంపూర్ణమైన ఈశ్వర చైతన్యం గమనించడాన్నీ, అనంతమైన పరమాత్మ సంకుచిత కాల విస్తీర్ణ పరిధుల్లో స్వచ్ఛందంగా సాక్షాత్కరించడాన్నీ" విశదపరచింది.[2] శ్రీమాత కూడా తన అవధులను పరిమితం చేసుకొని "నీ అద్వైతానికీ, వ్యక్తప్రపంచానికీ మధ్య విహరిస్తూ" ఆ రెంటి మధ్య మరింత సాన్నిహిత్యాన్ని సాధిస్తూ పరమాత్మ అనంతత్వాన్ని దృశ్యమాన ప్రపంచానికి తెస్తూ, ఆ పరమాత్మ దివ్య కారణాలను గ్రహించడానికి వీలుగా ఈ ప్రపంచాన్ని సముద్ధరించ గల్గుతుంది. కోరిన త్యాగాన్ని ఆమె వెంటనే అంగీక రించడానికి కారణం "ఏదో ఒకరోజు నువ్వు నా అధిపతివి అవుతావు. కాని ప్రస్తుతానికి ఈ ప్రపంచంవైపు దృష్టి మళ్లించు" అన్న భగవంతుని ప్రేమాస్పదమైన హామీ ఆమెకు లభించడమే.[3]

ఇక సంశయానికీ, ఆందోళనకు గానీ సాధ్య సాధనాల గురించిన సందేహాలకు గానీ తావులేదు. తదనుగుణంగా మే 16, 1914న శ్రీమాత ఇట్లా లిఖించింది.

---

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 108
2. అండర్‌హిల్, మాన్ అండ్ సూపర్ నాచురల్ పే. 143
3. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్ పే. 10

"ప్రస్తుత వ్యక్తిత్వానికి (జీవితానికి) సంబంధించినంత వరకూ నా ధ్యేయం నిన్ను పొందడం కాదని నాకు విశదమౌతున్నది. ఇది చాలాకాలంగా నిరూపించబడిన సత్యం. అందుకే నువ్వెప్పుడూ నాతో ఇట్లా చెప్తున్నట్లు అనిపిస్తుంది. "నాతో సమాగమానికి సంబంధించిన పరమానందకర ఆలోచనలో పరవశించకు. భూమిపై నిర్దేశిత కర్తవ్యాన్ని నెరవేర్చు. . . అందరికీ మనం బోధించేది మొదలు పరమాత్మతో ఐక్యం, తర్వాత కర్మ; కాని నీతో ఐక్యమైన వారి జీవితంలో ప్రతిక్షణం వారిద్వారా నీ సంకల్పానికి సంపూర్ణ అభివ్యక్తి కావాలె."[1]

మరోమాసం కాకముందే శ్రీమాత మళ్లీ ఇట్లా వ్రాసింది; "మొదట మనం జ్ఞానాన్ని జయించాలె. అంటే నిన్ను తెలుసుకోవడం, నీతో ఐక్యం కావడం ఎట్లానో నేర్చుకోవాలె. ఈ లక్ష్య సాధనకోసం ఏ సాధనమైనా మంచిదే, ఆచరణయోగ్యమే. అవును నిన్ను తెలుసుకోవడమే సర్వప్రథమం. కాని ఒకసారి అది సాధించామంటే మిగతా పని అంతా నీ అవతరణకు, అభివ్యక్తికి సంబంధించినదే. ఇందులో జోక్యం చేసుకొనేదల్లా ఆ అభివ్యక్తికి సంబంధించిన నాణ్యత, ఒత్తిడి, సంక్లిష్టత, సంపూర్ణత."[2]

మానవుని దైవీకరణ, దృశ్యమాన ప్రపంచ పరివర్తన నిజంగా ఒక బృహత్తర కార్యక్రమమే. ఆ ఆలోచనే ఆమె మనసంతా ఉత్తేజాన్ని కల్గిస్తుంది. ఈ దివ్యకార్యానికి జీవితాన్ని అంకితం చేసే ఆమె శపథం మరోసారి వ్యక్తమౌతుంది. శాశ్వతత్వపు ఛాయలను సంతరించుకొంటుంది.

"మనం చేయాల్సింది నిజంగా ఒక సృష్టికార్యం. ఇప్పటివరకు అజ్ఞాతంగా ఉన్న ఈ శక్తి విశ్వరూపప్రదర్శన ఈ భూమిపై జరగడానికి కొత్త కార్యక్రమాలను, జీవన విధానాలను సృష్టించడం. ఓ పరమాత్మా ! ఈ సముజ్జీవన కార్యం కోసమే నన్ను నేను అంకితం చేసుకుంటున్నాను. నువ్వొక వాగ్దానం చేసావు. ఈ వాగ్దానాన్ని నెరవేర్చగలిగే వారినీ, శక్తినీ ఈ లోకాల్లోకి పంపుతానని ఇది జరగాల్సి ఉంది కాబట్టి జరిగి తీరుతుంది."[3]

౧౬

వ్యక్తిగా, విశ్వజనీనంగా, విశ్వాతీతంగా శ్రీమాత ఒక్కొక్కప్పుడు ఒక రూపాన్ని ధరిస్తుంది. ఈ 'ప్రార్థనలూ, ధ్యానాలు' కూడా మనకట్లాగే ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క

---

1 ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 112-113

2 అదే పే. 133-134

3 అదే పే. 135

స్థితినుండి వస్తాయి. శ్రీమాత ఎట్లాగో విజయవంతంగా ఎల్లప్పుడూ ఈ మూడు రూపాల్లో ఉంటుంది. అయినా ఆమె ఆత్మ ఉచ్ఛ్వాస నిశ్వాసాలూ, ఆమెలో ఉంటూ, ఆమెగా ఉన్న పరమాత్మ అన్నీ కలిసి ఒక స్వంత సమష్టితనం ఏకత్వాలను కూడా కలిగి ఉంటాయి. ఆమె ధ్యానం చేస్తే, పరోక్షంగా మానవులంతా ధ్యానం చేస్తారు. ఆమె ప్రార్థించేప్పుడు మానవులందరి కోసం, వారి రక్షణ కోసం ప్రార్థిస్తుంది. ఆమె స్వప్నాలూ, దృశ్యాలు, జాగ్రుతమైన ఆమె ఆలోచనలు, ప్రణాళికలు అన్నీ సంపూర్ణ అస్తిత్వం, జ్ఞానం, దివ్యత్వాలను కోరుకునే మానవుని అవసరాలను, ఆకాంక్షలను, ఆశయాలను ప్రతిబింబిస్తాయి. మే 31, 1914 న పరివర్తన చెందింపజేసే తన విశిష్ట అనుభవాన్ని శ్రీమాత ఇలా వర్ణిస్తుంది.

"ప్రశాంత సంధ్యలోని ఆంతర నిశ్శబ్దంలోకి సూర్యుడస్తమించిన వేళ ఓ పరమాత్మా ! మూగభక్తితో, సంపూర్ణ శరణాగతితో నా ఆత్మ నీ ముందు సాగిలబడింది. అప్పుడు నేనే ఈ భూమాతను. ఈ భూమాతా నీ ముందు మోకరిల్లింది. నీ దివ్యప్రకాశ కటాక్షం కోసం నీ ప్రేమకాంతుల కోసం ప్రార్థించింది. ఆ ప్రణామం రాత్రి నిశ్శబ్దంలో ఎంతో ఆతృతతో ఓపికగా నీ ప్రకాశం కోసం నిరీక్షించింది. నీ దివ్యప్రేమగా ఈ ప్రపంచంలో పని చేయడం ఒక మాధుర్యం. అయితే నీ అనంతప్రేమ కోసం అవధులు లేని ఆకాంక్షగా మారటం మరింత మాధుర్యం. దాతగా, గ్రహీతగా, రూపాంతర కర్తగా కర్మగా, దుఃఖాంధకారంగా' సర్వశక్తిమయ జ్యోతిగా ఇట్లా ఒక క్రమంలో లేదా ఒకేసారిగా మారగలగటం, ఈ ద్వైతంలో నీ పరమ రహస్యాన్ని కనుగొనటం – ఇది నీ పరమ సంకల్పాన్ని వ్యక్తీకరించటం, నెరవేర్చటం కాదా?"[1]

ఈ దృక్కోణంలో శ్రీమాత ఆకలిగొన్న అస్పష్టమైన దృశ్యమాన ప్రపంచానికీ నిర్మలమై, పరమానంద భరితమై జేగీయమానమైన సత్యానికీ మధ్య వారధి, వాది అనవచ్చు. శ్రీమాత ఈ ప్రపంచంతో మమేకమై, మోకరిల్లి ప్రార్థన చేస్తే మన ప్రస్తుత సౌఖ్యం కోసం, అంతిమమోక్షం కోసం దివినుండి భువికి అమృతమయ సూచనలు, వరాలు, ఆశీస్సులు దిగిరాకపోవు.

అవి ఏవైనా కానీ
మన అహస్సుకు చిరు దివ్వెలు
మన దృశ్యానికంతటికీ మహాకాంతులు;
మనను సముద్ధరించేవి, ప్రేమతో రక్షించేవి

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 127

అనంత నిశ్శబ్దంలో మన కల్లోల సంవత్సరాలను
క్షణాలుగా మార్చే శక్తి గలవి.
ఎప్పుడూ నశించని
జాగృత సత్యాలు

జూన్ 9, 1914న శ్రీమాత తన మాధ్యమం ద్వారా అందిన దైవాశీస్సులను ఈ విధంగా ప్రపంచానికందజేస్తుంది.

ఒక మహోత్తుంగ ప్రేమతరంగం అవరోహించింది.
చొచ్చుకొని పోయింది అన్నిటా
పృథ్వి అంతటా శాంతి, శాంతి,
విజయం, సమృద్ధి, అద్భుతం

విషాదంలో, అజ్ఞానంలో మ్రగ్గుతున్న ఓ ప్రియ బాలలారా ! ఓ ప్రతిఘటించే, హింసాత్మక ప్రకృతీ ! మీ హృదయకవాటాలను తెరవండి ! మీ శక్తిని శాంతింపచేయండి, ప్రేమ సర్వశక్తిమయత్వం వస్తున్నది మీకు. స్వచ్ఛమైన కాంతి ప్రకాశం మీలోకి చొచ్చుకుంటున్నది. ఈ మానవ పృథ్వీ సమయం అన్నిటికంటే అందమైనది. ప్రతివారూ, అందరూ తెలుసుకోవాలి దీన్ని. మీకు ప్రసాదించిన సమృద్ధిని ఆనందించండి.

ఓ విప్లవ హృదయాల్లారా ! వ్యాకులిత లలాటాల్లారా ! మూర్ఖపు అస్పష్టతా, అజ్ఞానపు దుష్ట సంకల్పమా ! మీ ఆందోళనను ఉపశమింపచేసుకోండి. పారద్రోలండి. వచ్చేదంతా 'నేనిక్కడే ఉన్నాను' అన్న కొత్త శబ్దపు ప్రకాశమే".[1]

శ్రీమాత దివ్యదృష్టి కలిగిన సహచారిణి, శక్తిమంతమైన మాధ్యమం. అదే సమయంలో ఆమె శ్రీమాత, కేవలం తల్లి కూడా.

అంతేకాదు; ఈ రెంటితో పాటు ఆమె సృష్టికర్త కూడా. ఆమెకాదు ప్రతి మనిషి, ఎంత చిన్నవాడైనా, అనామకుడైనా, ఈ మూడు కాగల శక్తి సంపన్నుడు. శ్రీమాత మాటల్లో "మనిషంటే దాదాపుగా ఒక అద్దం వలె ఉండాలె. ఒకేసారి అది స్తబ్దంగా స్వచ్ఛంగా ఉండగలగాలె, ఆంతర, బాహిర వస్తువుల వైపు సృష్టి కార్యకారణాలవైపు అభిముఖమై ఉండాలె. తద్వారా నిర్దేశిత సంకల్పానికి పరిణామాల నందజేయగలగాలె దానితోపాటు ఆ సంకల్ప సిద్ధి కాగలగాలె. ఒకవైపు గ్రహించేదిగా మరోవైపు సిద్ధించేదిగా ఉండగలిగే రెండు అభిప్రాయాలను కల్పగలగడం చాలా కష్టసాధ్యం. ఓ భగవంతుడా!

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 131-132

నీ దృష్టి దీనిపైనే. అందువల్ల నీవే దీన్ని సిద్ధించే మార్గాల నందిస్తావనటంలో సందేహం లేదు."[1] క్షీణింపజేసే ఈ గుడ్డి అసమర్థత నుండి మనం జాగృతమైనప్పుడు, బానిసతనం లేకుండానే కష్టించగల్గుతాం. వ్యక్తిత్వపు బందిఖానాలో పడకుండా ప్రయోజనకర వ్యక్తిత్వాన్ని సాధించగల్గుతాం. క్రమంగా మానవసహజమైన దురహంకారమనే తప్పిదం నుండి బయటపడం. "ఈ తప్పిదం లక్షలాది ఉదాహరణలు కల్గిన ప్రాపంచిక తప్పిదం".[2] అప్పుడే ఈ సర్వ వ్యాప్తమైన కలుషితం నుండి వ్యక్తి విముక్తుడౌతాడు. ఇక ప్రకృతిని పరివర్తింపజేసే సర్వశక్తిమయత్వం దిగివచ్చి నూతన సార్వభౌమత్వ ప్రకాశాన్ని సిద్ధింపజేసే శుభ తరుణంలో సర్వంతో ఏకమౌతాడు. ఈ ప్రకాశం కల కాదు. అది వస్తుంది, తప్పక వస్తుంది. పరమాత్మ, భక్తుడు ఇరువురు కూడా ప్రస్తుతం ఈ బృహత్తర రూపాంతరాన్ని పొందేందుకు నిబద్ధులై ఉన్నారు. పరమాత్మ భక్తుడినిలా ఉద్బోధిస్తాడు. "ఏది జరగాలో అది జరుగుతుంది. అవసరమైన సాధనాలు రూపొందుతాయి. ప్రశాంతంగా, విశ్వాసంతో ప్రయత్నించు."[3] భక్తుడిలా సమాధానమిస్తాడు. "నన్ను మినహాయించకు. నీ సర్వశక్తిమయ సార్వభౌమాధికారంతో వర్తించు. నాలో సంపూర్ణ రూపాంతర సంకల్పాన్ని నీవు కల్పించావు."[4]

జూలై 21, 1914న శ్రీమాత ఒక దివ్య ఏకత్వ అనుభవాన్ని పొందింది. వర్డ్స్‌వర్త్ తన "టింటర్న్ అబీ" కావ్యంలో పొందుపరిచిన అనుభవం వంటిదే ఇది.

ఆ గంభీరమైన, దివ్య అనుభూతిలో
ఈ మానవ శరీరంలోని ఉచ్ఛ్వాస నిశ్వాసాలూ,
రక్త ప్రసరణలు కూడా దాదాపు ఆగిపోయిన వేళ
సుషుప్తిలో శరీరం సజీవమైన ఆత్మగా మారింది.

లేదా డాంటే తన "పారడైజో"లో చెప్పినట్లు

"హఠాత్తుగా మెరసిన విద్యుల్లత తాకిడికి కంటిశక్తి దెబ్బతిని ప్రస్ఫుటమైన వస్తువులను కూడా చూడలేకుండా చేసినట్లు, నా చుట్టూ ఒక సజీవకాంతి ప్రకాశించింది. ఆ వెలుగుల జిలుగులో నాకు ఏదీ కనపడలేదు."[5]

---

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 140
2. అదే పే. 149
3. అదే పే. 151
4. అదే పే. 155
5. బుక్ ×××, ఆంగ్లానువాదం: ఫిలిప్ హెచ్. విక్‌స్టీడ్

"ఆ అనంత అద్వైత మెరుపులో భ్రమసి నా కనిపించింది ఒక మూగక్షణపు స్తబ్దత/పురా సముద్రంలో మునిగిన ఆర్గోనౌకపై పడి చచ్చిన శతాబ్దాల కంటే బరువైందని[1]

శ్రీమాత పొందిన పరమానందపు అనంతప్రకాశం అనిర్వచనీయమైనది అయినా ఆమె తగినంత ప్రశాంతంగా, స్వచ్ఛంగా సూచిస్తుంది.

"ఇక శరీరం కాని, స్పందన కానీ ఏ మాత్రం లేదు. శరీర మూలాధారం ఉన్నచోటినుండి ఒక వెలుగుస్తంభం ఉదయించి తల ఉండే ప్రాంతం వరకు ఒక నెలవంకలా శోభించింది. ఆ తర్వాత తలపై నుండి ఎంతో ఎత్తున పైకెగసి వివిధ రంగులతో ప్రకాశిస్తూ సూర్యునిలోకి చేరి అక్కడి నుండి తన సువర్ణకాంతి ధారలతో క్రిందికి దిగి భూమంతా ఆవరించింది.

అట్లా ఈ కాంతి స్తంభం వలయాకార సజీవ కాంతి పుంజమై, ప్రత్యేక తరంగాలను సృష్టిస్తూ తలపైన, తల ప్రాంతాలలో, గొంతు, హృదయం, నాభి, వెన్నెముక ప్రారంభంలో, ఇంకా అధోభాగంలో ఉన్న కేంద్రాలను ఒక్కొక్కటిని ఒక్కొక్క విధంగా జాగృతం చేస్తూ, చలనం కలిగిస్తూ మెల్లగా క్రిందికి దిగింది. మోకాళ్లపై పైకి, క్రిందికి వెళ్లే ప్రవాహాలు కలిసి, నిరంతర ధారగా మారి సజీవ కాంతిపుంజ వలయం జీవాన్నంతా ఆవహించింది.

తర్వాత చైతన్యం ప్రతి ప్రపంచంలో ఆగుతూ శరీరచైతన్యం తిరిగి వచ్చేవరకు ఒక్కొక్క మెట్టు దిగింది. నా జ్ఞాపకంలో శరీరం పునఃచైతన్యాన్ని పొందడం అన్నది 9వ దశ. ఈ క్షణంలో శరీరం ఇంకా బిగుసుకుపోయి అచలనంగానే ఉంది." [2]

తన అద్వైతానుభవాన్ని వివరిస్తూ "అప్పుడు నేను సర్వం మరిచిపోయాను. అన్నీ స్తంభించాయి. నేను లేను" అంటాడు సెయింట్ జాన్ ఆఫ్ ది క్రాస్. కాని శ్రీమాత సిద్ధి మనకు శ్రీ అరవిందుల సమాధి, నిరీక్షణ సమాధి, అవరోహణలను, జ్ఞానోదయం, సృజనాత్మక సంయోగాలను కలిపే మార్మిక స్థితుల పద్య వర్ణనలను జ్ఞప్తికి చేస్తాయి. శ్రీమాత అనుభూతిని మేధోపరంగా చెప్పగలిగితే, ఆరోహణ, అవరోహణ చలనాలు రెండూ కలిసి ఒక సమగ్ర సృజనాత్మక శక్తి, కాంతిగా ఏర్పడటం అనవచ్చు.

శ్రీమాత పరమాత్మ నుండి ప్రాణశక్తిని పొంది జీవిస్తున్నది, విశ్రమిస్తున్న దనటంలో సందేహం లేదు. అట్లా అని ఆమె జీవితానికి, ధ్యేయానికి సంబంధించిన

---

1. బుక్ xxx, ఆంగ్లానువాదం: కె.డి. సత్నా
2. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 160-161

"వ్యావహారిక" అంశాలను విస్మరించలేదు. రిచర్డ్‌తో కలిసి ఆమె శ్రీ అరవిందులతో చేతులు కలిపింది. వారి సంయుక్త సంపాదకత్వంలో ఆంగ్లంలో ఆర్య, ఫ్రెంచ్‌లో <u>రెవ్యూ డి గ్రాండ్ సింథీజ్</u> అనే తాత్త్విక పత్రికలు ప్రారంభమయ్యాయి. <u>ఆర్య</u> పత్రిక ప్రారంభ సంచిక కవర్‌పేజీపై ద్విముఖ ధ్యేయాన్ని ఇట్లా నిర్వచించారు.

1. జీవనానికి సంబంధించిన ఉన్నత సమస్యల క్రమబద్ధ అధ్యయనం.

2. ప్రాక్పశ్చిమ మత సంప్రదాయాల అన్వయంతో అపార జ్ఞాన సార సంగ్రహాన్ని రూపొందించటం. ఇందుకు అవలంబించే విధానం హేతుబద్ధమై ఉంటూనే పారలౌకికమైన వాస్తవవాదం ఈ వాదం బౌద్ధిక, శాస్త్రీయ విషయాలను తర్కానికతీతంగా స్ఫురించే మానసిక అనుభూతులతో కలిపే వాస్తవ వాదం."

ఫ్రెంచి పత్రిక పేరులోనే విషయం సులభగ్రాహ్యం. 'ఆర్య' పత్రిక పేరు కొంత సందేహస్పందంగా ఉన్నా అందులో ఒక మంత్రశక్తి, ధ్వని ఉంది. శ్రీ అరవిందులు దాన్ని ఇట్లా వివరించాడు. "ఆర్య అంటే ఒక ప్రయత్నం, ఉత్థానం అధిగమనం. ఆర్యుడు తనలోపలా, వెలుపలా మానవ ప్రగతికి ప్రతికూల అంశాలను జయించేవాడు. ఆత్మవిజయమే మొదటి ప్రాకృతిక ధర్మం. దాని ధ్యేయం ఆత్మ సంపూర్ణత కాబట్టే తను జయించే దాన్ని నశింపచేయడు. కాని మరింత ఉదాత్తంగా ఫలప్రదంగా తీర్చిదిద్దుతాడు. ఆర్యుడెప్పుడూ ఒక కార్మికుడు, యోద్ధ. . . తనలోపలా, బయటి ప్రపంచంలో సామ్రాజ్య స్థాపన కోసం పోరాడతాడు."[1] మనిషి మూలరూపంలో బలహీనమైన, పనికిరాని జీవికాదు. నిజంగా అతను మూడు లోకాలకు వారసుడు. తన విభాజనం నుండి విశ్వస్థాయికి చేరుకోగలడు. విశ్వాతీతంలోకి తప్పించుకోగలడు. ఆత్మ విజయం, ఆత్మ సంపూర్ణతలో తమ పాఠకులకు శిక్షణ కల్పించటమే ఆర్య, ఫ్రెంచి పత్రికల ధ్యేయం. అట్లా చేయడం ద్వారా ఈ మూడు లోకాల్లో వారు ఒకేసారి జీవించటమెట్లాగో నేర్చుకోవచ్చు. "నీచాన్ని ఉచ్చంగా ఉద్ధరించి, ఉచ్చాన్ని నీచంలోకి గ్రహించి" తద్వారా ముల్లోకాలకు ముల్లోకాలేకమైన బ్రహ్మకు సంబంధించిన ఆనందం, తేజస్సులతో ఆత్మలోని అన్ని భాగాలనూ ఐక్యం చేయగల్గుతారు[2]

ఆగస్ట్ 1914న ఆర్య మరియు రెవ్యూ డి గ్రాండ్ సింథీజ్ పత్రికల మొదటి సంచికలు వెలువడ్డాయి. మంచీ చెడులు, చీకటి వెలుగులు, అందం అనాకారం మధ్య

---

1 వ్యూస్ అండ్ రెవ్యూస్, పే. 9–15

2 అదే పే. 12

యుద్ధం ఎట్టకేలకు చిత్తశుద్ధితో ప్రారంభమైంది. ఈ యుద్ధం శ్రీ అరవిందుల దెంతో శ్రీమాతదీ అంతే. మానవజాతిభవిష్యత్తు కదెంతో కీలకమైనది.

౧౮

ఎవరికీ తెలియని పాండిచ్చేరిలో ఆర్య పత్రిక, యూరప్‌లో రక్తపోరాటం ఒకేసారి ప్రారంభమైనాయి. ఆ రక్త పోరాటం ప్రపంచ స్థాయికి త్వరలోనే విస్తరించింది. జూన్ 28, 1914న హాప్స్‌బర్గ్ రాజ్య వారసుడు, అతని భార్యలను ఇరవై ఏళ్ల సెర్బియన్ యువకుడు హత్య చేసాడు. 1914 జూలై నెల యూరప్ ఛాన్సలర్లకు తీరికలేని సమయం. యుద్ధమా? శాంతా? అన్నది ఆందోళనకర చర్చనీయాంశం. ఆశ సన్నగిల్లుతున్నది. జూలై 28న ఆస్ట్రియా సెర్బియాపై యుద్ధాన్ని ప్రకటించింది. ఆగస్ట్ 3న జర్మనీ ఫ్రాన్స్‌పై యుద్ధాన్ని ప్రకటించింది. ఆగస్ట్ 4న బ్రిటన్ జర్మనీపై యుద్ధాన్ని ప్రకటించింది. ప్రథమ ప్రపంచయుద్ధం మొదలైంది. జర్మనీ, ఆస్ట్రియా,రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్ అగ్రరాజ్యాలు ఇరుపక్షాలుగా మొదటినుండే పాల్గొన్నాయి.

నాగరిక ప్రపంచం చివరకు పరస్పర ఆత్మహనన సమితిగా మారనున్నదా? శ్రీమాత హృదయంలో నుండి ఈక్రింది వాక్యాలు చొచ్చుకొని వచ్చాయి.

"ఓ భగవంతుడా ! శాశ్వత ప్రభూ !

శక్తుల సంఘర్షణలో మానవులు బృహత్యాగానికి పాల్పడుతున్నారు. వారు తమ జీవితాలను రక్త పోరాటానికి సమర్పిస్తున్నారు.

ఇది వృథాకాకుండా చూడు ప్రభూ !"[1] రెండు రోజుల తర్వాత శ్రీమాత మళ్లీ ఇట్లా వ్రాస్తుంది: "ఈ ప్రపంచాని కిదొక గడ్డుకాలం"[2] ఆగస్టు 8న ఇట్లా రాస్తుంది: "రాక్షస శక్తులు సుడిగాలిలా ఈ భూమిని చుట్టుముట్టాయి. అవి చీకటిగా, హింసాత్మకంగా, శక్తిమంతంగా, గుడ్డిగా చెలరేగుతున్నాయి." "ఘర్షించే ఈ చీకటి ప్రపంచం" నుండి శ్రీమాత బయటపడలేకపోతున్నది. ఆగస్ట్ 21న ఆమె హృదయంలో మరో ప్రార్థన ఉప్పొంగింది. "ఓ ప్రభూ ! ప్రభూ ! ప్రపంచమంతా కొట్టుమిట్టాడుతున్నది. బాధతో మూల్గుతున్నది. ఆవేదన చెందుతున్నది. నిష్ప్రయోజనంగానే ఈ బాధ వచ్చి పడలేదు. ఈ అగాధపు అంధకారం నుండి గాలి వెలుతురులను ప్రసాదించమని సమగ్ర లౌకిక జీవి మొత్తుకుంటున్నాడు. ఉక్కిరి బిక్కిరవుతున్నాడు. అతన్ని ఆదుకోవా?"[3]

---

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 167
2. అదే పే. 169
3. అదే పే. 117

సగం వేదన, సగం ప్రార్థన రూపంలో ఇదే ఆర్ద్రమైన రోదన ఆమె నుండి పదే పదే వినిపిస్తున్నది. ఈ రోదన అనంత కష్టాల్లో మునిగిపోతూ పరీక్షా కాలాన్ని ఎదుర్కొంటున్న మానవాళి రోదన.

"ఓ ప్రభూ ! ఈ భూమి మూల్గుతున్నది. కష్టపడుతున్నది. అయోమయానికి నిలయమైంది. ఈ దట్టమైన చీకటిని నీ వాక్కడివి కూడా తొలగించలేవు. నీ కార్యం నెరవేరాలంటే ఇక్కడకు రా ! అవతరించు."[1]

ఈ లోకాన్ని చీకటి దట్టంగా, హింసాత్మకంగా, విజయవంతంగా ఆవరించింది. ఈ భౌతిక ప్రపంచంలో అంతా దుఃఖం, భయం, వినాశమే. నీ ప్రేమ ప్రకాశ జ్యోతులు ఆక్రందన తెరతో కప్పబడి నలుపెక్కాయి."[2]

మరోవైపు ఏదో ఆశ, ఓదార్పు, ప్రోత్సాహపు సన్నని ధ్వని కూడా మొదట బలహీనంగా త్వరలోనే, విశ్వాసపు ధీమాతో తుదివిజయపు నమ్మకంతో వినిపించింది. యుద్ధపు చివరినెల ఆగస్టు 31వ తేదీన శ్రీమాత ఇట్లా వ్రాస్తుంది. "ఈ బలమైన అస్తవ్యస్తత, ఘోర వినాశంతో ఒక కొత్త బీజావాపనకు అవసరమైన ప్రణాళిక కనిపిస్తుంది. అది అద్భుతమైన ధాన్య రూపంలో పెరిగి ప్రపంచానికి ఒక కొత్త జాతిపంటను అందిస్తుంది."[3] ఐదు రోజుల తర్వాత ఏకం కమ్మనే పిలుపు దివి నుండి వినిపిస్తుంది. "అపాయం వైపు అభిముఖులై ఎదుర్కొనండి. అపాయాన్ని నేరుగా చూడండి. శక్తి ముందు అది అదృశ్యమౌతుంది."[4] "యుద్ధం వెనక అంతరార్థం కూడా ఉండొచ్చు. నైతిక స్తబ్దత, అంధ వినాశాన్ని గెలిచే సాధనం కావొచ్చు. స్వర్గపథంలో పాపప్రక్షాళనా కేంద్రం కావొచ్చు. అందుకే భయపడాల్సిన పనిలేదు. పోరాడి ఎంతటి మూల్యం చెల్లించైనా గెలువాల్సిందే."[5]

క్రమంగా అయోమయం, నిరాశ, నిస్పృహల మబ్బులు తొలగిపోయి స్వచ్ఛమైన అవగాహన, స్థిరమైన జ్ఞానపు సూర్యుడు మెల్లగా ఉదయిస్తాడు. మానవుడు "శాశ్వతమై అవ్యక్తంగా ఉన్న పదార్థానికీ వ్యక్తమైన దానికీ వారధి కాదా? ఉండవలసిన దానికీ, ఉన్నదానికీ మధ్య మధ్యవర్తి కాదా?"[6] ప్రతివ్యక్తీ శూన్యంలో, మానవాతీత వాస్తవిక కాలంలో ఒక నూతనావిష్కారం కావాలె. కనబడే దృశ్యాల వెనుకనున్న వాస్తవికతను

1,2. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 180

3. అదే పే. 182-183

4. అదే పే 186

5. అదే పే. 187

6. అదే పే. 182

రూపొందించుకొన్న దృశ్యంగా మారే ప్రయత్నం చేయాలె. భౌతిక ప్రపంచపు సామ్య సంబంధాలను, భౌతిక జీవనపు ద్వంద్వాలు, వైరుధ్యాలలో మనిషి ఇరుక్కుపోయాడు. కాని ఆయన నిజానికి ఉన్నత "వాస్తవానికి" వారసుడు. అందుకే అతను సర్వ శక్తిమయమైన ఆధ్యాత్మిక ప్రపంచానికీ, స్వయం విభాజకమైన భౌతిక ప్రపంచానికి తగిన మధ్యవర్తి. శ్రీమాత ఒక అత్యున్నతమైన మధ్యవర్తి. ఆమె మాటల్లో మానవాళి దుఃఖాలు, ఆకాంక్షలు కనిపిస్తాయి. ఆమె ప్రార్థిస్తే, ప్రపంచమంతా ప్రార్థిస్తుంది. విన్నపంలోని వేడిమిని సంతరించుకొంటుంది.

"ఈ శోకతప్త భూమాతను దయాకరమైన నీ పటిష్ట బాహుబంధాల్లో ఇముడ్చుకో, నీ అనంత ప్రేమసాగరం నుండి పొంగిన కృపాస్రవంతిని ఆమె గర్భంలో నింపు. నేనే నీ దయాకర పటిష్ఠ బాహువును. నీ అనంత ప్రేమఒడిని నేనే. . .భూమిని బాహువులు అందుకొని దయార్ద్ర, శోకతప్త హృదయానికి సున్నితంగా హత్తుకుంటాయి. ఘర్షణలో నున్న ఈ పరమాణువునకు దైవానుగ్రహ చుంబనం లభిస్తుంది. అదే ఉపశమాన్ని కల్గించే శ్రీమాత చుంబనం."[1]

"ఓ పరమాత్మా ! వారి శోకతాపాలనే నా భౌతిక శరీరం అనుభవిస్తున్నది. ఎప్పుడీ అజ్ఞానం నశిస్తుంది? దుఃఖం అంతమౌతుంది? ఓ పరమాత్మా ! విశ్వంలోని ప్రతి మూలకం తన ఉనికి మూల సూత్రాన్ని తెలుసుకునేట్లు చేయి. నశింపచేసే బదులు, పరివర్తన చెందించు. నిన్ను కనబడకుండా చేసే గుడ్డి అహంకారపు పొరలను తొలగించు. నీ సంపూర్ణ స్వరూప జ్యోతిని సాక్షాత్కరించు".[2]

ఈ కాల తీరంలో పరస్పర సంబంధం కలిగిన మధ్యవర్తి, సహచారిణి, సృష్టికర్త అనే మూడు పాత్రలను మనం పోషించాలని విధి నిర్ణయం. వీటిక్రమమే పరిణామంలో ఉన్న మన ఐహిక జీవిత పురాణం. ఈ సృజనాత్మక పరిణామక్రమ సాహసంలో సామాన్య మానవాళి ఒక్కొక్కసారి అగోచరంగా, అసంపూర్ణంగా, మరికొన్ని సార్లు జాగృతితో సమర్థంగా పాల్గొంటుంది. కాని అదెప్పుడూ నిర్నిరోధంగా, అనివార్యంగా సాగుతుంది. అవగాహనను విశదపరచటం, సాధనాన్ని సంపూర్ణం చేయటం క్రమశిక్షణను పటిష్ఠపరచటం, సత్వర సిద్ధి పొందేట్టు చేయడం – ఇవే పూర్ణయోగ ప్రణాళిక.

---

1 ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 172

2 అదే పే. 202

"అన్ని భౌతిక రూపాల్లో వ్యవస్థీకృత ఆలోచనల్లో జీవంగా, ఈ ఆలోచనలోని వివిధ అంశాలను విస్తరించి, బోధించి, ద్విగుణీకృతం చేసి, ఏకత్రితం చేసే ప్రేమగా మారడం, తద్వారా వ్యక్త ప్రపంచంతో సంపూర్ణంగా తాదాత్మ్యం చెంది, దాని పరివర్తనల్లో తన శక్తినంతా ఉపయోగించి జోక్యం చేసుకోగల్గడం. మరోవైపు పరమాత్మను సంపూర్ణ శరణాగతితో సత్యాన్ని అందులోని శాశ్వత సంకల్పాన్ని తెలుసుకోవడం. ఈ తాదాత్మ్యం ద్వారా దివ్య సంకల్పానికి విశ్వసనీయ సేవకుడిగా, ప్రతినిధిగా రూపొందటం, ఈ మూలాధార సూత్ర ఐక్యతను ఆత్మపరిణామ ఐక్యంతో ఏకం చేయడం, ఆ సూత్ర సత్య ధర్మానికనుగుణంగా ఆత్మ పరిణామపు ప్రేమను, మనస్సును, జీవితాన్ని, మలిచి రూపుదిద్దటం. ఈ విధంగా జీవి పరమ సత్యానికి రూపొందించిన విశ్వానికి మధ్య చైతన్యవంతమైన మధ్యవర్తి ఔతాడు. ప్రకృతి యోగపు అస్థిర మాంద్య ప్రగతిని అద్దుకొని దివ్య యోగపు చురుకైన, గాఢమైన, స్థిర లక్షణాన్ని దానికందించగల్గుతాడు."[1]

పరిణామ క్రమానికి స్పష్టమైన దిశను నిర్దేశించి ప్రకృతినే వ్యవస్థీకరించి ప్రయాణప్రగతిని వేగిరపరచడమే మహా యోగిని-ద్రష్టల ధ్యేయం. వారిలో పరమాత్మ ఐహిక జీవనరూపం ధరిస్తాడు. వారు మనతో ఉంటూనే మన వెలుపలా ఉంటున్నందున ఐహిక ప్రకృతి పరమ ప్రకృతిగా మారే అద్భుత సృష్టి పరిణామ నాటకంలో తమవంతు పాత్రను పోషించగలుగుతారు.

శ్రీమాత అటువంటి యోగిని, ద్రష్ట, సృష్టి ప్రతినిధి కాబట్టే రెండు ప్రపంచాల ప్రభావాన్ని తెల్సుకోగల్గుతుంది. ఘర్షణ, అయోమయాల నుండి శాంతి సామరస్యాలను సంగ్రహించేందుకు కృషి చేస్తుంది. "చికిత్స అవసరమైన రోగిష్ఠి బాలుడికెట్లా అతని బలహీనత వల్ల ప్రత్యేక ఆదరణ అవసరమో"[2] అట్లా ఈ భూమినంతా తన ఒడిలోకి చేర్చుకుంటుంది. పరమాత్మ పిలుపుకు ఆమె యిష్టపూర్తిగా తక్షణమే ప్రతిస్పందించి, మందకొడిగా, పరధ్యానంలో ఉన్న తను క్రియాశీలకంగా, ధ్యేయాన్ని సాధించగలిగే ప్రతినిధిగా మారుతుంది. మార్మికుల ప్రత్యేక జీవనయాత్రను గమనిస్తే వారు కర్మచేయని స్వాప్నికులన్న లౌకిక అపప్రధ పదేపదే పటాపంచలౌతుంది. డా॥ ఇంగే చెప్పినట్లు "మహా మార్మికులందరూ ఉత్సాహవంతులు, ప్రభావశీలురు. ఎన్నో విచిత్రమైన ఉదంతాల్లో వారి కార్యనిర్వహణా దక్షత విశేషంగా కనిపిస్తుంది. ఉదాహరణకు, సంరక్షకుడిగా, ట్రస్టీగా ఉండమని ప్లోటినస్‌కు ఎన్నో అభ్యర్థనలందాయి. సెయింట్

---

1 ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 234

2 అదే పే. 203

బెర్నార్డ్ ఉత్తమ నిర్వాహకుడిగా పేరు గడించాడు. సెయింట్ థెరిసా కాన్వెంట్‌ల నిర్మాతగా, పరిపాలకురాలిగా అద్భుత కార్యనిర్వహణా దక్షతను ప్రదర్శించింది. మార్మికుడికి తప్పనిసరిగా ఏదో పెద్దఎత్తున సాధించాలన్న తపన ఉండాలని ఏమీ లేదు. అయితే క్రియాశీల జీవనానికి ఆయన సమ్మతిస్తే అందు కసమర్థుడు మాత్రం కాదని నా అభిప్రాయం."[1] అందుకే ఈ మార్పుకు సంబంధించిన పెనుసవాలును అచంచల ఆత్మవిశ్వాసంతో, యుద్ధోన్మాదంతో ఉత్సాహంగా ఎదుర్కోవడానికి శ్రీమాత సమ్మతించడంలో ఆశ్చర్యమేమీలేదు. ప్రయోజనకర కార్య పరంపరకు ఇదొక నాంది మాత్రమే. భవిష్యత్తులో దీని పరిధిని ఆమె ఇప్పుడే ఊహించుకోగలదు.

"ఈ పోరాటం పాక్షికం, పరిమితమైనదైనా ఐహిక మహా పోరాటాన్ని ప్రతిబింబించేది. ఇందులో నేను నిజంగా నీ సేవకురాలుగా ఉండగలనా లేదా అని నా శక్తిని, నిర్ణయాన్ని, ధైర్యాన్ని నీవు పరీక్షిస్తున్నావు. నీ పునరుజ్జీవనచర్యకు నేను తగిన ప్రతినిధినని ఈ పోరాట ఫలితం తేలిస్తే, నీవు నా కార్యక్రమ క్షేత్రాన్ని విస్తరిస్తావు. ."[2]

మరుసటి రోజు అంటే జనవరి 18, 1915న శ్రీమాత తన ఆశా చిత్రాన్ని మరింత ఖచ్చితంగా సూచిస్తుంది.

"ఈ వీరోచిత మహాపోరాటంలో, రాగద్వేషాలకు, న్యాయాన్యాయాలకు, నీ పరమధర్మం పట్ల విధేయత-అవిధేయతలకు జరిగే ఉదాత్తపోరాటంలో ఈ మానవాళిని మెల్లమెల్లగా మరింత ఉన్నత శాంతికి అర్హులుగా నేను చేయనా? ఆ శాంతిలో మానవాళి అన్ని అంతర్గత విభేదాలు సమసి, నీ దివ్య సంకల్పాన్ని, అభ్యుదయాదర్శాన్ని మరింత సంపూర్ణంగా, సమగ్రంగా సాక్షాత్కరింపజేసేందుకు ఏకమవదా ![3]

పూర్ణయోగి కేవలం మనసుకు తోచిన సూత్రాలకు, గుడ్డి సంప్రదాయాలకు, యాంత్రిక పద్ధతులకు, ప్రవర్తనా నియమావళులకు గుడ్డిగా కట్టుబడి ఉండటాన్ని తెలివిగా తిరస్కరిస్తాడు. "ఇటువంటి ఆలోచనలు, శబ్దాలకు" సత్యం ఎప్పుడూ దూరంగా ఉంటుంది. ఎంతటి ఉన్నత సూత్రాలైనా, సూక్ష్మాతి సూక్ష్మ భావాలైనా, ఉదాత్త బోధనలైనా, పదేపదే వల్లిస్తే కొంతకాలం తర్వాత వాటి గుబాళింపు పోయి నిష్ప్రయోజక మౌతాయి. పూర్ణయోగి పాత అలవాట్లు, నిర్వీర్యం చేసే సంప్రదాయాల శిథిలాలలో విహరిస్తూ ప్రగతి సాధిస్తాడు. అన్ని రకాల ప్రతిఘటన, మాంద్య రూపాలను తిరస్కరిస్తూ

---

1. మిస్టిసిజం, పే. xi-xii
2. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 222-223
3. అదే పే. 223-224

అతను నేరుగా లక్ష్యం వైపే పయనిస్తాడు. ఆ ఆనంద ద్వారాలను ముట్టడించి, తెరిచే దాకా అచంచలంగా, అవిశ్రాంతంగా సాగుతాడు. అటువంటి అచ్ఛమైన చైతన్యం అమెది. మానవ ప్రమాణాలననుసరించి ఇది అంతరాత్మలో అత్యంత దుర్లభమైనదీ, అపాయకరమైనది కూడా. కాని ఇది సాధించాలె. దివ్యవాణి సాయంతో ఆ లక్ష్యం సాధించే వరకు ఆమె వెనుకంజ వేయదు.

"సామాన్యుల మధ్య సామాన్యుడివలె వ్యవహరించు. సృష్టిలో అంతకంటే ఏ మాత్రం ఎక్కువ కానని తెలుసుకో. వారి సమగ్ర జీవన విధానం అనుసరించు. వారి తెలివికి, ఉనికికి అతీతంగా నీలో ఉన్నది అచంచలమైన శాశ్వత ప్రకాశజ్యోతి. వారితో కలిసి ఉండటం ద్వారా నీవు ఆ జ్యోతిని వారికందజేయగల్గుతావు. ఆ వెలుగులు నీ నుండి వ్యాపించినంత కాలం నువ్వు అనుభవించాల్సిన అవసరమేముంది? నీలో కంపిస్తున్న నా ప్రేమను ఇతరుల కందించినంతకాలం నువ్వు అనుభవించాల్సిన అవసరమేముంది? నా దివ్య ఉపస్థితికి మధ్యవర్తిగా మనుషుల మధ్య వ్యవహరించినంత కాలం నువ్వు దాన్ని సమగ్రంగా ఆనందించాలా?"[1]

౨౦

ఆర్య పత్రిక ఫ్రెంచ్ ప్రతిరూపం ది రెవ్యూ డి గ్రాండ్ సింథీజ్ పై ఫిబ్రవరి 1915లో అది ఆగిపోయే వరకు శ్రీమాత దృష్టి సారించింది. అప్పటివరకు కేవలం ఏడు సంచికలు మాత్రమే వెలువడ్డాయి. యుద్ధం వల్ల సంపాదకులు ఆ పత్రిక ముద్రణను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. ఆర్య పత్రిక మాత్రం ఆరున్నర సంవత్సరాలు క్రమం తప్పకుండా నడిచింది. 1921లో నిలిచిపోయింది.

సంపాదకత్వం, నిర్వాహక బాధ్యతల నుండి ఎట్టకేలకు విముక్తురాలై శ్రీమాత పాండిచ్చేరిని వదిలి కామోమరు నౌకలో ఫ్రాన్స్ చేరుకుంది. అది ఆమెకు సంతోషం కలిగించిందా లేదా దుఃఖమా ఆమెకు తెలియదు. బాహిర మనస్సు శూన్యమైపోయింది. ఏదో చీకటి గుహలోకి తోసివేయబడ్డట్లు భావన. పాండిచ్చేరిని, ఆ పట్టణంలోని వాటిని వదిలేసి వచ్చినా, పాండిచ్చేరి మొత్తం చెరిపి వేయబడిందా? అసాధ్యం. ఆమె ఎక్కడికి తీసుకుపోబడింది? ఈ మబ్బుతెరలేమిటి? ఏ భయంకర అగోచరత్వం ఆమె ముందుంది? ఈ వేదనాభరిత అసందిగ్ధ మానసిక స్థితిని శ్రీమాత మార్చి 3,1915న నౌకలో ప్రయాణిస్తూ ఈక్రింది విధంగా వెల్లడిస్తుంది.

---

1 ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 221-222

"ఏకాంతం, కఠినమైన తీవ్ర ఏకాంతం. అంధకార నరకంలోకి ఆపాద మస్తకం విసిరివేయబడినట్లు గట్టి భావన. . . ఓ ప్రభూ !

నేనేం చేసానని నన్నీ కాళరాత్రిలోకి తోసేసావు?"[1]

మళ్లీ మరుసటి రోజున –

"ఎప్పుడూ అదే కఠిన ఏకాంతం. . .

కన్ను తెరిచినా కానరాని కటిక చీకటిలోకి ఓ ప్రభూ ! నన్ను తోసేసావు'. నీ వెలుగు చూపటానికా నన్నీ నరకపు సుడిగుండంలో దించటానికి ఎన్నుకున్నావు?"[2]

"నా ఆత్మ జీవనానికి పూర్తి ప్రతికూలమైన స్థితికి" తొందరగా వెళ్లగొడు తున్నట్లు భావిస్తుంది శ్రీమాత.[3] అసలు తన జీవితం ఇంత పెద్ద మలుపెలా తిరిగిందని ఆశ్చర్యపడుతుంది. జీవాత్మ కఠినరాత్రికి సంబంధించిన క్రమశిక్షణా ఇది? ఆమెకు ఎందుకీ ఆధ్యాత్మిక దారిద్ర్యభావన కలగాలె? ఎందుకీ శూన్య భావన, వేదన, తన జీవాన్నంతా ఆదరించిన జడత్వం?

ఇది తాత్కాలిక దశ తప్ప మరేంకాదు. శ్రీమాత ఇక్కడ మొత్తం మానవాళిని, ప్రకృతిని ప్రతిబింబిస్తున్నది. ఆ పరమాత్మ తక్షణ సక్రమ ప్రతిస్పందన కోసం ఆమె ఈ నిస్సహాయతను ప్రకటిస్తుంది. త్వరలోనే శ్రీమాత తన మానసిక స్థిరతను తిరిగి పొందుతుంది. ప్రశాంత గంభీరవైరాగ్యపు స్థిర కేంద్రానికి తిరిగి జాడ కనుక్కొంటుంది. తన కార్యానికి జారుకుంటుంది. భయాందోళనలను పారద్రోలుతుంది.

". . . .ప్రపంచంనుండి పలాయనం చిత్తగించాల్సిన పనిలేదు. మలినాంధ కారాల బరువును చివరిదాకా మోయాల్సిందే, దైవ సహాయం లేకున్నా సరే. నేను చీకటి హృదయంలో ఉండాల్సిందే. నడవాల్సిందే. అంతరంగంలో దిక్సూచి కాని, దారి చూపించే కాంతిపుంజం కాని మార్గదర్శకుడు కాని లేకున్నా సరే."[4]

చీకటిరాత్రి గడిచింది. ప్రాతస్సంధ్యా కాంతులు ప్రభవించాయి. మొట్ట మొదటి జీవ చైతన్యానికి ముందరి నిశ్శబ్ద సమయం; "అది శూన్యం కాని నిరంతరం కొనసాగే నిజమైన శూన్యం".[5] తూర్పున అరుణోదయం కావడంతో మంచు మాయమైంది. వెలుగు, జీవనం వికసించాయి. జీవితం భారంగా, అయోమయంగా ఉన్నా సరే.

---

1 ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 225

2,3. అదే పే. 226–227

4 అదే పే. 229

5. అదే పే. 232

దివిని తప్పకుండా జయించాను. దాన్నుండి నన్నెవ్వరూ, ఏదీ వేరుచేయలేదు. కాని భువినింకా జయించాల్సి ఉంది. గందరగోళపు హృదయంలోనే ఇది ఇంకా కొనసాగుతూనే ఉంది. అది సాధించినా పోల్చిచూస్తే తక్కువే.[1]

ప్యారిస్ తిరిగి చేరుకున్న శ్రీమాతకు క్రమ వికాస సాహసకృత్యపు అంతిమ విజయం పై ఏమాత్రం సందేహం లేదు. ఈ విషయాన్ని నవంబర్ 2, 1915న ఆమె నొక్కి చెపుతుంది. "తప్పులు విజయానికి సోపానాలయ్యాయి. చీకటి తడబాట్లు విజయాలయ్యాయి. నీ వైభవం వైఫల్యాలను శాశ్వతత్వపు విజయాలుగా మారుస్తాయి. నీ ఉజ్వల ప్రకాశం ముందు నీడలన్నీ జాడలేకుండా పోతాయి. నువ్వే సంకల్పమూ లక్ష్యమూ. నీవే కర్మవూ, కర్తవు."[2] ఆధ్యాత్మి కానంద తరంగాలు వరదలెత్తుతాయి. నవంబర్ 26, 1915న శ్రీమాత ఒక అద్భుత పరమానందాన్ని అనుభవిస్తుంది.

"చైతన్యమంతా దైవ ధ్యానంతో నిండిపోయింది. భౌతిక శరీరంలో మొదట అధోభాగంలో తర్వాత అంతటా ఒక దివ్య ప్రకంపన. క్రమంగా అది అత్యంత భౌతిక స్పందనలో కూడా వ్యక్తిగత హద్దులను చెరపివేసింది. ఆత్మోన్నత్యం అన్ని హద్దులను చెరపివేస్తూ, అడ్డంకులను అధిగమిస్తూ క్రమంగా ముందుకు సాగింది. తద్వారా ఔన్నత్యంలో గాఢత నిర్నిరోధంగా అతిశయించే ఒక శక్తిని, బలాన్ని తనలో ఆవిష్కరించుకొంది. భూమితో సంపూర్ణ సారూప్యం పొందేదాకా కణాలు క్రమంగా విస్తరిస్తున్నాయా అన్నట్లు, జాగృత చైతన్య శరీరం అంతరిక్షంలో సామరస్యంగా భ్రమిస్తున్న భూగోళంగా మారింది. చైతన్యానికి తెలుసు – తన ఈ ప్రపంచశరీరం విశ్వమాత ఒడిలో తిరుగుతున్నదని, అందుకే శాంతి భరిత పరమానందంలో తనను తాను ఆమెకు అర్పించుకుంది. తర్వాత తన శరీరం విశ్వశరీరంతో లీనమైందని అనుకుంది. చైతన్యం విశ్వచైతన్యంగా మారింది. అది పూర్తిగా చూస్తే నిశ్చలంగా, అంతర్గత సంక్లిష్టతలో నిరంతర చలనంతో కూడుకొని ఉంటుంది. విశ్వచైతన్యం ప్రగాఢ ఆకాంక్షతో, సంపూర్ణ శరణాగతితో పరమాత్మ వైపు పరుగులిడింది. నిర్మల దివ్య కాంతి ప్రకాశంలో ఈ విశ్వమంతా అనంతంగా చుట్టుకొని ఉన్న వేయి పడగల మహా సర్పంపై నిలబడి ఉన్న ఉజ్వల పురుషుణ్ణి చూసింది. విజయ దరహాసంతో ఆ పురుషుడు ఒకేసారి సర్పాన్ని, సర్పంనుండి వెలువడిన విశ్వాన్ని సృష్టించాడు. నియంత్రించాడు. అతను ఆ సర్పంపై తాండవమాడుతూ మొక్కవోని పరాక్రమంతో వశపరచుకొన్నాడు. విశ్వాన్ని చుట్టుకున్న ఆ సర్పాన్ని అణగద్రొక్కిన ఆ విలాసమే దానిని శాశ్వతత్వాన్ని ప్రసాదించింది. అప్పుడా

1,2. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 236

చైతన్యం ఈ జీవిగా మారింది. తన స్వరూపం మళ్లీ మారుతున్నదని గ్రహించాడు. నిరాధారంగా ఉంటూనే అన్ని ఆకారాలను తనలో ఇమిడ్చుకొన్న స్వరూపం దాన్ని గ్రహించింది. మార్పులేని ఆ వస్తువు చూస్తుంది. అదే కన్ను, సాక్షి కూడా. అదేది చూస్తుందో అదే ఉంది. తర్వాత ఈ చివరి స్వరూపావశేషం మాయమైంది. చైతన్యం కూడా మాటల కందని వర్ణనాతీత బ్రహ్మంలో లీనమైంది.[1]

౨౧

1915లో ప్యారిస్ నివసించటానికంత అనువైన ప్రదేశం కాదు. శ్రీమాత స్థితప్రజ్ఞత కఠిన పరీక్షకు గురైంది. అయినా అంతరంగంలో అంతా ప్రశాంతతే. పిలుపు వచ్చినప్పుడల్లా శక్తి సిద్ధంగా ఉంది. విజయం పట్ల సందేహలేశం కూడా లేదు. శ్రీమాత ఆధ్యాత్మిక దినచర్యలో నాలుగు నెలల పైగా విరామం కనిపిస్తుంది. (ఆమె ప్రార్థనలు, ధ్యానాలు అన్న పుస్తకాన్ని ఆ విధంగా వర్ణించొచ్చు). ఈ మధ్యలో మరో అన్వేషణాత్మక ప్రయాణం– ఈ సారి జపాన్‌కు. టోక్యో చేరాక జూన్ 7, 1916న శ్రీమాత ఇట్లా రాస్తుంది.

"ఏమీ చెప్పలేని స్థితిలోనే చాలా కాలం గడిచింది. సమతులనం మరింత విశాలమైన, సంపూర్ణమైన మరో సమతులనానికి ప్రయాణించే సంధికాలం అది. బయట ఎన్నో రకాల వింత పరిస్థితులు. జీవికి తన అనుభవానికి మరింత విస్తృతమైన, సంక్లిష్టమైన భూమిక నివ్వటంకోసం ఎన్నో అవగాహనలు, పరిశీలనలు అవసరమా అన్నట్లు. . హఠాత్తుగా జూన్ 5న తెరతొలగింది. నా చైతన్యంలో కాంతి వెల్లివిరిసింది."[2] ఆర్నెల్ల తర్వాత కాని మరో వ్రాత కనిపించదు. చెప్పటానికికేమీ లేదు– "ఎందుకంటే సంచలనాత్మక అనుభవం ఏదీ లేదు కనుక. అన్ని అనుభవాలూ ఇప్పుడు సాధారణంగా సహజంగా కనిపిస్తున్నాయి."[3] కాని బయటికి కనబడే సాధారణత, నగ్నత వెనుక అంతర సంపదలెన్నో దాగి ఉన్నాయి. ఆమె కళ్లు తెరవాలే కాని ఎటు చూసినా పరమానందమే.

"ఈ కళావిహీనమైన బూడిద రంగులో, ప్రకాశహీనమైన కాంతిలో అనంత శూన్యాల మధురిమలను నేనాస్వాదిస్తున్నాను. సముద్రం పై నుండి వీచే మంద పవనాలు, ఉన్నత శిఖరాల బలమైన శ్వాస నా హృదయాన్నెప్పుడూ నిండి ఉంటాయి.

---

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 241-242
2. అదే పే. 245-246
3. అదే పే. 248

నా జీవితంలో చొచ్చుకొనిపోతాయి, నా లోపలా, వెలుపలా ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయి. ఎంత ఎత్తుకైనా నిర్నిరోధంగా ఎగరడానికి రెక్కలు విప్పి సిద్ధంగా ఉన్న విహంగాన్ని నేననిపిస్తుంది."[1] డిసెంబర్ 5, 1916న పరమాత్మతో సారూప్యం పొందిన పరమానందపు లోతుల్లో మనస్సు, చైతన్యాన్నీ వదిలి తన్నుతాను మరచిపోతుంది. పరమాత్మ కోసం దరిచేరలేని సుదూర ఆకాశం వైపు మళ్లాలనుకోవటం ఎంత అవివేకం. అంతకంటే భూమివైపు మళ్లి నీ ముందు భగవంతుడున్నాడా చూడు. ఇటువంటి ఉజ్వల అనుభవాన్ని శ్రీమాత వర్ణిస్తుంది.

"జపాన్‌లో అదొక వీధి. దీపకాంతులతో వివిధ రంగులతో శోభాయమానంగా విరాజిల్లుతున్నది. చైతన్యం ఉన్న ప్రతిదీ వీధిలో ముందుకు సాగుతుండగా, ప్రతి దానిలో అన్నిటా పరమాత్మ దర్శనమిస్తున్నాడు. ఒక చిన్న ఇల్లు పారదర్శకంగా కనబడింది. అందులో ఒక వనిత రంగురంగుల బంగారు అద్దకంతో మెరుస్తున్న ఉదారంగు దుస్తుల్లో ఆసీనురాలై ఉంది. అందమైన ఆ వనిత 35-40 మధ్య ఉంటుంది. బంగారు వాద్యాన్ని వాయిస్తున్నది. ఆమె కాళ్ల దగ్గర ఒక పసిబిడ్డ. ఆ వనితలో కూడా భగవంతుణ్ణి దర్శించాను".[2] ఈ దివ్య సాక్షాత్కారాన్ని అలీపూర్ జైల్లో శ్రీ అరవిందులకు "ఆశ్రమవాస" ప్రారంభంలో కలిగిన నారాయణ దర్శనంతో పోల్చవచ్చు-

"మనుషుల నుండి నన్ను వేరు చేసిన జైలును చూసాను. ఆ ఎత్తైన గోడలు చూస్తే బందీగా ఉన్నట్లనిపించలేదు. కాదు నన్ను చుట్టుముట్టింది వాసుదేవుడే. నా జైలుగది ముందున్న చెట్టు కొమ్మల క్రింద నడిచాను. కాని అది చెట్టు కాదు వాసుదేవుడే. శ్రీకృష్ణుడే అక్కడ నిలబడటం నేను చూసాను. అయన నీడ నాపై పడింది. జైలు ఊచలను, ద్వారాన్నీ చూసాను. మళ్లీ అక్కడా వాసుదేవుడే, నారాయణుడే అక్కడ సంరక్షకుడిగా నన్ను గమనిస్తూ ఉన్నాడు."

ఇక నుండి భగవంతుడే వారి శాశ్వత మిత్రుడు-ప్రేమికుడు. శ్రీ అరవిందులకు వలెనే శ్రీమాతకు కూడా ఆమె ప్రేరణా, ధర్మమూ అంతరంగంలోని పరమాత్మ నుండే లభిస్తాయి. అతనే సృష్టికర్తా, పరమ సత్యమూ కూడా

రోజులూ, వారాలూ, నెలలూ గడుస్తున్నకొద్దీ శ్రీమాతకు ఈ భూమిపైన తన నిర్దిష్టవిధి ఏమిటో క్రమంగా, బలవత్తరంగా తెలుస్తూ వచ్చింది. నిచ్చెన పైమెట్టును

---

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 248-249
2. అదే పే. 251
3. ఉత్తరపారా ఉపన్యాసం

ఆమె చేరుకుంది. ఆవలిస్తున్న శూన్యంలోకి దూరంగా విస్తరిస్తున్న వర్ణనాతీతమైన నిర్వాణంలోకి ఆమె దాదాపుగా దూకేసింది. కాని ఆమెను ఈ ఐహిక బాధ్యతా భారాన్ని మోయడానికి, "దుఃఖమయమైన బాటలో" నడవటానికి మళ్లీ వెనక్కు తిప్పి పంపారు. ఆమె సంస్థ ఏదో, కర్తవ్యమేమిటో, దాని పరిధి ఏమిటో ఆమెకు తెలియదు. ఒకవేళ విఫలమైతే . . .? "భయపడకు" అంటూ వస్తుందో హామీ. "నిర్దిష్ట కార్యం ఎంతో గొప్పది, సంక్లిష్టమైనప్పుడే నీ శక్తియుక్తులన్నింటినీ వినియోగించాలని అడుగుతారు. ఆ పని ఖచ్చితంగా ఏమిటో, అది నిన్ను చేరినప్పుడే తెలుస్తుంది. ఇప్పటి నుండే నిన్ను హెచ్చరించేదేమిటంటే దాన్ని తిరస్కరించకుండా ఉండటానికి నువ్వు సన్నద్ధం కావాలని. చిన్న ప్రశాంతమైన, ఒకే రకమైన, శాంతియుత జీవన పరిధి స్వస్తి పలికిందని కూడా నీకూ నీ చైతన్య సత్తకూ మరో హెచ్చరిక. ఇక ముందున్నవి ప్రయత్నం, ప్రమాదం, అనూహ్యత, అభద్రతలే కాకుండా భావోద్వేగత కూడా. ఈ పాత్రను పోషించడానికే నువ్వు జన్మించావు. అందుకు నిన్ను సన్నద్ధం చేయడమే నా ప్రస్తుత కర్తవ్యం. ఇందుకోసమే నిన్ను మలుస్తూ, సుసంపన్నం చేసే క్రమశిక్షణకు గురిచేయడం, దేన్ని గురించి రంధిపడకు; అవసరాన్ని బట్టి శక్తి వస్తుంది. ఈ శాశ్వతత్వం నుండి నిన్ను భూమిపై నా అరుదైన ప్రతినిధిగా ఎన్నుకున్నాను. అదృశ్యంగా, గుప్తంగా కాదు అందరు మానవులకూ కనిపించే ప్రతినిధిగా రూపొందించాను. నిన్నే విధంగా సృష్టించానో, అట్లాగే ఉంటావు.[1]

ఆమె శ్రీమాత. సూక్ష్మరూపంలో ఉన్న విశ్వరూపం. కాలం బంధించిన శాశ్వతత్వం. పరిణామ క్రమంలో బృహత్కార్య సాధనకు అనుగుణంగా ఆమె జీవ భాగాలన్ని మలచబడ్డాయి. ఆమె ప్రస్తుతం పరమాత్మతో అతని రూపాంతరాలన్నింటిలో నిత్య ప్రశాంత సమాగమానందాన్ని అనుభవిస్తున్నది. డిసెంబరు 20, 1916న కరుణా సముద్రుడు శాక్యముని సందేశాన్ని అందుకొంది.

"విను. నా బోధనలనూ, వాటి ఫలితాలనూ ఊహించుకుంటూ నేను ఎన్నో రోజులు సంకోచంలో పడ్డాను. అభివ్యక్తిలో అసంపూర్ణత, అవగాహనలో మరింత అసంపూర్ణత. అయినా ఈ భూమి వైపు నా దృష్టి మళ్లించి, నా సందేశాన్నిచ్చాను. "ఈ భూమి వైపు, మనుషులవైపు మళ్లు" అనే ఈ ఆదేశమే కాదా మీ హృదయాల్లో వినిపించేది?. . ."[2]

---

1 ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 252-255

2 అదే పే. 360

మళ్లీ డిసెంబర్ 25న గతసాయంత్రపు నిశ్శబ్దంలో తనకు వినిపించిన విషయాలను మాటల్లో చెపుతుంది.

"ప్రతిదీ సన్యసించు – వివేకాన్నీ, చైతన్యాన్నీ కూడా. అప్పుడే నీకు నిర్దేశించిన పాత్రకు నీ హృదయం సన్నద్ధమౌతుంది. ఇది విదితంగా కృతజ్ఞత పొందని పాత్ర. అందరికీ వెల్లువలా నీరందించినా, తనవైపు ఏ ప్రవాహమూ ఆరోహించని నీటి వంటిది. తన లోతుల్లో నుండే అంతులేని శక్తిని పొందుతుంది. బయటినుండి ఏమీ ఆశించలేదు. ఈ అంతులేని ప్రేమ విస్తారతలో ఉండే అతిశయానందాన్ని మాత్రం నువ్వు ముందే అనుభవించగల్గుతావు. ఎందుకంటే ప్రేమ స్వయం పోషకమైనది. దానికి ప్రతి స్పందన అవసరం లేదు. ఇది వెలలేని ముత్యం వంటిది. నువ్వు సాధించటం కోసం ఉద్దేశించబడింది."[1]

మెరుగులు దిద్దిన అందమైన స్ఫటికం వలె శ్రీమాత తన కార్యం కోసం సిద్ధంగా ఉంది. పరమాత్మ దివ్యప్రకాశాన్ని భూమిపైన సిద్ధింపజేసే క్లిష్టకార్యం అది.

౨౨

స్వార్థ, నిఃస్వార్థ కర్మల మధ్య, వ్యక్తిగత అభివృద్ధి కోసం పరమాత్మను అర్పణంగా చేసే కర్మల మధ్య ఎన్ని పెద్ద అగాధాలు, మరు భూములు, అసంపూర్తి చర్యలు, సర్దుబాట్లూ, ఎన్ని ఒయాసిస్సులు, ప్రశాంత గంభీర కేంద్రాలో ! కాని ఈ విషయం మాత్రం నిస్సందేహం. స్వార్థకర్మమెప్పుడూ ఆత్మహననమైనదే. "నీ కృపాకటాక్ష కిరణాలు లక్ష్యంగా ఉన్న కర్మలే కొంచెం మందుగానో ఆలస్యంగానో సులభంగా, విజయవంతంగా సాధ్యమౌతాయి."[2] కర్మ ధర్మానికి సౌందర్యం, ఆనందాల కాంతులు దూరమైనవేం కావు. పరమాత్మ సత్యమే కాదు. సుందరం, శివం కూడా. మార్చి 27, 1917న శ్రీమాత ధ్యానంలో సంవాద రూపంలో ఒక అసాధరణమైన సందేశాన్ని పొందింది. భక్తుడూ, పరమాత్మ పరస్పరాభిముఖులుగా ఉంటారు. చివరికి మబ్బు తెరలు తొలగిపోతాయి. ఆకాశం నిర్మలంగా కాంతిమంతంగా ఉంది. సూర్యుడు ప్రచండ ప్రతాపంతో ప్రకాశిస్తున్నాడు. ఎదురుచూసే వాతావరణం ఆశావహంగా, ఉజ్వల భవిష్యత్ స్ఫోరకంగా సంతోషాన్ని పంచిపెడుతున్నది.

కట్టెల మోపును బంధించే కట్టెలు.కొట్టేవాడివి నువ్వు.
రెక్కలు విప్పిన హంస రాజానివి నువ్వు.

---

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 272
2. అదే పే. 272

నీ ముత్యపు ధవళత్వంతో కన్నులు శుభ్రమౌతాయి.
అంతరంగంలో తెల్లని కాంతులు ప్రసరించి
హృదయానికి వెచ్చదనాన్నిస్తాయి.
అందరినీ వారి పరమలక్ష్యంవైపు నువ్వే నడిపిస్తావు.[1]

ప్రశాంతత, సంతోషం ఆమెవి. ప్రభాత భేరీకి ముందరి విశ్రామ క్షణాలు ఆమెవి. ప్రతి స్పందనతో జపాన్ అందించిన సౌహార్ద్ర వస్త్ర సంపద ఆమెది. ఎప్పటి వలెనే ధ్యానాంకిత ముద్రతో ఇసుక రేణువులో అనంత విశ్వాన్నీ, క్షణమాత్రంలో నిత్యత్వాన్నీ దర్శిస్తుంది.

"నేను మొదట చెర్రీ పుష్పంతో ఒక్కటౌతూ మొత్తం అన్ని చెర్రీ పుష్పాలతో సారూప్యం పొందాను. నీలిశక్తి ప్రవాహాన్ని అనుసరిస్తూ చైతన్యపు లోతుల్లోకి దిగాను. అంతలో ఉన్నట్టుండి భగవదర్పితమైన పుష్పభారంతో శాఖోపశాఖలుగా ఆకాశం వైపు తన భాహువులను విస్తరిస్తున్న చెర్రీ వృక్షంగా మారాను. మానవ శరీరానికీ వృక్ష శరీరానికీ భేద మేమున్నది? నిజానికేమీ లేదు. వాటిలోని జీవచైతన్యం మనదీ ఒక్కటే."[2]

అకాకురాలోని మహా పర్వతాలు, వాటి వెనుకనున్న అనంత శూన్యం, వాటిని ఎంపికైన నిశ్శబ్దాలు, శక్తిమంతమైన సామరస్యాల కనుగుణంగా శ్రీమాత హృదయం స్పందిస్తుంది. అట్లా "నీతో సంయోగ పరమానందాన్ని" ఆమె చవి చూస్తుంది. గ్రీష్మంలో చిరుజల్లు వలె, సంతోషంలో పసి బాలుడి వలె ఆమె ఒకేసారి ఏడుస్తుంది, నవ్వుతుంది. తన ప్రియ ప్రభువుతో, ప్రేమికుడితో ఎల్లప్పుడూ ఒక్కటౌతుంది.

౨౩

ఒయివాకే, సెప్టెంబర్ 3, 1919.

అదొక విధి లిఖించిన దినం. "నేనెంతో ప్రేమతో శ్రద్ధతో సిద్ధం చేసిన ప్రసాదాన్ని మానవుడు తిరస్కరించాడు. కనుక నీవే తీసుకొమ్మని భగవంతుని ప్రార్థించాను" అని వ్రాస్తుంది శ్రీమాత.[3] కాసేపాగి, ఇంకా ఇట్లా వ్రాస్తుంది. "ఓ భగవంతుడా ! నా ఆహ్వానాన్ని నీవు మన్నించావు. నాతో సహపంక్తిలో కూర్చొన్నావు. నేనిచ్చిన కడుపేద, సాధారణ ప్రసాదాన్ని స్వీకరించి నాకు అంతిమ స్వేచ్ఛను ప్రసాదించావు. క్రమంగా నా భ్రమలన్నీ అధిగమిస్తూ పునరుజ్జీవనం పొందేంత ఎత్తులో

1,2. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 277
3. అదే పే. 291

ఉన్న నీ సౌధాన్ని చేరాను. నాలో గతావశేషమేమీ లేదు – స్వచ్ఛమైన పసిబాలుడి హృదయాన్ని, భగవంతుని ధ్యానానికి సంబంధించిన చురుకుదనం, స్వేచ్ఛలను ప్రదానం చేసిన ప్రగాఢ ప్రేమ తప్ప."[1]

ప్రార్థనలు – ధ్యానాలు పుస్తకంలో తర్వాత లేఖనం పాండిచ్చేరి నుండి జూన్ 22, తేదీతో కనిపిస్తుంది. శ్రీమాత శ్రీ అరవిందాశ్రమంలో నివసించటానికి వచ్చేసింది. అక్కడి "పిల్లలు" ఆనందించారు. తన ప్రణాళికే ఆమె నిక్కడికి రప్పించిందని యజమానికి దిటవు లభించింది. ఈ అనేక సంవత్సరాల ఆత్మనియంత్రణ, ఆత్మ సంపూర్ణీకరణల క్రమ పరిణామంలో ఆమెను మలచిందీ, శిక్షణ నిచ్చిందీ ఇందుకోసమే. ఇందుకోసమే ఆమె సృష్టింపబడింది. ఆమె ఇక తన దివ్యత్వాన్ని పటిష్టపరచి చేసి ఉన్నత పరిణామ వికాస పాత్రను ధరిస్తుంది.

"అభివ్యక్తి కతీతమైన పరమానందాన్ని ప్రసాదించి, ఓ నా ప్రియప్రభూ ! ఈ ఘర్షణను, మహాకార్యాన్నీ నా కప్పజెప్పావు. నీ దివ్య ప్రతినిధిగా వీటిని చిరునవ్వుతో స్వీకరించాను. ఇదివరలో సంఘర్షణ అంటే భయపడేదాన్ని – అది శాంతి సామరస్యాల పట్ల నాలో ఉన్న ప్రేమను భంగపరుస్తుందని. కాని ఇప్పుడు ఓ ప్రభూ ! దాన్ని నేను సంతోషంతో స్వాగతిస్తున్నాను."[2]

శ్రీ అరవిందుల విశ్రాంత దశలో ప్రథమ సంవత్సరాల్లో ఆయన పట్ల సాటిలేని విధేయత కల్గిన శిష్యులు నలుగురో, ఐదుగురో ఉండేవారు. కాని క్రమంగా పాండిచ్చేరికి ఇతరులు ఆకర్షితులయారు. అతని ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలని ప్రగాఢంగా ఆకాంక్షించారు. ఆర్య పత్రిక సందేశం, ఆ పత్రిక వెనుక ఉన్న వ్యక్తిత్వం చాలామంది అధ్యాత్మిక కాముకుల్ని పాండిచ్చేరికి రప్పించాయి. శ్రీ అరవిందులు కేంద్రంగా యోగాశ్రమం మెల్లమెల్లగా వృద్ధి చెందింది. శ్రీమాత 1920లో ఈ ఆశ్రమంలో చేరింది. భగవంతుడు నిర్దేశించిన తన లక్ష్యాన్ని దర్శించింది. ఆశ్రమ వ్యవస్థీకరణను, నిర్వహణను శ్రీ అరవిందుల కోరికపై తన చేతుల్లోకి తీసుకొంది.[3] కొత్తగా చేరేవారి సంఖ్య క్రమంగా పెరుగుతూ పోయింది. కొత్త భవనాలను అద్దెకు తీసుకోవడమో, కొనడమో చేయాల్సి వచ్చింది. ఆహార సరఫరా, అనుకూలమైన ఆవాసం, పారిశుధ్యం కొరకు, సాధారణంగా

1,2. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 292

3. వివరణకు దిలీప్ : "ఆమె బలవత్తరమైన ఉనికి, మానవాతీత సహనం, మేధస్సు (ఆమె చురుకుదనం, వైభవం, ధైర్యం కలిగిన వర్ణనాతీత వ్యక్తిత్వం సరేసరి) కనుక ఆశ్రమ నిర్వహణలో లేకుంటే, శ్రీ అరవిందుల సంపూర్ణ యోగం అందరికి నచ్చే విధంగా ప్రస్తుతం రూపం పొందేది కాదు –మదర్ ఇండియా, జులై 28, 1951)

సమాజానికి భౌతిక, ఆధ్యాత్మిక ఆరోగ్యం కొరకు ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది. ఈ భారమంతా ఇప్పుడు శ్రీమాతపై పడింది. అది క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఆమె భారాన్ని ఎట్లా మోసిందో, ఏ ఘర్షణా, అడ్డంకి లేకుండా సున్నితమైన అదృశ్య చక్రాల నెట్లా నడిపిందో, బహుముఖ ఏకాగ్రతనూ, క్రియాకలాపాన్నీ గంట గంటకూ ఎట్లా నడిపిందో ఈ రోజు వరకూ అర్థం కాదు.

సాధకులు కొంత మందే ఉన్నప్పుడు, వారు ఇటు శ్రీమాతతో ఫలప్రదమైన చర్చలు జరిపేవారు–అటు ఆచార్యులతో క్రమంగా లేఖల ద్వారా సంప్రదించే వారు. ఆ చర్చలు–సంభాషణలు ఇప్పుడు 'శ్రీమాత మాటలు' అనే సుబోధక శీర్షికతో పుస్తక రూపం ధరించాయి. శ్రీఅరవిందులు, శ్రీమాతల పూర్ణయోగాని కిదొక సులభతరమైన, నచ్చజెప్పే రీతిలో ఉన్న ఉపోద్ఘాతం అనవచ్చు. పూర్ణయోగ ప్రధాన సూత్రాలను శ్రీమాత సంక్షిప్త వాక్యాల్లో సూత్రప్రాయంగా వ్యక్తీకరించింది.

"జీవితలక్ష్యం సంతోషం కాదు. సాధారణ జీవిత ధ్యేయం తన విధిని నిర్వహించడం; ఆధ్యాత్మిక జీవన ధ్యేయం భగవత్సాక్షాత్కారం."[1]

"దివ్య చైతన్యంలో మైమరచిపోవటం కాదు మన ధ్యేయం. దివ్య చైతన్యం మన భౌతిక పదార్థంలో చొచ్చుకొని, రూపాంతరం పొందేట్టు చేయడమే ధ్యేయం."[2]

"సంభాషణలు" విస్తృత పరిధిలో కొనసాగాయి. వాటిలో కొన్ని అంశాలు: యోగ సన్నద్ధత; దర్శనాలు–ఆధ్యాత్మికత; జీన్ డి ఆర్క్ దృశ్యాలు; ధ్యానము–ఆత్మసమర్పణ, స్వేచ్ఛ–కర్మవాదం; వ్యతిరేక శక్తులు; తర్కము–విశ్వాసము; శాపగ్రస్తులు; ఆలోచనాశక్తి; చైత్య పురుష ప్రపంచంలో పరిస్థితులు మానవీయ, దైవికప్రేమ; కళ–యోగం; శరణాగతి–త్యాగం; ఇంకా ఎన్నో. చిరపరిచితంగా, స్నేహపూర్వకంగా, ముచ్చటిస్తున్నట్లు ఉండే ఈ సన్నిహిత సంభాషణలు నెమ్మదిగా, అనివార్యంగా వాటి అర్థాలను మన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా చేస్తాయి. ఒకటి, రెండు ఉదాహరణలను తీసుకుందాం: ఈ ప్రపంచాన్ని, అందులో జీవుల్ని భగవంతుని సన్నిధికి చేర్చేందుకు ప్రేమ అనే అనంతమైన శక్తిని శాశ్వత చైతన్యం తనలో నుండి ఈ అనామక, అంధకారప్రపంచంలోకి పంపించింది. అజ్ఞానాంధకారంలో మగ్గుతూ భౌతిక ప్రమాదం పరమాత్మను మరచింది. ఈ అంధకారంలోకి ప్రేమ ప్రవేశించింది. నిద్రాణమై ఉన్న దాన్నంతా తట్టి లేపింది. మూసుకపోయిన చెవులను తెరచి ఇలా గుసగుసలాడింది.

---

1 వర్డ్స్ ఆఫ్ ది మదర్ పే. 22

2 ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్ పే. 32

"నిద్ర నుండి లేచి పొందదగింది, జీవితాన్ని వెచ్చించదగిందీ ఒకటుంది- అదే ప్రేమ అని ప్రేమ పట్ల జాగృతి పొందడంతో ఈ ప్రపంచానికి పరమాత్మ సాన్నిధ్యం తిరిగి పొందడానికి అవకాశం లభించింది. సృష్టి ప్రేమ ద్వారా భగవంతుని వైపు ఊర్ధ్వముఖంగా పయనిస్తుంది. ప్రతి స్పందనగా భగవంతుని ప్రేమ-కారుణ్యాలు సృష్టిని కలవడానికి అధోముఖంగా దిగివస్తాయి."[1]

"కళాశాస్త్రానికి, యోగ శాస్త్రానికి కేంద్రంలో ఉన్నది ఒకే సూత్రం. రెండింటి లక్ష్యమూ మరింత చైతన్యవంతులు కావటమే. రెండింటిలో మామూలు దృష్టికీ, అనుభవానికి అతీతంగా ఉన్న దాన్ని చూడటం, అనుభవించటం ఎలాగో నేర్చుకోవాలి. అంతరంగంలోకి వెళ్లి మరింత లోతైన విషయాలను వెలికి తీయాలి. అటువంటప్పుడు యోగ చైతన్యం కళాసృష్టి కెందుకు దోహదపడదు?"[2]

యోగ భూమికలు పీఠికలు, యోగముపై వెలుగులు, శ్రీఅరవిందుల లేఖలు (మూడు సంపుటాలు) శీర్షికలతో శ్రీఅరవిందుల లేఖలు ప్రచురితమయ్యాయి. ఆ పుస్తకాల వలెనే "శ్రీమాత మాటలు" కూడా దివ్యజీవన యోగ సూత్రపంక్తికి స్వాగతాలు.

౨౪

శ్రీమాత పాండిచ్చేరి యోగాశ్రమంలో చేరి ఇరవై రెండేళ్లయింది. ఆమె విశ్వాసం మాత్రం లేశమైనా చెదరలేదు. చీకట్లు వచ్చాయి. వెనక్కు మళ్లాయి. మాయమైనాయి. సందేహాలు దారి కడ్డుపడ్డాయి. తొలగిపోయాయి. కొత్త ప్రపంచాల్ని, కొత్త స్వర్గ నిర్మాణం నిర్నిరోధంగా నిశ్శబ్దంగా కొనసాగుతూనే ఉంది. ఎప్పటికప్పుడు సాధారణంగా నూతన సంవత్సరం ముందు శ్రీమాత "ప్రార్థనలను" రూపొందిస్తుంది. క్లిష్ట క్షణాల్లో మానవాళి సమష్టి ఆకాంక్షలను అవి ప్రతిబింబిస్తాయి. ఈ ప్రార్థనలు, ముఖ్యంగా నూతన సంవత్సర ప్రార్థనలు, మూల్గుతున్న మానవాళి కోర్కెలు, ఆశలకు రూపాన్ని, శక్తినీ, మార్గాన్నీ, వేగాన్నీ ఇచ్చాయి. యుద్ధం, యుద్ధానంతర సమయాల్లో ప్రార్థనలు ధ్వనితో సృజనాత్మక శక్తితో సుసంపన్నం అయ్యాయి.

"1940

నిశ్శబ్దం, నిరీక్షణల సంవత్సరం
ఓ ప్రభూ ! నీ కృపే మాకు ఆధారం".

---

1. ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్, పే. 144-145
2. అదే పే. 191

"1944

ఓ ప్రభూ, ప్రపంచం మళ్లీ తన మూర్ఖత్వంలోకి పడిపోకుండా రక్షించమని ప్రార్థిస్తున్నది. గుర్తించిన తప్పులు మళ్లీ జరక్కుండా చూడు. చివరగా తన క్రియా కలాపాలన్నీ ప్రకటించిన ఆదర్శాలకు తగిన అభివ్యక్తి అయ్యేలా వరమివ్వు".

"16 ఆగస్టు 1945,

విజయం వరించింది. ఇది నీ విజయం. ఇందుకు ఓ ప్రభూ ! నీకు అనంత కృతజ్ఞతలు. కాని ఇప్పుడు మా ఉద్వేగభరిత ప్రార్థన నీవైపుకెగసింది. నీ శక్తితోనే విజేతలు విజయాన్ని సాధించారు. తమ విజయంలో వారు ఈ విషయాన్ని మర్చి పోకుండా వరమివ్వు. ఆపత్కాలంలో, ప్రమాద సమయంలో నీకు చేసిన వాగ్దానాలు నిలబెట్టుకొనేట్లు చూడు. యుద్ధం చేయటానికి వారు నీ పేరును వాడుకొన్నారు. శాంతి స్థాపనకోసం నీ కృపను మరిచి పోకుండా చూడు."

15 ఆగస్టు 1947న శ్రీమాత ప్రార్థన ప్రత్యేక ప్రాధాన్యాన్ని సంతరించుకొన్నది.

"ఓ భారతమాతా ! భారతదేశపు ఆత్మా ! ఎంతో క్రుంగి పోయిన రోజుల్లో నీ మాట వినకుండా ఇతర యజమానులను సేవించి, నిన్ను తిరస్కరించినప్పుడు కూడా నీ పిల్లలను నువ్వు మరవలేదు. వారు జాగృతమైనప్పుడు, నీ స్వేచ్ఛా సుప్రభాత వేళ నీ ముఖారవిందం కాంతులు విరజిమ్ముతుండగా, నీకు నమస్కరిస్తున్నాము తల్లీ ! మా ముందు విరబూసిన స్వేచ్ఛా దిఙ్మండలం జాతుల సముదాయంలో నీ ఔన్నత్యానికీ, నీ నిజజీవితానికీ చెందిన దిఙ్మండలంగా కూడా మారే విధంగా మాకు మార్గ దర్శనం చెయ్యి, మేమెప్పుడు ఉన్నత ఆశయాలవైపు ఉండేట్లు మార్గం చూపు. ఆధ్యాత్మిక విధానాల్లో నాయకుడిగా, అందరు ప్రజల మిత్రుడిగా, దోహదకారిగా నీ అసలు స్వరూపాన్ని మానవులకు చూపించు".

శ్రీ అరవిందాశ్రమం నేడొక సూక్ష్మ ప్రపంచం. దాదాపు 750 మంది సాధకులు ఎన్నో భవనాల్లో నివసిస్తూ ఈ "ధవళ పట్టణాన్నీ", దాని చుట్టు పట్ల కూడా వ్యాపించి ఉన్నారు. ఆశ్రమ అతిథిగృహం "గోల్కొండ" ఆకర్షణీయమైన భవనం. ముద్రణాలయం, బైండరీ, పాలకేంద్రం, బేకరీ, దవాఖాన, గ్రంథాలయం, పఠనాలయం, పాఠశాల- ఇవన్నీ ఆశ్రమ సౌందర్యాన్ని, జీవకళను ఇనుమడింపచేస్తున్నాయి. మైసూర్ విశ్వవిద్యాలయ ప్రో-ఛాన్సలర్ డా॥ సి.ఆర్. రెడ్డి మాటల్లో. . .

"ఈ అద్భుత ఆశ్రమంలో జీవితం జీవితానందం రెండూ కలబోసి ఆధ్యాత్మికత, ఆధ్యాత్మిక వికాసంతో ఆనంద సమాగమం పొందాయి. వేదాల్లో నుండి త్రవ్వి, పాండిచ్చేరిలో నాటిన వృక్షం ఇది.

అద్భుత శ్రీమాత అధ్వర్యవం. పరమాచార్యులు ఉత్తేజం నింపే ఆత్మ. కనబడే ప్రకృతి, పురుష ప్రతీకలుగా జీవనాన్ని, కాంతిని, సంతోషాన్ని తమ చుట్టూ పంచుతున్నారు. దివ్యమాత కఠోర వైరాగ్యంతో ముడుచుకొని, ఎప్పుడూ భ్రుకుటి ముడితో ఉంటుందనుకుంటే పొరబడ్డట్లే. ఆమె విరాగి కాదు. ఆమె టెన్నిస్ ఆడుతుంది ! దేవుళ్లెప్పుడూ సంతోషంగా, చురుగ్గానే ఉంటారు. ఇక్కడి సమావేశాల్లో స్త్రీ పురుషులు, పిల్లలు హృదయాల్లో భక్తితో చూపులు, మాటలు, ప్రవర్తనలో ప్రేమ, కాంతి, సంతోషాలతో కనబడుతారు. . . ."[1]

కేవల వైరాగ్యానికి ఆశ్రమంలో స్థానం లేదు. రత్నగిరి పొదల్లో బిక్కుబిక్కుమంటున్న యోగులు, భిక్షువులు, విరాగుల జీవితం శోకమయం, అదైవికం అని భావించాడు సిద్ధార్థుడు. ఇటువంటి స్వయం నిర్మిత నరకాలతో పోలిస్తే డాంటే మహాకవి ఇన్‌ఫెర్నో (నరకం) ఆరోగ్యప్రదాయినిగా కనిపిస్తుంది. "శ్రీమాత ఎందుకంత సంపన్నమైన, అందమైన వస్త్రాలను ధరిస్తుందన్న" ప్రశ్నకు శ్రీ అరవిందులొకసారి మరో ఎదురు ప్రశ్నతో సమాధానమిచ్చాడు. "దైవాన్ని భూమిపై దరిద్రంగా అసహ్యంగా ప్రతిబింబించాలని నీ ఉద్దేశ్యమా?"[2] భగవంతుడు సత్యమైతే అతను శక్తి, జ్ఞానం, ఆనందం, అందం. అందాన్ని, ఆనందాన్ని కావాలని మరుగున పరిస్తే సత్యం నుండి దాని విశేషత్వాన్ని, ఉజ్వల ధవళ ప్రకాశాన్ని తొలగించినట్లవుతుంది. ప్రతి దాన్ని తప్పు బట్టే మానవ ద్వేషి అయినా జీవితమంటే ఆనందమనుకొనే జల్సారాయుడైనా వారి విద్యలు రెండూ వక్రమార్గాన్ని పట్టిస్తాయి. ఉపవాస దీక్షలు ఆత్మహత్యకు దారి తీస్తాయి. అట్లాగే తిండిపోతుతనం కూడా మరింత తొందరగా అటే దారితీస్తుంది. వజ్రపుటంచులదారి వంటి మధ్యేమార్గం ఒక్కటే "ప్రశాంత కేంద్రాని" కి మనల్ను చేర్చగలదు. నిజమైన సాధకుడు అన్ని ఆలోచనలు, అన్ని ప్రయత్నాలు, అన్ని సంతోషాలు త్యాగంగానే భావిస్తాడు. అవన్నీ ఆకాంక్షా జ్యోతిగా మారి ఉజ్వలమైన అంతరిక్షం వైపు పయనిస్తాయి. జీవన్ముక్తుడి ప్రశాంత వైశాల్యం, ఉజ్వల సమానత్వం, సుసంపన్న గాంభీర్యం ఆనందానికి దారి చూపుతుంది. ఆశ్రమ జీవనంలో, ఐహిక చైతన్య పరిణామ

1. మదర్ ఇండియా పక్షపత్రిక 3 సెప్టెంబర్ 1949.
2. లెటర్స్ ఆఫ్ శ్రీ అరబిందో ఆన్ ది మదర్ పే. 152

నాటకంలో దివ్య మానవ శ్రీమాత పాత్రను శ్రీ అరవిందులు తన ఎన్నో లేఖల్లో స్పష్టంగా చూపించారు.

"మానవుడు దైవం వైపు మళ్లాలంటే దైవం మానవ రూపాన్ని ధరించాలె. దైవం అట్లా చేస్తూనే దైవంగానే ఉండగల్గుతుంది. ఇది సాధారణ సత్యం."[1]

"ఈ విశ్వంలో, వ్యక్తిలో ఉంటూనే విశ్వానికీ, వ్యక్తికీ అతీతంగా ఉండగలిగే దివ్యశక్తి ఒకటుంది. వీటన్నిటికీ శ్రీమాత ప్రతి రూపం. ఇక్కడి జీవితాన్ని మార్చటం కోసం, ఈ భౌతిక ప్రపంచంలోకి అవ్యక్తమై ఉన్న ఏదో ఒకదాన్ని తేవడం కోసం ఆమె ప్రయత్నిస్తున్నది."[2]

ఆశ్రమం నిర్వహించే విద్యాసంస్థలను చూచిన ఎందరివలెనో డా॥ రెడ్డి కూడా వాటిలో వ్యాపించి ఉన్న శక్తి, సంతోషాల పురాతన స్ఫూర్తి పట్ల ఆకర్షితుడయ్యాడు. శ్రీమాత ఉత్తేజకర పర్యవేక్షణలో ఆశ్రమ బాలబాలికలు భౌతిక సంస్కృతిలో దశలవారీ శిక్షణ పొందుతారు. ఆశ్రమ జీవనానికి సంబంధించి ఈ అసాధారణ దృశ్యాల చిత్రాలను, వివరాలను రెండు భాషల్లో వెలువడుతున్న త్రైమాసిక పత్రిక దిబులెటిన్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో చూడవచ్చు. ఆచార్యులను, శ్రీమాతను పురుషుడు ప్రకృతి ప్రతీకలుగా డా॥ రెడ్డి అభివర్ణిస్తారు. ఆశ్రమంలో శ్రీమాత శక్తి స్వరూపిణిగా కనిపిస్తుంది. సాధకులకు మాత్రం శ్రీమాత పవిత్రమాత. దివ్యమాత; ఆమే యోగాశ్రమం; కాని శ్రీఅరవిందులు కూడా ఆశ్రమం; ఆశ్రమంలో అంతా ఆమే, ఆశ్రమంలో అంతా ఆయన కూడా.

ఆచార్యులు ఎక్కువగా నేపథ్యంలోనే ఉండటం వల్ల, శ్రీమాతే సాధకుల ఆంతరంగిక, బహిర్గత జీవనాల ప్రత్యక్ష దర్శకురాలు. ఆమె ఆధ్యాత్మిక మాతృత్వం పట్ల విస్మయం చెందాల్సిన అవసరంలేదు. ఒక విలేకరితో శ్రీఅరవిందులొకసారి ఇట్లా వివరించారు.

"శ్రీమాతకూ, ఆమెను అంగీకరించే వారికి ఉన్న సంబంధం చైత్య, ఆధ్యాత్మిక మాతృత్వం. ఇది పిల్లవాడిని కన్న తల్లి బంధం కంటే గొప్పది. కన్న తల్లి ఇచ్చేదంతా ఆమె ఇస్తుంది. కాని ఇంకా ఎంతో ఉన్నతంగా ఇస్తుంది. ఇంకా ఎంతో అనంతాన్ని తనలో ఇముద్చుకొంది. ఆధ్యాత్మిక మాతృత్వం అన్నది ఆశ్రమం కనుగొన్న కొత్త సత్యమేమీ కాదు. వేలాది సంవత్సరాలుగా ఆసియా, యూరప్ దేశాలు గుర్తించిన

---

1 లెటర్స్ ఆఫ్ శ్రీ అరబిందో ఆన్ ది మదర్. పే. 142

2 ప్రేయర్స్ అండ్ మెడిటేషన్స్ పే. 6-7

శాశ్వత సత్యమే అది. భౌతిక సంబంధానికి చైత్య ఆధ్యాత్మిక సంబంధానికి మధ్యన ఉన్న భేదాన్ని గూర్చి నేను చెప్పింది కూడా కొత్తే మీ కాదు. అంతటా తెల్సిన విషయమే ఇది. ఇది మామూలు విషయమేనని అందరూ గుర్తించినదే."[1]

పాండిచ్చేరి యోగాశ్రమ సాధకులకు శ్రీమాత ఏమిటో అక్కడి గాలులే చెపుతాయి. హేతుబద్ధంగా వర్ణించ సాధ్యం కాదు. ఆశ్రమ సందర్శకుడికి కళ్లు, చెవులు, గ్రహణ శక్తి చురుగ్గా పనిచేస్తే వెంటనే అది స్ఫురిస్తుంది. యాదాలాపంగా వెళ్లిన మన ఊహా సందర్శకుడు శ్రీమాతను చూడలేకపోతే, లేదా చూసి కూడా ఆమెలోని అసాధరణతను గుర్తించకపోతే, అతనక్కడి సాధకులను గమనిస్తే చాలు. శ్రీమాత పట్ల వారి అనన్య భక్తి, ఆమె దర్శనంలో, ఆమెకు వందన సమర్పణలో, తమ్ము తాము మరచే వారి తన్మయత్వం, నిశ్శబ్ద నిరీక్షణ, మంత్ర ముగ్ధ ప్రశాంతతతో ఆమె సన్నిధిలో సాయంత్రం వుంటే ధ్యానం పూట ఇవీ ఆ సందర్శకుణ్ణి ఆలోచించేట్టు చేస్తాయి. ఆలోచన ప్రతినిధి వలె అతన్ని ఎంతో దూరంగా విశ్వాసప్రాంతాలకు తీసుకువెళ్తాయి. చైనా విద్వాంసుడు ప్రొఫెసర్ టాన్ యున్-షాన్ తన సంక్షిప్త ఆశ్రమ పర్యటన తర్వాత ఈ విధంగా తన భావాలను తెలియపర్చాడు.

"ఆశ్రమంలో శ్రీమాత ఎంతో స్ఫూర్తి మధురమైనది. ఆమె శక్తి కూడా, అట్లాగే భావించకుండా ఉండలేం. నా ఆత్మబంధువుతో మాట్లాడుతున్నట్లు నా కనిపించింది. ఆమె నిజంగా అందరికీ అమ్మే. ఆశ్రమంలో ప్రతిదీ ఆమె అధ్వర్యంలోనే రూపు దిద్దుకొంటుంది." మరో సందర్శకుడైన ఆంగ్ల సాహిత్య ప్రొఫెసర్ ఈ రచయితతో తన అనుభవాన్ని పంచుకొంటూ, శ్రీమాతకు ప్రణమిల్లేటప్పుడు తనలో ఒక అసాధారణ మానసిక ఉద్రేకం, ఉత్సాహం కల్గిందని, దాంతో రాత్రంతా తనకు నిద్ర పట్టలేదని తెలిపాడు. ఇది వరకు విశ్వభారతిలో పనిచేసి ప్రస్తుతం ఆశ్రమ వాసి అయిన శిశిర్ కుమార్ మిత్రా శ్రీమాతను మొట్టమొదటిసారిగా 1939లో దర్శించాడు. ఆయన పూర్తిగా మంత్రముగ్ధుడై ఉత్సాహంతో ఇలా వ్రాస్తాడు.

"ఆమె (శ్రీమాత) వయసులేనిది శాశ్వత యౌవనానికి ప్రతిరూపం. ఆమె నిజంగా రాజరాజేశ్వరి, పరమేశ్వరుడి దివ్య సహచారిణి. శోకతప్తులైన తన పిల్లలకు అభయాన్ని ప్రసాదించి, తన దివ్య దరహాసంతో పిలిచి తీసుకొమ్మని అజరామరత్వం పొందమని కోరే మాత."[2] శ్రీ అరవిందుల వలెనే శ్రీమాత కూడా ఎందరో సాధకులను

---

1. లేటర్స్ ఆఫ్ శ్రీ అరబిందో ఆన్ ది మదర్ పే. 95-96
2. శ్రీ అరబిందో - ఎ హోమేజ్ పే. 21

నిర్మల, గంభీరమైన భక్తి కవిత్వం వ్రాయమని ప్రేరణ నిచ్చింది. ఒక పూంజాలాల్ ఒక నిశికాంత్, ఒక దిలీప్ లేదా ఒక నిరోధ్, ఒక అర్జవ లేదా ఒక అమల, కవిత్వం ద్వారా తమను తాము వెల్లడించుకున్నారంటే, ఆ కవితలు శ్రీమాతకో శ్రీ అరవిందుఇలకో సమర్పిస్తారు. సంపూర్ణ యోగం సాధనకు మూల సూత్రం: "జ్ఞాపకం ఉంచుకో, సమర్పించు" అన్నది. శ్రీమాతతో ఐక్యం పొందడమే యోగా ప్రాథమిక సూత్రం. అంతా ఆమె పర్యవేక్షణలోనే జరుగుతుంది. అన్నీ ఆమెకే అంకితంగా సమర్పిస్తారు.[1]

౨౫

చాలాకాలం క్రింద 1912లో శ్రీమాత ఇట్లా వ్రాసింది. "ఈ భౌగోళిక పరివర్తన, సంలీకరణ రెండు పద్ధతుల ద్వారా సాధించవచ్చు. అది రెండూ పైకి వ్యతిరేకంగా కన్పించినా, ఒక్కటై పరస్పరం చర్య ప్రతిచర్యలతో, ఒకదాని నొకటి సంపూర్ణం చేసుకుంటాయి.

a) వైయక్తిక పరివర్తనం, పరమాత్మతో సమాగమానికి దారి చూపే అంతర వికాసం.

b) సాంఘిక పరివర్తనం. వ్యక్తి వికాసానికి అనుకూలమైన వాతావరణాన్ని నెలకొల్పటం.

సాంఘిక వాతావరణం మనిషిపై ప్రభావాన్ని చూపుతుంది. ఆ వాతావరణం విలువ వ్యక్తి విలువపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి ఈ రెండూ కలిసి జంటగా ముందుకు సాగాలె.[2] ఈ పరస్పర సహకార విధానాలను ప్రారంభించి, నియంత్రించి, సమతులనం చేసే స్థితికిరావడానికి శ్రీమాత కెన్నో సంవత్సరాలు పట్టింది. శ్రీ అరవిందులు, శ్రీమాత వంటి ఆధ్యాత్మిక శక్తులు మొదట 1914లో ఆ తరువాత 1920లో కలవడం, విధి నిర్దేశంపై కలిసి పునాదులు వేయడం, ప్లింత్ స్థాయికి ఉద్ధరించడం ఉజ్వలమైన దివ్య జీవన సౌధాన్ని నిర్మించడం జరగాల్సి వచ్చింది. వారి పూర్ణ యోగ ప్రాథమిక లక్ష్యం "అంతర ఆత్మ వికాసం. దీన్ని అనుసరించడం ద్వారా

---

1. శ్రీ అరవిందుల కొన్ని లేఖల్లో ఆశ్రమంలో శ్రీమాత పాత్రపై వ్యాఖ్యలు కనిపిస్తాయి. ఒక లేఖలో ఇలా ప్రకటిస్తా రాయన. "శ్రీమాత చైతన్యం నాదీ ఒక్కటే. రెండు రూపాల్లో ఒకే దివ్యచైతన్యం. ఆ నాటకానికది అవసరం". మరో లేఖలో సాధకులు శ్రీమాత నుండి వెలుగును, శక్తినీ పొందాలని తాను చేసిన ఏర్పాట్లు గురించి వివరిస్తారు. "ప్రత్యక్షంగా నానుండి కాదు. ఈ ఏర్పాటు తాత్కాలిక లక్ష్యంతో చేసింది కాదు. ఎందుకంటే అదొక్కటే నిజమైన, ప్రభాతశీలమైన మార్గం కాబట్టి." లెటర్స్ ఆఫ్ శ్రీ అరబిందో ఆన్ ది మదర్, పే 10-11

2 వర్డ్స్ ఆఫ్ ది మదర్ పే. 2

ప్రతి వాడూ క్రమంగా అన్నింటిలో ఒకే ఆత్మను దర్శిస్తాడు. మానసిక, ఆధ్యాత్మిక, అతిమానస చైతన్యం కంటే ఉన్నతమైన చైతన్యాన్ని పొందుతారు. ఆ చైతన్యమే మానవ ప్రకృతిని మార్చి దైవికం చేస్తుంది."[1] పాండిచ్చేరి ఆశ్రమం ఒక ప్రయోగశాలగా మారి ఈ అద్భుత ప్రయోగాన్ని కొనసాగించింది. కాని ఒక విధంగా, ఈ ప్రపంచమంతా శ్రీ అరవిందాశ్రమంలోనే ఉంది. ప్రపంచం నలుమూలల నుండి ఆచార్యుల (మాస్టర్) వైపు శ్రీమాత వైపు అదృశ్యహస్తాలు సాచి, పిలచి నిస్సహాయ విజ్ఞప్తులను పంపుతూనే ఉన్నారు. వారు చేసే విన్నపం అత్యవసరమైనదీ, చిత్తశుద్ధితో కూడినదీ అయితే ప్రతిస్పందన ఎప్పుడూ తప్పక నిర్ణయాత్మకంగా ఉంటుంది.[2]

ఈ బృహత్కార్యం ప్రారంభమైందని ఆచార్యుడూ, శ్రీమాత మనను హెచ్చరిస్తారు. అతిమానస అవరోహణ, మానవుని దైవీకరణ, ఇహప్రకృతిని దివ్య ప్రకృతిగా పరివర్తన ఇవీ లక్ష్యాలు. ఇంకా ఎక్కువ చెప్పటం ప్రమాదకరం. శ్రీ అరవిందులు ఇట్లా ప్రవచిస్తారు. "నాకు నిస్సందేహంగా ఖచ్చితంగా తెలుసు – అతిమానసం అన్నది సత్యమని, దాని ప్రవేశం వస్తు సహజంగానే అనివార్యమని. అది ఎప్పుడు, ఎలా అన్నదే ప్రశ్న. అది కూడా ఎక్కడో పైన ముందే విధిలిఖితమై నిర్ణయింపబడింది. కాని ఇక్కడ పరస్పర వ్యతిరేక శక్తుల భీకర సంఘర్షణ మధ్య దానికోసం కొట్లాడుతున్నాం. ఆ పోరాటం ఇప్పుడే జరగాలని ఎన్నో ఆత్మల నిక్కడికి పంపటం మాత్రం నిస్సందేహం. అదీ పరిస్థితి. నా విశ్వాసం, సంకల్పం ఇప్పటికొరకే.[3] "భౌతిక పదార్థం, ప్రాణం రెంటినీ కొత్త సంయోగంలో కలపాలె.

అహో ! ఆత్మకు, ఇంద్రియాలకు చెందిన
భగవంతుని రెండు మహాప్రపంచాలు
ఈ సంకుచితమైన పడవపై
పెళ్లి చేసుకుంటున్నాయి !

అవును – ఈ మశక విన్నపాన్ని
నీ శరీర దివ్య ప్రాంగణంలోని
దివ్య ప్రాణులు మన్నించి ప్రతిస్పందిస్తాయి.[4]

---

1 శ్రీ అరబిందో అండ్ హిజ్ ఆశ్రమ్, పే. 61

2 కె.డి. సేత్నా, "ఎ పర్సనల్ ప్రిఫేస్" టు హిజ్ అడ్వెంచర్ ఆఫ్ ది అపొకాలిప్స్.

3 లెటర్స్ ఆఫ్ శ్రీ అరబిందో, సెకండ్ సిరీస్, పే. 67–68

4 ఫ్రాన్సిస్ థాంప్సన్.

అట్లాగే మనసును కూడా అధిగమించాలె. ఒక కొత్త సూత్రం, అతి మానసాన్ని క్రిందికి తెచ్చి ఇహ చైతన్యంతో అనుబంధించాలె. ఇదంతా వృథా స్వప్నమే తప్ప మరేది కాదా? అసురుడు విజయాన్ని సాధిస్తున్నాడు. దేవత పలాయనం చిత్తగిస్తున్నది. "విశ్వాసం సన్నగిల్లింది. కృతజ్ఞత పుట్టలేదు"., మహత్తు చేయాల్సిన పని అల్పత్వం చేస్తున్నది. పలాయనమే నేటి నైజం. కాని శ్రీమాత వాడి పలుకులు ఈ స్థితిని సవాలు చేస్తాయి.

"ముందుకుపో ఎప్పుడూ ముందుకే !
చీకటి సొరంగం వెలుపల కాంతి ఉంది. . .
యుద్ధం చివర ఉంది విజయమే !"

మలిపలుకులు

ఈ పుస్తకం నవంబరు 1949లో వ్రాయబడింది. ఆ రెండేళ్ళలో ఆశ్రమం లోపలా బయటా శ్రీమాత మహత్తర కార్యం మరింత విస్తృతంగా తీవ్రతతో కొనసాగింది. ఆ తర్వాత ప్రపంచాన్నంతా కుదిపివేసిన సంఘటన ఒకటి జరిగింది. 5 డిసెంబర్, 1950న శ్రీ అరవిందులు అస్తమించారన్న వార్త ప్రసారమైంది. సావిత్రి పుస్తకంలో జోస్యం చెప్పిన విధి చివరకు ప్రకటితమైంది.

రాత్రి శాశ్వతత్వంలో అతడు ప్రవేశించాలె,
సూర్యుడిని గుర్తించినట్లు భగవంతుని చీకటిని తెల్సుకోవాలె,
అందుకోసం సొరంగంలోకి దిగాలె.
అందుకోసం దుఃఖమయ మైదానాలను ముట్టడించాలె,
నాశరహితుడు, విజ్ఞాననిధి, అనంతుడు
ప్రపంచాన్ని రక్షించటం కోసం నరకానికే ప్రయాణించాలె
అన్ని ప్రపంచాలు కలిసే సరిహద్దుపై శాశ్వత ప్రకాశంలోకి తేలుతాడు
అప్పుడీ దుఃఖం అంతమౌతుంది.
ఈ మర్త్య జీవనం శాశ్వతానందానికి నిలయమౌతుంది.
ఈ శరీరపు ఆత్మ శాశ్వతత్వాన్ని చవిచూస్తాడు.
అప్పుడే ప్రపంచ రక్షకుడి కార్యం నెరవేరుతుంది.[1]

---

1 సావిత్రి 4, అధ్యాయం 2

ప్రాణాలను హరిస్తుందా అనిపించే శీతాకాలం తర్వాత మధుర వసంతం రాక తప్పదు. కాని సాధారణ మానవులు తమ అవగాహనా పరిధిలో ఈ సంఘటనను అర్థం చేసుకొన్నారు. విచారించారు. దిగ్భ్రమ చెందారు–కోలుకొన్నారు. కాని ఆశ్రమములో మరో ప్రకాశవంతమైన భావం నెలకొంది. డిసెంబర్ 5న ఉదయం 1.26 a.m. గంటలకు ప్రాణం పోయినా, ఎన్నో రోజులు శ్రీ అరవిందుల భౌతిక శరీరం "విజయవంతమైన నిశ్శబ్దపు గాంభీర్యంలో వేలాది మందికి అంతిమ దర్శనం కోసం అట్లాగే ఉంచారు."[1]

"శ్రీ అరవిందుల శరీరం అతిమానస ప్రకాశంతో శక్తిమయమై ఉన్నందున, శిథిలమౌతున్న చిహ్నాలేవీ కనిపించలేదు" అని శ్రీమాత ప్రకటించింది. కృత్రిమ రసాయన పద్ధతులనుసరించకుండానే ఇట్లా జరిగింది. డిసెంబర్ 9 సాయంత్రం 5 గంటలకు ఆశ్రమ ప్రాంగణంలోనే శ్రీ అరవిందుల శరీరాన్ని ఖననం చేసారు.[2]

అంతులేని దుఃఖ సమయంలో శ్రీమాత ఓదార్పు మాటలు పునరుజ్జీవన ప్రకాశంతో వెలిగాయి.

"ప్రభూ, ఈ ఉదయాన్నే నీ కార్యం నెరవేరేదాకా నాతోనే ఉంటానని, మాకు వెలుగునిచ్చి ముందుకు నడిపే చైతన్యంగానే కాకుండా, క్రియాశీలమైన ప్రత్యక్ష రూపంలో కూడా ఉంటానని వాగ్దానం చేసావు. నువ్వంతా ఇక్కడే ఉంటానని, ఈ భూమి రూపాంతరం చెందేదాకా ఈ భూమి వాతావరణాన్ని వీడనని హామీ ఇచ్చావు. . ."

డిసెంబర్ 9న

"మా ఆచార్యులకు భౌతిక శరీరంగా ఆవరించి ఉన్న నీకు మా అనంత కృతజ్ఞతలు. మాకోసం ఎంతో చేసిన నీకు, మాకోసం ఎంతో పని చేసి, శ్రమించి, కష్టించి, ఆశించి, సహించిన నీ ముందు, మాకోసం అన్ని సంకల్పించి, అన్నీ ప్రయత్నించి, సిద్ధం చేసి, సాధించిన నీ ముందు, మేము మోకరిల్లి మీకు మేమెంత ఋణపడి ఉన్నామో ఎప్పుడూ, ఒక్క క్షణం కూడా మరిచిపోవద్దని ప్రార్థిస్తున్నాం."

డిసెంబర్ 14న "మానతోనే చైతన్యంగా, సజీవంగా ఉన్న శ్రీ అరవిందుల గురించి దుఃఖించటం ఆయన పట్ల మహాపచారం."

---

1. కె.డి. సేత్నా, ది పాసింగ్ ఆఫ్ శ్రీ అరబిందో, పే. 5
2. (వివరాలకు నిరోధ్‌బరన్ రచించిన "శ్రీ అరబిందో: అయామ్ హియర్, అయామ్ హియర్." కె.డి సేత్నా "ది పాసింగ్ ఆఫ్ శ్రీ అరబిందో: ఇట్స్ ఇన్నర్ సిగ్నిఫికెన్స్ అండ్ కాన్సెక్వెన్స్."

జనవరి 18, 1951న

"రూపాంతరీకరణ కార్యక్రమానికి ఇంకా దోహదం చేయటం కోసం తన భౌతిక జీవితాన్నే త్యాగం చేసిన ఆయన సమక్షంలో మేము నిలిచాం.

ఆయన ఎప్పుడూ మనతోనే ఉంటాడు. మనమేం చేస్తున్నామో, మన ఆలోచనలు, భావాలు, పనులన్నీ ఆయనకు తెలుసు."

ఇంకా మన వెంట "ప్రత్యక్షంగా" ఉంటూనే తన చైతన్యం శ్రీమాత చైతన్యం ఒకటేనని శ్రీ అరవిందులు హామీ ఇచ్చారు. "శ్రీమాత చైతన్యాన్ని ఎవరైనా నిజంగా భావించగలిగినట్లయితే, ఆమె చైతన్యం వెనుక నేనున్నానని అతనికి తెలియాలి."[1] అంధకార ప్రతికూల శక్తులను పోరాడుతూ కాంతిని తేవడానికి శ్రీమాత ఒంటరిగా చేసే కృషి దృశ్యం గ్రహించే మనస్సుకు ఆచార్యులూహించిన దివ్య పోరాట చిత్రాన్ని రూపుదిద్దుతుంది. ఆచార్యుల ప్రజ్వలిత శబ్దాల్లో.

ఈ విశాల ప్రమాదంలో వేరుగా ఉంటూ
తన నిశ్శబ్ద సంకల్ప మహాబలంలో
తన త్యాగమయ ఆత్మాభినివేశంలో
తన బృహత్ కార్యానికి ఆమె ఒక్కతే చాలు.[2]

ఆశ్రమ జీవనంలో శ్రీ అరవిందులు పైకి లేరనిపించే భావన ఆయన ఉన్నాడన్న అద్భుత వాస్తవాన్ని మరింత ఎత్తులకు తీసుకుపోయే అసాధరణ ఫలితాన్నిచ్చింది. నిరోధ్‌ఇబరన్ ఇట్లా వ్రాస్తారు. "ఆయన సమాధి నుండి వేయి జ్వాలలు పైకెగసి, మన ఆత్మలో నెలకొన్నట్లు, సదా పునరుజ్జీవన అగ్ని రూపంలో మండుతున్నట్లు అనిపిస్తుంది. ఆయన ఉపస్థితి శ్రీమాత ఆత్మను, శరీరాన్ని ఆవహించి, కలిసిపోయి, తద్వారా వెలుగులను విరజిమ్ముతూ మొత్తం వాతావరణంలో వ్యాపించింది. ఆయన ఉపస్థితిని మనం చూడవచ్చు. ఆయన పాదాల సవ్వడిని, లయబద్ధమైన ఆయన స్వరాన్ని నిత్యచైతన్యంతో, భౌతిక శరీర చ్ఛాయలు లేకుండా వినవచ్చు."

ఈ లోగా రూపాంతరీకరణ కార్యం స్థిరంగా ముందుకు పోతూనే ఉంది. శ్రీమాత శక్తులు ఇదివరకటి కంటే మరింత చురుకుదనంతో భూమిపై తన బృహత్తర లక్ష్యానికి సంబంధించిన వివిధ పనుల్లో పాల్గొంటున్నాయి. మిగతా ఆశ్రమ కార్యక్రమాలతో

---

1. లెటర్స్ ఆఫ్ శ్రీ అరబిందో ఆన్ ది మదర్, పే. 10
2. సావిత్రి 4, అధ్యాయం 2
3. శ్రీ అరబిందో, "ఐ యామ్ హియర్, ఐ యామ్ హియర్" పే. 24

పాటు శ్రీ అరవిందులు, శ్రీమాత ప్రవచించిన పూర్ణయోగ పథకానికి మూలకంగా ఒక అంతర్జాతీయ "విశ్వవిద్యాలయ కేంద్రాన్ని" ఆమె వ్యక్తిగత పర్యవేక్షణలో స్థాపించారు. 24 ఏప్రిల్ 1951వ తేదీన శ్రీ అరవిందుల స్మారక సభా సందేశంలో శ్రీమాత ఇట్లా ప్రకటించింది.

"శ్రీ అరవిందులు మన మధ్యలోనే ఉన్నారు. తమ సృజనాత్మక ప్రతిభాశక్తులతో ఈ విశ్వవిద్యాలయ కేంద్ర స్థాపనకు ఆయన అధ్యక్షం వహిస్తారు. మానవాళి భవిష్యత్తరాలు అతి మానస కాంతిని పొందే విధంగా తయారు చేసేందుకు, తద్వారా నేటి ఉన్నత వర్గాలు కొత్త తెగగా అవతరించి నూతన కాంతిని, శక్తిని, జీవితాన్ని భూమిపై అవతరింప జేయటానికి ఇది ఉత్తమ సాధనమని ఎన్నో ఏండ్లుగా ఆయన భావించారు". పాండిచ్చేరిలో విశ్వవిద్యాలయ కేంద్రాన్ని శ్రీమాత అప్పుడే ప్రారంభించింది. మానవజాతిని అతిమానస స్థితికి తేవడంలో ఈ విద్యా ప్రయోగం కీలక పాత్రను వహిస్తుంది. దీని సిలబస్‌లో బహిష్కృత విషయాలు కాని అనవసర అధ్యయన కేంద్రీకరణ కాని లేవు. అందులో కళలు-శాస్త్ర విజ్ఞానం మధ్య అపవిత్రమైన ప్రాతికూల్యం లేదు. అన్నిటికీ సమగ్ర సంయోజనం ఉంది. ఇక్కడ బోధించే, గ్రహించే విద్యకు అత్యాధునిక విద్యాసంస్థల్లో వలె వ్యాపారీకరణ లేదు. మేధోపరమైన, శాస్త్రీయమైన క్రమశిక్షణ ఉంటుంది. కళల మానవీయ ప్రభావం ఉంటుంది. కాని అందరూ ఒకే విధంగా శ్రీ అరవిందుల విజ్ఞాన కలశం నుండి తీర్థాన్ని సేవిస్తారు. ఆత్మ వైశాల్యము, సృజనాత్మక ఏకత్వపు ముద్రను పొందుతారు. నళినీ కాంత గుప్త మాటల్లో కేంద్రలక్ష్యం "ఒక కొత్త జీవనం, కొత్త చైతన్యంతో భూమిపై కొత్త మానవ జాతిని స్థాపించడమే. ఇది సాధించగలం సాధిస్తాం అన్న వాగ్దానాన్ని ఇస్తుంది. ఈ వాగ్దానాన్ని అమలు పరచడానికి ఆమె మన మధ్య ఉంది." నిరాశా నిస్పృహల దీర్ఘరాత్రి ముగియబోతున్నది. అల్ప విజ్ఞానపు మిణుకు మిణుకు కాంతులు ఉన్నత జ్ఞాన ధవళ ప్రకాశంలో అదృశ్యమౌతాయి. అందం, ఆనందాలతో శక్తి, జ్ఞానం ద్విగుణీకృతమౌతుంది.

అట్లా దివ్యత్వానికి తలుపులు తెరుస్తుంది
సాధారణ ప్రకృతులు ఉద్ధరించబడతాయి
సాధారణ పనులు ఆత్మ ప్రకాశంతో వెలుగొందుతాయి
సాధారణ వస్తువుల్లో దైవాన్ని కలుసుకొంటాయి
రహస్యంగా ఉన్న పరమాత్మ అవతరణకు ప్రకృతి జీవిస్తుంది
పరమాత్మ మానవ నాటకాన్ని చేపడతాడు
ఈ ఐహిక జీవనం దివ్య జీవనమౌతుంది.[1] *(సావిత్రి, 9, అధ్యాయం 1)*

ఓ ప్రభూ! నీవు మాఎదుట తెరచిన విశాలమైన
నూతన పథంలో, శ్రమావతీగతానికి కృతజ్ఞతాపూర్వక
నమస్సులతో వెలుగు వచ్చింది, మార్గం వివృతమైంది.
మేము వేగంగా పురోగమిస్తాము - సచేతన
విస్తృతంగా సాక్షాత్కరించిన వినూతన క్షేత్రపు
సరిహద్దులలో, సమన్వితమైన ఆరాధనా పూర్వక
సమర్పణతో మీకు ప్రణమిల్లుతున్నాము.

శ్రీమాత